ISSN No : 2581-7477

# సాహిత్యప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి -2 సంచిక - 4 జనవరి 2021 కృష్ణా పేజీలు 68 రూ. 20



సాహితీస్రవంతి


రైతులకు మద్దతుగా కలాలు, గళాలు
రచయితలు, కళాకారులు, మేధావులు, సాహిత్య, సాంస్కృతిక, కళా సంస్థల
సంఘీభావ కార్యక్రమం
రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక.






రైతులకు మద్దతుగా కలాలు,

సాహిత్య ప్రస్థానం

## 21వ శతాబ్దం, మూడవ దశాబ్దంలోకి ...

**2020** కేవలం ఒక సంవత్సరం మాత్రమే కాదు, 21వ శతాబ్దిలో రెండు దశాబ్దాలు ముగిసిపోయాయి. కరోనా రెండవ దఫా దాడి హెచ్చరికలతో నూతన వత్సరం మొదలవుతున్నది. మానవ విజయ సంకేతంగా రకరకాల వాక్సిన్లు తయారవుతుంటే ... వాణిజ్య ప్రపంచ చిహ్నంగా వాటి సమర్థత, సరఫరా, లభ్యతలపై అలుముకున్న సందేహాల మధ్యలోనే ప్రపంచం నిరీక్షిస్తున్నది. లాక్‌డౌన్లతో ఉద్యోగాల మేధంతో, హక్కుల హరణంతో సాగిన గత ఏడాది అనుభవం ముగిసిపోతుందని ఆశిస్తున్నది. ఓటమి పాలై కూడా చూరుపట్టుకు వేళ్లాడిన అమెరికా అధినేత ఆఖరికి తలవంచగా... కొత్తగా వచ్చే అధ్యక్షుడు కూడా అదే బాటలో మరింత తీవ్రమైన సంకేతాలు ఇస్తున్నారు.

దేశ రాజధాని నెలరోజులకు పైబడి రైతుల సమరానికి వేదిక కావడం ప్రస్తుత పరిస్థితికి ఒక ప్రతిబింబం. గతంలో ఇదే కాలం సిఏఎ వ్యతిరేక ఆందోళనలు చూశాం. ఈసారి కేంద్రం ఏకపక్షంగా తెచ్చిన రైతు వ్యతిరేక శాసనాలపై రణశంఖాలు మోగుతూనే వున్నాయి. ఆర్థిక క్షీణత, అప్పుల భారం వెన్నాడుతున్నది. రాష్ట్రాల హక్కులపై జరిగిన రకరకాల దాడులు జమిలి జపంతో రాజ్యాంగాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఇదే అదనుగా శ్రమజీవుల హక్కులనూ కుదించేందుకు ప్రభుత్వాలు సిద్ధమైపోయాయి. మతసామరస్య సంప్రదాయాలను మంటగలిపే విద్వేష రాజకీయాలు విజృంభిస్తున్నాయి. మతాంతర, కులాంతర వివాహాలు నేరమైపోతున్నాయి. దళితులపై, యువతులపై అత్యాచారాలు దేశాన్ని కలచివేస్తున్నాయి. న్యాయ వ్యవస్థ కూడా మధనానికి గురవుతున్నది. వీటన్నిటిని దారికి తెచ్చుకోమని సందేశమిచ్చి 2020 నిష్క్రమించింది.

ఒకప్పుడు తెలుగునాట గొప్ప ప్రచారమైన విజన్ 2020 ఆర్భాటంలో ఇప్పుడు అసలైన 2020ని పోల్చిచూడటం ఏ రచయితకూ అంతుపట్టని కఠోర వాస్తవికతగా దర్శనమిస్తున్నది. ఈ కాలంలో సాహిత్య సభలూ, సాంస్కృతిక సమ్మేళనాల బదులు వెబినార్లే 'వేబిక'లయ్యాయి. వ్యథార్థ యథార్థాన్ని కవులు, రచయితలు, గాయకులు గొప్పగా అక్షరీకరించారు. వలస ప్రాణుల వేదనలకు చలించిపోయారు. పుస్తకావిష్కరణలూ, భావావిష్కరణలూ అన్నీ దూరం నుంచే 'వేబిక'ల్లో పంచుకున్నారు. సాహిత్య జీవులకు ఇది మరో కొత్త అనుభవం. భద్రజీవితం అనుకున్నది ఛిద్రమై పోవడం బుద్ధిజీవుల కళ్లు తెరిపించింది. కోరలు చాచిన కరోనా మహమ్మారి ఎందరో ప్రముఖులనూ, సాహితీ మిత్రులను దూరం చేసింది. వారి స్మృతికి నివాళు లర్పిస్తూ రాబోయే రోజుల్లో జాగ్రత్తలు పాటిస్తూ జనం కోసం గళమెత్తడమే చేయగలిగిన చేయవలసిన కర్తవ్యం.

కరోనా నేపథ్యంలో మీడియా, పత్రికలూ కూడా దెబ్బతిన్నాయి. కొన్ని సాహిత్య పత్రికలు వెబ్‌రూపానికే పరిమితమయ్యాయి. ప్రస్థానం మాత్రం రెండు మూడు సంచికలు ప్రత్యక్షంగా తీసుకురాలేకపోయినా మీ ఆదరణతో వెంటనే కోలుకోగలిగింది. నిరాఘాటంగా వెలువడింది. ఇందుకు చేయూతనిచ్చిన దాతలకు, శ్రేయోభిలాషులకు మా కృతజ్ఞతలు. రచయితలకూ, పాఠకులకూ ధన్యవాదాలు. **కాలం కఠోరమైతే మన సంకల్పం మరింత దృఢతరమవుతుందని మరోసారి చాటిచెబుదామని కోరుకుంటూ అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.** ■

ప్రధాన సంపాదకుడు
**తెలకపల్లి రవి**
వర్కింగ్ ఎడిటర్
**సత్యాజీ**

సంపాదకవర్గం
**కె.సత్యరంజన్**
**కెంగార మోహన్ ◆ వొరప్రసాద్**
*మేనేజర్ :* **కె.లక్ష్మయ్య**

బొమ్మలు
**తుంబలి శివాజి**
**చిదంబరం**

Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akulavari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh. Editor : Telakapalli Ravi

## ఈ సంచికలో | సాహిత్య ప్రస్థానం | జనవరి 2021

### కథలు


ఆశ – డాక్టర్ విజయ భక్ష్.................5
అల్లాంరబ్బా – తూర్పింటి నరేష్ కుమార్...........22
వేట – బవా చెల్లదురై .......................32
సంకల్పం – గన్నవరపు నరసింహమూర్తి.........44


### కవితలు


ఈ కలం పేరు – డాక్టర్ వేలం పళని................. 9
కేక – గిరి ప్రసాద్ చెలమల్లు ............................ 9
గగనానికి మార్గం – కళ్యాణదుర్గం స్వర్ణలత ...........18
హంసధ్వని – లక్ష్మీ కంది మళ్ల .........................18
కిసాన్ పై లాఠీ – నాగరాజు మద్దెల.................... 21
అడవి మల్లెలు – ఉప్పరి తిరుమలేష్................... 24
నాగలి యుద్ధం – శిఖా–ఆకాష్..........................27
మేలు కొలుపు – డా. కట్టా సత్యప్రసాద్ ................ 31
విశ్వకవి – ప్రొ॥ ఇ.శ్రీనివాసరెడ్డి......................... 31
నానీలు – బసు పోతన ..................................35
సీమసేద్యం – రజిత కొండసాని ........................ 36
పూర్తి చేయని పద్యం – సాంబమూర్తి లండ.............39
చెద పురుగులు – డా.కె.జి.వేణు......................... 42
చూస్తావేమిటి భయ్యా – ఏటూరి నాగేంద్రరావు.........43
స్తబ్ధకోశం – డాక్టర్ ఎన్.గోపి............................47
పోరాటం సెగకు చలి వెచ్చనవుతుంది – డా॥కత్తి పద్మారావు... 48
నక్షత్ర దీపాలు – విల్సన్ రావు కొమ్మవరపు............ 51
మట్టి యుద్ధం –సరికొండ నరసింహరాజు............ 52
అవిశ్రాంత యోధుడు – కోడే యామినీదేవి............ 56


### వ్యాసాలు


సాహిత్య ప్రస్థానం డిసెంబర్ 2020 పురస్కారాలు.......10
రైతుకు కుడి ఎడమల తెలుగు కథకులు
– రాచపాళెం చంద్రశేఖరరెడ్డి .................... 11
అధ్యాపక దీపం, అనువాద రత్నం
– తెలకపల్లి రవి..................................19
'గే' కమ్యూనిటీకి బాసటగా ...
– సుహాసిని రెడ్లం ................................25
వొడువని ఆత్మకథ వృద్ధాప్యం
– గడ్డం సత్యపాల్ రెడ్డి .............................28
కన్నీళ్ల సిరాతో వెన్నంటిన ప్రాణ స్పర్శ
– తిరునగరి శ్రీనివాస్ ..............................37
శాస్త్రవేత్తలపై స్మృతి కవిత్వం
– సుంకర గోపాలయ్య .............................40
వ్యవసాయం స్వేచ్ఛా మార్కెట్ – ప్రభాత్ పట్నాయక్ ...49
అనంతమైన ఆపేక్షని చూపిన 'ఆకాశమంత చూపు'
– అయ్యగారి సీతారత్నం .....................53
కందుకూరి సాహిత్య కృషి, సంస్కరణ కృషి పరస్పర పూరకాలు
– వకుళాభరణం రామకృష్ణ .......................57
దేశభక్తి సినిమాలూ–పాటలూ – పొన్నాడ సత్యప్రకాశరావు..58
రైతు పోరాటానికి మద్దతుగా కలాలూ గళాలూ ............. 62
డైరీ ........................................................64
స్వీకారం ...................................................65



ISSN No: 2581 - 7477


**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**


:: రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా ::

సాహిత్య ప్రస్థానం, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, కుంచనపల్లి, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా. ,
ఫోన్ : 0866-2577248, చందా వివరాలకు : 94900 99057, రచనలకు : 94900 99167
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com

1 సంవత్సర చందా రూ. 240 ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000

Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585,
IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.



# ఆశ

- డాక్టర్ విజయ భక్ష్
9441382303

అన్నమాచార్య ఆడిటోరియమంతా మార్మోగిపోతోంది. నేనున్నది అమెరికాలోనా, ఇండియాలోనా అనే అనుమానం వచ్చింది. ఆ హైస్కూల్ ఆడిటోరియమంతా కలయ చూశాక నేనున్నది అమెరికాలోనే.. సందేహం లేదనిపించింది. ఎందుకంటే ఇక్కడి పబ్లిక్ స్కూళ్లలో వసతులు, విశాలమైన ఆటస్థలాలు, ఆడిటోరియాలు చూశాక మన ప్రభుత్వ బడుల్లో అలాంటివెందుకు లేవా అనిపిస్తోంది.

ఇంతలోనే మరొక పాట మొదలవుతోందంటూ తీయని గొంతుకతో చక్కటి వ్యాఖ్యానంతో చెప్పింది యాంకర్. పిల్లలు, పెద్దలు సామూహికంగా విడిగా ఏ మాత్రం తడబాటు లేకుండా ఎంత చక్కగా పాడుతున్నారో! ఇంత బాగా పాడటానికి ఎంత కృషి చేసుంటారో! ఇన్ని వేల మైళ్ల దూరాన ఉండి కూడా వీళ్లిక్కడ సంగీతం, నాట్యం పట్ల చూపిస్తున్న శ్రద్ధ, మమకారాన్ని చూస్తుంటే ఎంత ఆశ్చర్యం వేస్తుందో! తల్లిదండ్రులు వాళ్లని సెలవు రోజుల్లో శ్రద్ధగా క్లాసులకి తీసుకు వెళ్లటం, వేల డాలర్లు పెట్టి అరంగేట్రం చేయించడం... పెద్ద ఫంక్షను... అందర్నీ ఆహ్వానించడం... అదొక పెద్ద ఉత్సవంలా జరుగుతోంది. వీకెండ్ (వారాంతం) అంటే వేసవి కాలమంతా తప్పనిసరిగా అరంగేట్రాలు, పార్టీలు, గ్రాడ్యుయేషన్ ఫంక్షన్లు...

నా ఆలోచనల్లో నుండి ఆ అమ్మాయి వ్యాఖ్యానం ఒక్కసారిగా నన్ను తన వైపుకి మళ్లించింది. ఎంత శ్రావ్యంగా కీర్తనలు ఆలపిస్తున్నారు అని అనుకొనే లోపే... అంత కంటే బాగా ఆ పదాల్లోని గొప్పతనాన్నంతా తన మాటల్లో చెబుతోంది ఆ అమ్మాయి. ప్రతి పాటలోని భావాన్ని తాను ఆకళింప చేసుకొని, అనుభూతి చెంది, హృదయపు లోతుల్లోంచి మాట్లాడుతున్నట్లుంది. ఆ సంకీర్తనాచార్యుని పదాల్లోని మాధుర్యాన్ని వివరించిన తీరు వింటుంటే నిజంగా అవి రాసిన అన్నమయ్య కూడా మురిసి పోయేవాడేమో అనిపించింది. అందుకే అంటారు... : ఏ విషయమైనా రాణించాలంటే అది సరైనవారి చేతుల్లో పడాలి. ఇవాళ్టి ఈ కార్యక్రమానికి రావటం, వినటం అంతా అదృష్టం.

మా అమ్మాయి నందిని ఆ కార్యక్రమ పర్యవేక్షకుల్లో ఒకరవటాన నన్ను తనకు తెలిసిన ప్రగతికి అప్పగించింది. ఒక్కొక్క పాట వినే కొద్దీ నా మనసులో ఆనంద తరంగాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. దానికి తగ్గట్లు యాంకర్ కీర్తి మాటలు శ్రోతలపై మాయాజాలం వేస్తున్నాయి. నేను నా సంతోషాన్ని పట్టలేక పక్కనున్న ప్రగతితో 'ఈ అమ్మాయి చాలా అద్భుతంగా మాట్లాడుతోంది. తెలుగు అంత బాగా ఎట్లా వచ్చిందో....' అన్నాను. నా మాటలు పూర్తి కాకుండానే ప్రగతి.. 'ఆ ఏడిసిందిలే. తాను మాలాగే ఐటియే. కానీ మీరనుకున్నట్లు తానేమీ మన ఆరిజనే కాదు. ఏదో మాట్లాడుతోంది. అంతే!' అని కొంచెం వ్యంగ్యంగా అంది. నాకు ఆశ్చర్యం వేసింది. ఏమిటిట్లా మాట్లాడుతోంది అనుకున్నాను. ఆ తర్వాత ఆ కార్యక్రమం అయ్యేవరకూ నేనింకేమీ మాట్లాడలేకపోయాను.

◆ ◆ ◆

కారు డ్రైవ్ చేస్తోంది నందిని. 'అమ్మా! సీటు బెల్టు పెట్టుకున్నావు కదా.. అదేమిటి ప్రోగ్రాం చాలా బాగా జరిగిందని చెబుతావనుకున్నాను. మాట్లాడటం లేదేం?' అంది.

"చాలా చాలా బాగా జరిగింది. ముఖ్యంగా ఆ కీర్తి అన్నమయ్య పదాల్లోని ప్రాముఖ్యాన్ని, ఆయన ఆర్తిని ఎంత చక్కగా వివరించిందో... ఆ అమ్మాయితో ఒకసారి మాట్లాడితే బాగుండనిపిస్తోంది."

"ఓ కీర్తీయా! మాకిక్కడ ఏ కార్యక్రమం అయినా తానే యాంకర్. అవధానాలు, ప్రవచనాలు, సంగీత విభావరి.. ఇలా ఏది జరిగినా ఎక్కువగా తననే పిలుస్తారు. యాంకరింగ్‌కి ఏ కార్యక్రమానికి తగ్గట్టు ఆ కార్యక్రమానికి ఎంతో చాకచక్యంగా, సమయస్ఫూర్తిగా మాట్లాడగలదు. చాలామంది తనని చాలా ఇష్టపడతారు"

"అంటే మాకు 'సుమ'లాగా అన్నమాట. ఆ అమ్మాయి హిందూ ఆరిజన్ కాదని..."

"ప్రగతియేనా నీతో ఆ మాటన్నది. నేననుకుంటూనే ఉన్నాను. ఆవిడ అలా అనకపోతే ఆశ్చర్యపడాలి. అసలు ఈ యాంకరింగంతా తామే చేయాలని ఈమె, సుందరీ శర్మ అనే మరొకామె అడిగారు. వాళ్లను కాదని ఈ అమ్మాయితో చేయించారని కోపం"

"అయినా ఈ అమ్మాయి చాలా చక్కటి గొంతుతో స్పష్టంగా, వివరంగా అందరికీ అర్థం అయ్యేలా చెప్పింది. ఎంత మంచి తెలుగు మాట్లాడిందో!" అన్నాను.

"వీళ్లని స్టేజి ఎక్కిస్తే తెలుగులో రెండు, ఇంగ్లీషులో నాలుగు మాటలు చెబుతూ.. మధ్యమధ్యలో 'క్షమించండి నాకంతగా తెలీదు ఈ పదాన్ని తెలుగులో ఏమంటారో'.. అని అంటుంటారు. అందుకే వీళ్లని కాదని కీర్తిని పెట్టారు. ఇక ఆరిజన్ అంటావా.. కీర్తి పేరెంట్స్ వేరువేరు మతాల వాళ్లు. కీర్తి భర్తది ఇంకొక రిలిజియన్. అయినా వాళ్ల ఇంట్లో అంతా ఎంత సఖ్యతగా ఉంటారో తెలుసా! ఆనందంగా జీవించడానికి ఆశయాలను వల్లెవేయడం కాదు, ఆచరణ అవసరం అనేది వాళ్ల కుటుంబంలో కనిపిస్తుంది."

"అయితే ఆ అమ్మాయిని తప్పనిసరిగా కలవాలిరా!" అని నా మనసులో ఆ అమ్మాయి పట్ల ఉన్న ప్రేమని వెల్లడిస్తూ అన్నాను.

"ఒకసారి మనింటికి పిలుద్దాం. వాళ్ల పేరెంట్స్ కూడా వస్తారని చెప్పింది. వాళ్ల నాన్నగారు సీతారామశాస్త్రి అని.. కవి, రచయిత. నీవు ఆయన రచనలు చూసేవుంటావు. తరచూ వాళ్ల పేరెంట్స్, ఇన్‌లాస్ కూడా వస్తూంటారు. అందరూ నాకు తెలుసు. చాలా మంచివారు."

ఆ తర్వాత మరో పది రోజుల దాకా అలా గడిచిపోయాయి. ఎవరి పనుల్లో వారు బిజీ అయిపోయారు. ఆ రోజు ఆఫీసు నుంచి వస్తూనే నందిని "అమ్మా! నేనొకసారి హాస్పిటల్‌కి వెళ్లి వస్తాను. కొంచెం లేటైనా కంగారు పడకు. నువ్వు, డాడీ, రమేష్, పిల్లలూ అంతా డిన్నర్ చేయండి" అంది.

"ఏమిటే అంత అర్జంటు? ఏమైంది?" అనడిగాను.

"అదే మొన్న ప్రోగ్రాంలో నీ పక్కనే కూర్చున్నారు కదా ప్రగతి అనే ఆవిడ. వాళ్ల అమ్మాయి కార్ యాక్సిడెంట్ చేసిందట. పైగా తాగి ఉందట. కాలేజీ ఫ్రెండ్స్ మరో ముగ్గురున్నారట. వాళ్లకు ప్రాణాపాయం లేదుగానీ.. దెబ్బలు బాగానే తగిలాయట" అంటూ గబగబా చెప్పేసి కారు ఎక్కేసింది.

నేను ఒక్కర్తినే కూర్చున్నాను సోఫాలో. ఎదురుగా తెలుగు ఛానెల్లో వార్తలు. మునుపటి వలే కాదు, అమెరికాలో ఉన్నా అన్ని తెలుగు కార్యక్రమాలూ చూడొచ్చు. అప్పుడే 'పరువు హత్య' జరిగిందని తెలుగు వార్తల్లో చెప్పి... చూపిందే చూపుతున్నారు. టీవీ రన్నవుతూనే ఉంది. నా మనసు పరిపరి విధాలుగా ఆలోచనల్లో పడింది. ఒకదాని వెంట ఒకటిగా అనేక రకాలైన భావాలు.. ఊపిరి సలపనీయటం లేదు. అక్కడ, ఇక్కడా.. అందరి ఆలోచనలు, చర్యలు అర్థం చేసుకొనేందుకు ప్రయత్నం చేస్తున్నాను.

ఒక్కో కులం వారు ఒక్కొక్క గ్రూపుగా ఏర్పడటం, వారిలో వారికి ఎంతో ఏకతా భావం ఉన్నట్లు కనిపించటం, మళ్లీ ఎవరి దుకాణాలు వారు తెరుచుకోవడం... వ్యక్తిగత ప్రయోజనాలు... వీళ్లల్లో మరికొన్ని గ్రూపులు, తమ వర్ణాధిక్యాన్ని తెలిపేలా హోమాలు, వ్రతాలు, భజనలు... ఏమిటిదంతా? ఎందుకు చేస్తున్నారు?

ఇన్ని చేస్తారు. మళ్లీ లేట్‌నైట్ పార్టీలు, మళ్లీ ప్రత్యేకంగా లేడీస్ పార్టీలు... చాలామంది తాగుతారు.. డ్యాన్సులు వేస్తారు.. చిన్నచిన్న బట్టలు వేసుకుంటారు. మన ప్రాచీనతను కీర్తిస్తుంటారు. మళ్లీ వాడిచ్చే డాలర్లు కావాలి. పిల్లలకి వాడిచ్చే విద్యాసౌకర్యాలు కావాలి. స్టార్ బక్స్‌కాఫీ, డంకన్ డొనట్లు కావాలి. వారానికి రెండు సార్లయినా పిజ్జాలు తినాలి. వాళ్ల డ్రెస్సులు, హెయిర్ స్టైల్సు కావాలి. ఏమిటో నాకయితే ఏమీ అర్థం కావటం లేదు.

పిల్లలకి పాఠాలు చెప్పిన టీచర్‌లాగా ఆలోచించడం మొదలుపెట్టాను. నాకు తెలిసిన, నేను చదివిన, నాకు అవగాహన ఉన్న చరిత్రతో వీళ్ల జీవన విధానాన్ని అర్థం చేసుకోగలనేమోననే ప్రయత్నం.

ఇక్కడ ఉద్యోగాలు చేస్తూ ఇక్కడ జీవిస్తున్నారు కాబట్టి.. వేషభాషల్లో వీరిని అనుకరించడం తప్పనిసరి. ఇక్కడెవరూ వీరిని పట్టించుకోరు. ఇక తమ సమాజం దగ్గరకు వచ్చేసరికే తమ ఉనికి, కులాధిపత్యం తప్పనిసరిగా గుర్తింపు పొందాలనే తాపత్రయం. భారతదేశంలో లాగానే అగ్ర వర్ణాధిపత్యం లాటి

ప్రత్యేక గౌరవం లభించాలనే పాకులాట.. అందుకే తామెవరన్నదీ నలుగురికి గుర్తు చేస్తుంటారు పదేపదే. తామే అందరి కంటే గొప్పగా మాట్లాడగలమని, తెలివైన వారమని ఒకలాంటి పిచ్చి నమ్మకం. కనీసం దాన్ని తమ సామూహిక వర్గాల్లో నిరూపించుకోగలగాలి. అందుకే ప్రగతి ఆ రోజున కీర్తి మాట్లాడుతుంటే.. ఆ అమ్మాయి ఆరిజన్ గురించి కామెంటు చేయగలిగింది.

ఇన్ని వేల మైళ్ల దూరం వచ్చేసాక కూడా ఈ మతాలు, కులాలు పునాదుల మీదనే సమాజం నడవాలని కోరుకోవటం ఆశ్చర్యమే! ఏ మాత్రం చారిత్రక అవగాహన ఉన్నా వీటి 'పస' ఏమిటో తెలిసిపోతుంది. జాత్యహంకారం, మత దురాభిమానం, కులజాఢ్యం... ఎన్ని రకాల విధ్వంసాల్ని సృష్టించిందో ప్రపంచ చరిత్ర పుటల్లో రక్తాక్షరాలు చెబుతూనే ఉన్నాయి. అయినా సరే జ్ఞానోదయం కాలేదు!

నా ఆలోచనలకు బ్రేక్ వేస్తూ బయటకు వెళ్లిన వారంతా వచ్చారు. మరో గంటలో నందిని కూడా వచ్చింది. పిల్లలిద్దరూ డిన్నర్ చేసి పైకి వాళ్ల రూముల్లోకి వెళ్లాక చెప్పింది.

"ఆ అమ్మాయి బాగా తాగుతుందట. పైగా కాలేజీకి వెళ్లింది కదా! హాస్టల్‌లో కాదు, ఫ్రెండ్స్‌తో బయట ఉంటుందట. డ్రింకింగ్ అలవాటుతో స్టడీస్‌లో కూడా వెనుకబడిపోవటం, డిప్రెషన్.. అంతా కలిపి ఏదో గందరగోళం. తానే డ్రైవింగ్... రాత్రి సమయంలో మత్తులో... యాక్సిడెంటు..."

"ఏమిటో ఈ ఆడపిల్లలు తాగటం. కార్లు.. కార్డులు.. స్వేచ్ఛ. ఇక్కడంతా చూస్తుంటే ఏదో భయంగా ఉంది" అన్నాను.

నా మాటకు అడ్డు వస్తూ నందిని "అట్లా అనకమ్మా. అక్కడ మన పిల్లలు కూడా ఇలాంటివే చేస్తున్నారు. కాకుంటే ఇక్కడి పిల్లలకి స్వేచ్ఛ ఎక్కువ. ఏం చెప్పినా ప్రశ్నిస్తారు. కోపమూ జాస్తే! పిల్లల్ని దండించటానికి లేదు..."

"అలా అయితే పిల్లల జీవితాలు ఎందుకూ కాకుండా అయిపోతాయి కదే!?"

"అంతా అలా ఎందుకుంటారు చెప్పు. ఇప్పుడు వీళ్లింట్లో బోల్డంత భక్తి ప్రవృత్తులు, పూజలు, భజనలు, నిష్ఠ.. ప్రతి దానికీ శాస్త్రాలు నీతులు వల్లెవేస్తారు. మరెందుకు భయం భక్తి అలవడలేదు? చెప్పు? పిల్లలకి పనికిరాని వీటన్నింటిని ఆచరిస్తూ .. అందరికంటే తామొక మెట్టెక్కువ వున్నామని చెప్పుకుంటానికి ఉపయోగపడతాయి.. అంతే..."" నందిని మాటల్లో నిజమున్నట్లు అనిపించింది.

"అమ్మా! చెప్పటం మరిచాను. కీర్తి ఫ్యామిలీని శనివారం మనింటికి డిన్నర్‌కి పిలిచాను. ఆ అమ్మాయి పేరెంట్సు కూడా వచ్చారు, ఇండియా నుంచి." అని చెప్పింది నందిని.

◆ ◆ ◆

శనివారం నాడు మా ఫ్యామిలీ అంతా కీర్తి వాళ్లందర్నీ స్వాగతించటానికి సిద్ధపడి ఎదురు చూస్తున్నాం. రెండు కార్లల్లో పిల్లలు, పెద్దలు అంతా వచ్చేశారు. కీర్తి చేతుల్లో అందమైన పాట్‌లో ఉన్న మొక్కతో వచ్చింది. నందినికి ఇస్తూ 'నమస్తే ఆంటీ, నమస్తే అంకుల్ .. అంటూ మమ్మల్ని, పేరుపేరునా పిల్లల్ని పలకరించింది. అతిధులు వచ్చినప్పుడు ముందుగా అపిటైజర్ ఇవ్వడం ఇక్కడ ఓ అలవాటు. వడలు, అల్లం, చట్నీ, కొత్తమీర పచ్చడి పెట్టాం. పిల్లలు నలుగురు ట్రానీలు తింటూ ఆడుతున్నారు.

"అమ్మా! కీర్తీ.. ఆరోజు చాలా చాలా బాగా చేసావమ్మా యాంకరింగ్. మంచి తెలుగు మాట్లాడావు. ముచ్చటేసింది. అన్నమయ్య హృదయావిష్కరణ చేశావు" అన్నాను.

"థ్యాంక్స్ ఆంటీ... ఏదో అట్లా మాట్లాడేస్తుంటాను..." అంటూ మోహమాటపడిపోయింది.

"లేదు.. బ్రహ్మాండంగా మాట్లాడతారు. మీరు ఏ ఈవెంట్ అయినా చక్కగా మాట్లాడగలరు" అని మా అల్లుడు రమేష్ అన్నాడు.

"ఔను కీర్తి.. చాలా చక్కగా యాంకరింగ్ చేయగలవు" అని అంటూ నందిని, కీర్తి వాళ్ల అమ్మవైపు చూస్తూ.. "ఆంటీ మొన్న ఎంత బాగా మాట్లాడిందంటే, ఆరోజు నుంచి అమ్మ కీర్తిని ఓ సారి కలవాలమ్మా అని అంటూనే ఉంది" అంది.

వాళ్ల అమ్మ ప్రతిభా జోసెఫ్ నవ్వుతూ "అంతా వాళ్ల డాడీ ప్రభావం.. కవిత్వం... రచనలు.." అంది.

"ఔనండి.. మీ రచనలు నేను పత్రికల్లో చూస్తుంటాను. మీరు రాసిన 'నిరీక్షణ' పుస్తకం నా దగ్గర ఉంది కూడా" అన్నాను.

"థ్యాంక్సండి. అలా రాయడం చదువుకునే రోజుల్లోనే అలవాటైంది. మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో చదివేటప్పుడు ఈ ప్రతిభా జోసెఫ్ కోసం మొట్టమొదటిసారిగా ఇంగ్లీషులో పొయెట్రీ రాయడం మొదలెట్టా. అది చివరికి నా జీవితంలో ఒక భాగమై కూర్చుంది ఈవిడతో పాటే' అన్నారాయన నవ్వుతూ.

కీర్తి వాళ్ల అమ్మనాన్నల పేర్లను బట్టి వారు వేరువేరు మతాల వారని అర్థం అవుతూనే ఉంది. కీర్తి భర్త అమిత్ జైన్. ఇన్ని మతాల కలయిక ఉన్న వారంతా ఒకరితో ఒకరు హిందీ,

ఇంగ్లీషు, తెలుగు, తమిళం ఎలా వడితే అలా మాట్లాడుకుంటున్నారు. బహుభాషా కుటుంబీకులు వీరంతా. పిల్లలూ అంతే! చాలా సులువుగా అన్నీ మాట్లాడేస్తున్నారు. తిండి విషయంలోనూ పట్టింపులు లేవు. వెజ్, నాన్‌వెజ్ అనే బేధం లేదు. ఎవరికి తోచింది వాళ్లు తింటున్నారు. ఎవరి మీద ఎవరూ ఎటువంటి నిబంధనలూ విధించడం లేదు. ఒకరి అభిప్రాయాలను, అలవాట్లను వేరే వారు గౌరవిస్తున్నారు. బాగుంటుది, ఈ కుటుంబం లాగా అందరూ వుండగలిగితే!

"ఏమిటి, ఆశ్చర్యంగా వుందా లలిత గారూ, మమ్మల్ని చూసి..." అంటూ ప్రతిబా జోసెఫ్ నున్న పలకరిస్తూ అంది.

"ఇవాళ్టి రోజున ప్రపంచమే చిన్న పల్లెటూరుగా మారిపోయింది. అప్పుడెప్పుడో చిన్నప్పుడు గ్రీకు దండయాత్ర ఫలితాలని పాఠాల్లో చదివాం గుర్తుందా? ఇప్పుడు మొత్తం ప్రపంచాన్నే అటు ఇటు చుట్టి రావడం ఈజీ అయ్యాక ఈ ఆదానప్రదానాలు, సంస్కృతి సమ్మేళనాలు, మార్పులు, చేర్పులు జరగక మానవు. మనం మన పరిధుల్లో హిందూ ముస్లిం క్రిస్టియన్ సిక్కులని ఇష్టపడి పెళ్లాడినట్లు ... మన పిల్లలు ఇక్కడ ఏ అమెరికన్నో, ఏ యూరోపియన్నో, ఏ అరబ్‌నో, ఏ జ్యూయిష్‌న్నో పెళ్లాడతానంటే కాదనగలమా? ఇవన్నీ ఒంట బట్టించుకోవటానికి కొంచెం సహనం, అవగాహన అవసరం. అంతే!" అంది.

"చాలా బాగా చెప్పారు. ఆ సహనం, అవగాహన లేని వారి మూర్ఖత్వం వల్లనే కదా ఇన్ని అనార్థాలు జరగడం. ఎటొచ్చి మాది తప్ప మిగతా వారిదంతా అబద్ధం, అసత్యం అనే వాళ్లతోటే గొడవ. అట్లాటి వారే మా పుట్టుకలు, తెలివితేటలు ప్రత్యేకమైనవనే అపోహతో ఉంటారు" అన్నారు మా వారు.

"మేమే తెలివైన వాళ్లం అనుకునే వారు ప్రపంచంవైపు ఓ సారి దృష్టి సారించాలి. ఎన్నెన్ని గొప్ప గొప్ప ఆవిష్కరణలు, ఎంతెంత మంది ప్రాంతం, మతంతో సంబంధం లేకుండా కనిపెట్టారు! అవన్నీ ప్రపంచ ప్రజలందరూ తమవిగా చేసుకొన్నారు కదా! మాతృదేశం నుంచి ఇన్ని వేల మైళ్ల దూరం వచ్చి పరాయి దేశంలోనూ మన ఉనికిని చాటుకోవటం ఒక పార్శ్వం అయితే.. పరాయి గడ్డపై కూడా తమ వారిలో తన అధిక్యాన్ని నిలబెట్టుకోవాలనే పేరాశ మరొక మూర్ఖత్వం. మనుషుల పేర్లను బట్టీ, ఇంటి పేర్లను చూసి, రంగుని బట్టీ, యాసను బట్టీ మతాలు, కులాలు అంచనా వేస్తూ తమతమ తెలివితేటలకు మురిసిపోయే వారిని చూస్తే చాలా జాలి వేస్తుంది" సీతారామశాస్త్రి గారు ఆవేశంగా చెప్పుకుపోతున్నారు.

కీర్తి అంది : "డాడీని ఈ విషయాల మీద మాట్లాడమంటే తెల్లవారే వరకూ మాట్లాడుతూనే ఉంటారు. అయినా ఈ భూమ్మీద ఇలాంటి తరతమ బేధాలు లేని తావు ఏమైనా ఉంటుందా? మన దేశంలోనూ, రాష్ట్రంలోనూ ఉన్నవే ఇక్కడా రిఫ్లెక్టు అవుతున్నాయి. మతాధిపత్యం, కులాధిపత్యం, ఆర్థికాధిపత్యం, రాజ్యాధిపత్యం ... పేరు ఏదైతేఏం? తాను బాగుండాలి. ఎదుటివారు ఏమైనా ఫర్వాలేదు. తన బాగు కోసం వ్యవస్థలనే నాశనం చేసేస్తున్నారు. వ్యక్తి స్వార్థం, విపరీతమైన పదవీ కాంక్ష, ధనకాంక్ష .. వీటి నుంచి తప్పించుకోలేక పోతున్నారు"

"అయినా ఇక్కడ కూడా ఈ కులాతిశయాలు ఏమిటమ్మా" మా వారు విచారంగా ముఖం పెట్టి అన్నారు.

"ఏమో అంతా పైకి బాగానే వుంటారు. చాలా సంస్కారవంతంగా వుంటాయి మాటలు... మళ్లీ ఎవరికి వారే ఒకరి గురించి ఇంకొకరు వింతగా మాట్లాడతారు" అమిత్ అన్నాడు.

"నేనెప్పుడూ నా ఆరిజన్ ఏమిటో దాచటానికి ప్రయత్నించలేదు. నేనెవరో ఏమిటో అందరికీ తెలుసు. నాకు లాభదాయకమైనదని అవసరాన్ని స్థానాన్ని బట్టి మార్చుకోలేదు. నేను నేనుగానే నన్ను ప్రెజెంట్ చేసుకున్నాను. కొందరికి నేను నచ్చను. ఆ విషయం నాకు తెలుసు. అందరికీ నేను నచ్చాలని కోరుకోవటమూ దురాశే. కాదంటారా?" కీర్తి ప్రశ్నించింది.

"ఔను కదా! మనవన్నీ ఇతరులకు నచ్చాలనుకోవటం ఆశ అయితే, మనవే అందరూ ఆచరించాలనుకోవటం అతిశయమవుతుంది. ఇవే మతాలకు, కులాలకు అన్వయించుకొని మనదే ఉండాలనే స్వార్థం పీక్‌కి చేరటమే.. నియంత్రణ, టెర్రరిజం, విధ్వంసం వగైరా..." నందిని అంటోంది.

"లేదు లేదు. ఇలాంటివి వద్దు, కూడదు అని చెప్పే మహాత్ములు ఉన్నారు. కాకుంటే ఆ బోధలు మన చెవికి, మనసుకి ఎక్కవు. కానీ ప్రపంచమంతా చెడు మార్గానే పోతోందనే అపవాదు సరైంది కాదు. మంచి చేసే వారు, మంచికై పరితపించేవారు, మానవాళి సంతోషానికై మార్గాలు వెతికేవారు లేకపోలేదు. మంచితనం, ఓర్పు, ప్రేమ, ఇచ్చిపుచ్చుకోవటాలు కుటుంబం నుంచే మొదలవ్వాలి. అందుకు తగ్గ తర్ఫీదు ఇళ్లల్లో, బడుల్లో కావాలి" శాస్త్రిగారి కళ్లలో 'ఆశ'.

ఔనంటున్న మా అందరి మాటల్లోనూ ఆశే!

■

## ఈ కలం పేరు

- డాక్టర్ వేలం పళని
9912343804

దాచేస్తే దాగని సత్యం
విశ్వ వార్త కిది వాస్తవ రూపం
ఈ కలం సాగే చరితల సాకార మహాకారం
ఫ్యూడల్ శక్తుల కులోన్మాదం
క్యాపిటలిస్టుల మార్కెట్ మంత్రం
ఈ కలం కల్మషాలకతీతం

2జి స్పెక్ట్రం బోఫోర్సుల వ్యాకరణం
శారద స్కాముల మార్మిక బాణం
ఈ కలం పరిశోధనల ప్రమాణపత్రం
నీరవ్ మాల్యా ఎగవేతల సూత్రం
హెరాల్డ్ పత్రిక ప్రమాద గీతం
ఈ కలం అన్వేషణలకు అక్షర క్షేత్రం



మీటూ ఉద్యమ స్వర సంకేతం
వేధింపుల విచారణ పర్వం
ఈ కలం కాముక దహనం
నిగ్గదీసే ధిక్కార విధానం
గౌరీ లంకేష్ కళేబర ధ్వానం
ఈ కలం నిర్భీతికి ఎత్తిన రూపం

సాహస వార్తల సహజావాసం
బర్ఖాదత్తు కార్గిల్ చిత్రం
ఈ కలం ధీరవనితల గంభీర నినాదం
ఉద్యమాల ఉత్తేజపు కథనం
సకల దేశాల స్వేచ్ఛా గీతం
ఈ కలం విజయ నాదాల విప్లవ గానం

శాసనాల శ్వాసకు వ్యాఖ్యానం
పాలనలోని పరమార్థపు తత్త్వం
న్యాయవనిత విస్తారిత నేత్రం
ఈ కలం నాల్గో కంభం నిజస్వరూపం

యథార్థ వ్యథల మానవ కోణం
జనస్వామ్యానికి చెరగని కవచం
ఈ కలం... పేరు జర్నలిజం
నవసమాజపు నాందీ బీజం

**(సంరక్షణ కోసం ప్రతి అంశంలోనూ ఫ్రంట్ లైన్ వారియర్స్‌లో ఒకరుగా పోరాడుతున్న జర్నలిస్టులకు అంకితం)**

---

## కేక

- గిరి ప్రసాద్ చెలమల్లు
9493388201


పెద్ద పెద్ద బండరాళ్ళనే పెకిలించి
పొలాలన్నీ దున్నినోళ్ళం
పొలాల చుట్టూ కందకాలను తవ్వినోళ్ళం
నిన్ను మించిన అడవి జంతువులనే
ఇనుప తీగలు చుట్టి బంధించినోళ్ళం
వేటాడినోళ్ళం

రోడ్ల మీద గుంతలు మమ్మల్నేం చేస్తాయ్
నీళ్ళు చిమ్మి చిమ్మి
వరదలకే ఎదురీదినోళ్ళం
జల ఫిరంగుల కెదురొడ్డే
రాటు తేలిన గుండెలు మావి

కన్నీళ్ళతో అలసి సొలసిన
బతుకుల్లో ఇంకా ఇంకిన కన్నీళ్ళ రాల్చే
భాష్ప వాయు గోళాల ప్రయోగాలా!

మా నేల
మా చెమట చుక్కల పంట
అమ్మేది మేమే
ధర చెప్పేది మేమే
వాడెవ్వడు వీడెవ్వడు
మా కల్లాల్లో అగుపడితే
చుక్కల్లో కలవాల్సిందే


మా బతుకుల్లో నిప్పులు పోసే
చట్టాలు సమాధయ్యే దాకా
పోరు రగులు పోట్ల గిత్తల్లా
రంకెలు వేస్తూ రేగాలి దుమ్ము
వాడి కళ్ళల్లో పడాలి !!



# సాహితీస్రవంతి రాష్ట్ర కమిటీ నిర్ణయాలు

సాహితీ స్రవంతి రాష్ట్ర కమిటీ సమావేశం ఇటీవల జరిగింది. కరోనా కారణంగా మృతి చెందిన విశాఖ స్రవంతి నాయకులు అవసరాల రమణరావు, నూనెల శ్రీనివాస్, మస్తాన్ వలి (కడప), వయోభారంతో కన్నుమూసిన వ్యవస్థాపక నాయకులు కె.కేశవరెడ్డి గార్లకు జోహారు లర్పించింది. ప్రముఖ రచయితలు దేవీప్రియ, శాంత సుందరి గార్ల మృతికి సంతాపం తెలిపింది. ఢిల్లీలో జరుగుతున్న రైతుల ఆందోళనకు మద్దతు తెలిపింది. ప్రభుత్వం వారి కోర్కెలను ఆమోదించి రైతు వ్యతిరేక శాసనాలు వెనక్కు తీసుకోవాలని కోరింది.

### వొరప్రసాద్‌కు ధన్యవాదాలు



సాహితీ స్రవంతి అధ్యక్షుడుగా, సాహిత్య ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్‌గా పనిచేస్తున్న వొరప్రసాద్ వ్యక్తిగత కారణాల వల్ల ఈ రెండు బాధ్యతలకు సమర్పించిన రాజీనామాను చర్చ తర్వాత సమావేశం ఆమోదించింది. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి దీర్ఘకాలంగా సంస్థలో వొరప్రసాద్ పాత్రను వివరిస్తూ కమిటీ తరపున ధన్యవాదాలు చెప్పారు. రాష్ట్ర కమిటీ సభ్యులు కూడా ఆయన సేవలను కొనియాడారు. ప్రజాశక్తి సంపాదకులు ఎంవిఎస్ శర్మ, ప్రస్థానం మేనేజర్ కె.లక్ష్మయ్య తదితరులు మాట్లాడారు. వొరప్రసాద్ కృతజ్ఞతలు చెబుతూ సాహితీ స్రవంతి కార్యకర్తగా తన కృషి కొనసాగిస్తానని తెలిపారు.

### వర్కింగ్ ఎడిటర్‌గా సత్యాజీ



అనంతరం రాష్ట్ర కమిటీ సీనియర్ పాత్రికేయులు, రచయిత సత్యాజీని సాహిత్య ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్‌గా నియమిస్తూ నిర్ణయం చేసింది. ప్రస్తుతం విస్తారంగా జరుగుతున్న వెబ్‌నార్లను, జిల్లాల్లో కార్యక్రమాలను సమీక్షించింది. కరోనా కారణంగా ఏర్పడిన పరిస్థితులు కొంత కుదుట పడిన అనంతరం రాష్ట్ర సమావేశం జరిపి భవిష్యత్ కార్యక్రమాలు విస్తరించేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించింది.

■

## సాహిత్య ప్రస్థానం డిసెంబర్ 2020 పురస్కారాలు

**బొట్టు**

*కవితకు రూ.500*

కవయిత్రి: వైష్ణవి శ్రీ

**మనిషితనం**

*కథకు రూ.500*

రచయిత్రి : దారల విజయ కుమారి

■■■


*కవితకు కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం*

*కథకు డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం చెక్కులు ఈ రచయితలకు అందుతాయి*

■■■

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాల్లో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.*

**- ఎడిటర్**



# రైతుకు కుడి ఎడమల తెలుగు కథకులు

- రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

"దేవుని దెగ్గర్నుంచీ అందురూ రైతును పీక్కు తినేవాల్లే"

"రైతు బతుకు రాన్రానూ శానా కష్టమైపోతాంది"

"బాకీలు తీర్చదానికే కాలమంతా సరిపోతాంది. ఎప్పుడు గట్టెక్కుతామో యేమో"

"ఈ గడ్డమీద రైతు బతుకే యిట్లయింది"

"యా పంట పెట్టినా రైతుకు ఎదురు దెబ్బ లేనప్పా"

"రైతు దెగ్గిరనుంచీ కొనే సరుకు యాదీ రేటుండదు. రైతు కొన్నీకిపోతే మాత్తరం అన్నీ రేట్లే"

"వ్యవసాయమంతా జూదమైపోతే ఇంకా యావల్లనప్పా బతికేది?"

"భూములన్నీ అమ్ముకొని వూరికే కూలిపనికి తిరుక్కుండేది మేలు"

"పైనుండి కింది దాకా ప్రతివొక్కడూ కష్టాన్ని మించే లాభం పొందతాండాడు. రైతు కష్టం మాత్తరం భూమిలోనే ఇంకిపోతాంది"

"సొతంత్రమొచ్చి నలభై యాభైయేండ్లు గడిచినా ఇంకా యిక్కడ ఉండే రైతు వాన పడకుంటే గంపెత్తుకు పోవలసిందేనా?"

"ఈ గడ్డలో పుట్టిన పాపానికి రైతులు ఇట్లనే బతకాల్లేమో?"

డా.శాంతి నారాయణ అనే ఒక్క రచయిత కథల్లోనే రైతు, వ్యవసాయ రంగాల మీద ఇన్ని వ్యాఖ్యలు కనిపిస్తాయి. రైతు వస్తువుగా వచ్చిన కథల్లో ఇలాంటి వ్యాఖ్యలన్నిటినీ క్రోడీకరించి అధ్యయనం చేస్తే, తెలుగు కథా రచయితలు భారతీయ రైతులకు కుడి ఎడయల కాపలాగా నిలబడినట్లు అర్థం చేసుకోగలం. "కష్టజీవికి ఇరు వైపులా నిలిచినవాడే కవి" అన్న శ్రీశ్రీ మాటను తెలుగు రైతు కథకులు నిజం చేశారు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో వ్యవసాయ, రైతు సాహిత్యం ఒక విశాలమైన అధ్యాయం. కానీ, ఈ అధ్యాయం మీద జరగవలసినంత అధ్యయనం జరగలేదు. సాహిత్య చరిత్రలో కూడా రైతు, వ్యవసాయ వృత్తిమీద వచ్చిన సాహిత్యం మీద ప్రత్యేక అధ్యాయాలేవీ కనిపించవు. వృత్తులపరంగా సాహిత్య చరిత్రలు రచిస్తే రైతు, వ్యవసాయ సాహిత్య ఔన్నత్యం తెలుస్తుంది.

రైతు, వ్యవసాయం వస్తువుగా వచ్చిన తెలుగు సాహిత్యంలో రైతు, వ్యవసాయ కథలు ఒక పెద్ద విభాగం. రైతు కవిత్వం తర్వాత స్థానం రైతు కథదే. 1879 ప్రాంతంలో పురుడు పోసుకున్న తెలుగుకథలోకి రైతుజీవితం నాలుగు దశాబ్దాల తర్వాతి ప్రవేశించింది. రైతు జీవితాన్ని చిత్రించిన తొలి తెలుగు కథ ఏది? అనే అంశం మీద చాలా చర్చే జరిగింది. మొదట 1941 నాటి 'మమకారం' తొలి రైతు కథ అని అనేకులు గుర్తించారు. ఇది త్రిపురనేని గోపిచంద్ రాసిన కథ. ఆ తర్వాత పెనుగొండ లక్ష్మీ నారాయణ 1924 నాటి 'రావులయ్య' కథను తొలి తెలుగు రైతుకథగా గుర్తించారు. ఇది శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి రచించిన కథ. దాని తర్వాత డా.పి.వి.సుబ్బారావు "ఎవరికి?" అనే కథ తొలి తెలుగు రైతుకథ అని నిర్ధారించారు. ఇది 1912 నాటిది. ఇది మాడపాటి హనుమంతరావు రాసిన కథ. ఈ లెక్కన చూస్తే తెలుగు రైతు కథకు, ఇప్పటికి 108 ఏళ్ళ చరిత్ర ఉంది. ఈ 108 ఏళ్లలో కనీసం 150 మంది కథకులు ఆరేడువందల రైతు కథలు రాసి ఉంటారు. ఈ కథకులు తెలుగునాట నాలుగు చెరగుల నుండీ పుట్టుకొచ్చారు. వీళ్లలో వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చిన వాళ్లు, రైతు, వ్యవసాయాల పట్ల నిబద్ధత గల వ్యవసాయేతర కటుంబాలకు

చెందిన వాళ్లు, వ్యవసాయ వృత్తులు, కూలీల కుటుంబాలకు చెందిన వాళ్లు ఉన్నారు. భారతీయ భాషలన్నింటిలో వచ్చిన రైతు కథలు కనీసం 20 వేల దాకా ఉంటాయి. వాటిని కనీసం వెయ్యి మంది రాసి ఉంటారు.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 73 ఏళ్లు పూర్తయింది. మరో రెండేళ్లలో వజ్రోత్సవం జరుపుకోబోతున్నాం. ఈ సమయంలో భారతీయ రైతులు వ్యవసాయ, రైతు వ్యతిరేక చట్టాల రద్దు డిమాండ్‌తో పొలాల నుంచి బయటికి వచ్చి, దేశ రాజధానిని ముట్టడించి పోరాటం చేస్తున్నారు. ఈ సందర్భంగా శ్రామిక పక్షపాతం గల భారతీయ రచయితలు వ్యవసాయ రంగం గురించి, రైతు జీవితం గురించి రాసిన సాహిత్యాన్ని సమీక్షించుకోవడం బాధ్యతాయుతమైన చర్య. ఈ వ్యాసం తెలుగులో వ్యవసాయం గురించి, రైతు గురించి రాసిన కథలను అధ్యయనం చేస్తుంది.

## తొలి తెలుగు రైతుకథాత్రయం

"ఎవరికి?" (మాడపాటి, 1912), "రావులయ్య కథ" (శ్రీపాద 1924), "మమకారం" (గోపీచంద్, 1941) – ఇది మొదటి తెలుగు రైతు కథాత్రయం. ఈ మూడు కథలూ రైతు జీవితంలోని మూడు పార్శ్వాలను చిత్రించాయి. రైతుల పట్ల నిరంకుశంగా, అమానవీయంగా ప్రవర్తించే జమిందారు నుంచి రైతులను కాపాడిన ఉద్యోగి మోహనరావు కథ "ఎవరికి?". ఈ తొలి తెలుగు రైతు కథే ఆధిపత్యం కింద నలిగిపోయే రైతును చిత్రించడం గమనార్హం. 'రావులయ్య కథ'... రైతు దగ్గర జీతగాడిగా ఉన్న రావులయ్య, రైతు ఔదార్యం వల్ల, తన శ్రమశక్తి వల్ల రైతుగా ఎదిగిన కథ. ఆ తర్వాత అతడు పారిశ్రామికవేత్త కూడా అవుతాడు. ఈ కథ రైతు, పాలేర్ల మధ్య సహకారాన్ని, అన్యోన్యతను ఆవిష్కరించింది. "మమకారం" రైతుకు భూమి పట్ల ఉండే ప్రేమను ఆవిష్కరించింది. ఈ కథలో జోగయ్య తన కుటుంబ సభ్యుల కన్నా, తన భార్య ఆరోగ్యం కన్నా, తన భూమినే ఎక్కువగా ఇష్టపడ్డాడు. వాన కురుస్తున్న భూమిని చూస్తూ, పిడికిట్లో మట్టిని పెట్టుకొని కన్నుమూస్తాడు. ఈ మూడు కథలూ రైతు కథకు చక్కని పునాదిని వేశాయి. ఈ పునాది మీద తెలుగు రైతు కథ ఆరోగ్యకరంగా అభివృద్ధి చెందింది. సామాజిక పరిణామాలకు అనుగుణంగా రైతుకథ తన వస్తు పరిధిని, పరిమితిని విస్తరించుకుంటూ వచ్చింది.

వలస పాలకులు భారతదేశంలో స్థిరపడిన తర్వాత కొట్టిన మొదటి దెబ్బ రైతు మీదనేనంటారు చరిత్రకారులు. రెండవ దెబ్బ చేనేత కార్మికుని మీద. అప్పటినుంచీ నేటిదాకా వలసపాలనలోనూ, స్వపరిపాలనలోనూ రైతు బతుకు దినదిన గండంగానే గడుస్తున్నది. రాజ్యం అనేక రూపాల్లో రైతు జీవితాన్ని, వ్యవసాయరంగాన్ని కుదేలు చేస్తున్నది. గ్రామాధికారులు, స్థానిక భూస్వాముల నుంచి అత్యున్నత రాజకీయ కేంద్రం దాకా రైతును కష్టపెడుతూనే ఉన్నారు. ప్రకృతి, పాలకులు కుడి ఎడమలుగా రైతును, వ్యవసాయాన్ని ఎప్పటికప్పుడు సంక్షోభంలోకి నెట్టివేస్తుండడం ఒక వాస్తవం. మనిషి బతకడానికి కావలసిన తిండిగింజల సృష్టికర్తల జీవితాలు పరాయీకరణకు గురికావడం దారుణం. ఈ దారుణాన్ని తెలుగు కథకులు స్వాతంత్ర్యోదమకాలం నుండి నేటిదాకా ప్రతిబింబిస్తూనే ఉన్నారు.

## రైతుకు శత్రువు రాజ్యమే ...

*"అన్నదాతను పీడించిన ఏ ప్రభుత్వమైనా పరాభవాన్ని చవిచూడక తప్పదు"* (లంకిపల్లె : జీవనం)

తెలుగు కథా రచయితలు అనేకులు నిరంతరం శ్రమించి తిండిగింజలు పండిస్తున్న రైతు జీవితాన్ని కృంగదీస్తున్నది రాజ్యమేనని చెబుతున్నారు. శాసన, కార్యనిర్వహణ వ్యవస్థల విధానాలూ, ఆచరణలే రైతుకు శత్రువులుగా ఉన్నాయని తెలుగు కథకుల అవగాహన. "దేశంలో గ్రామాల నుంచి వెళ్లిన మంత్రులు, ముఖ్యమంత్రులు అయిన వారెంతమంది? వారికి మన సమస్యలు తెలియవా? వారు అధికార కుర్చీలో కూర్చుంటూనే గ్రామాలమాట ఎందుకు మరచి పోతున్నారు?" అన్నది లంకిపల్లె ప్రశ్న (జీవనం). ఈ కథలోనే ఆయన రైతుకు క్రిమి కీటకాలుగాని, ఎలుకలు, పక్షులుగాని శత్రువులు కావని, రైతుకు నిజమైన శత్రువు మనిషేనని, మనుషులు నిండిన వ్యవస్థేనని ప్రతిపాదించాడు. కరెంటుకోత, రెవెన్యూ అధికారి, విడిఓ వంటి రూపాల్లో అధికారులు రైతును నాశనం చేస్తున్నారని విమర్శించారు. దీనికితోడు ఇంకా నశించని భూస్వామ్య వ్యవస్థ కూడా సామాన్య రైతు పాలిట శత్రువైంది.

కరుణ కుమార (కయ్యి కాలువ, బిళ్లల మొలతాడు మొదలైనవి), గోఖలే (స్మరణ), చెన్నమనేని రాజేశ్వరరావు (పిట్టబతుకు), కేతు విశ్వనాథరెడ్డి (మార్పు), అక్కినేని కుటుంబరావు (ఈరడింట్లో పెళ్లి), మధురాంతకం నరేంద్ర (పాడి), వి.ఆర్.రాసాని (వీరజాటి) మొదలైన రచయితలు సామాన్య రైతులకు సంపన్న రైతులు, భూస్వాములు ఎలా శత్రువులుగా తయారయ్యారో చిత్రించారు. 'కయ్యి కాలువ'లో

లక్ష్మమ్మ అనే మోతుబరి మహిళా రైతు కొండడనే దళితుడ్ని ఎన్నో రకాలుగా హింసించి సర్వనాశనం చేస్తుంది. 'బిళ్లల మొలతాడు'లో కృష్ణారెడ్డి, రామిరెడ్డి అనే మోతుబరులు పాలేరు సుబ్బడిని, అతని భార్య రమణిని హింసించి కేసుల్లో ఇరికిస్తారు. 'స్మరణ' కథ మధ్య తరగతి రైతు వెంకయ్య పొగాకు సేద్యం చేసి సుఖపడుతుంటే చూసి భరించలేక మోతుబరి సూరయ్య అతనిని హింసించి జైలు పాలు చేస్తాడు. 'మార్పు' కథ స్వతంత్రం వచ్చాక కూడా దళిత రైతులు, రైతు కూలీల మీద భూస్వామి పెత్తనం కొనసాగడాన్ని, తమ హింసా చర్యలకు చిన్న రైతులను ఉపయోగించుకోవడాన్ని ప్రదర్శించింది. జమిందారు జగన్మోహనరావు చంద్రయ్య వంటి పాలేరులు, చిన్న రైతులను ఎలా పీల్చి పిప్పిచేశారో చిత్రించింది. పేద రైతుల కోసం, రైతు కూలీల కోసం పాలకులు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను భూస్వాములే కాజేసే వాస్తవాన్ని 'పాడి' కథ ప్రతిబింబించింది. వీరమనాయుడనే భూస్వామి అప్పులిచ్చి, వాటిని తీర్చనీయకుండా కోటప్ప వంటి అమాయకుల భూముల్ని స్వాధీనం చేసుకొనే దుర్మార్గాన్ని 'వీరజాటి' ప్రతిఫలించింది.

ఒక పేదరైతు తాను పండించిన కూరగాయలను అమ్ముకోబోతే, నిజాం పాలన కాలంలో, తలారి, పూజారి, పటేల్ మొదలైన వాళ్లు తలా ఒకటి తీసేసుకున్న తీరును సురవరం ప్రతాపరెడ్డి 'గ్యారా కద్దు – బారా కొత్వాల్' కథలో ఆవిష్కరించారు. గ్రామంలో వీళ్లు రాజ్యం పాత్ర నిర్వహిస్తూ, పేదరైతులను దోచుకుంటారు. కాళీపట్నం రామారావు 'అన్నెమ్మ నాయకురాలు' కథలో గ్రామ కరణాల శత్రుపాత్రను చిత్రించారు. ప్రజల మధ్య చీలికలు తెచ్చే కరణాల రాజనీతిని వాస్తవంగా ఆవిష్కరించారు. పాలకులు ప్రవేశపెట్టే అభివృద్ధి పనుల్లో పని తక్కువ, ప్రచారం ఎక్కువ కావడాన్ని నిరసించారు. భూస్వాములు, అధికారుల మధ్య సామాన్య రైతులు నలిగిపోవడాన్ని ప్రతిబింబించారు. బోయ జంగయ్య 'దున్న' కథలోనూ గ్రామంలో కరణం రాజ్య ప్రతినిధిగా రైతు వ్యతిరేక పాత్ర నిర్వహించడాన్ని చిత్రించారు. రైతుల వాస్తవిక జీవన స్థితిగతులతో సంబంధం లేకుండా, ప్రభుత్వ ఉద్యోగులు (విద్యుచ్ఛక్తి శాఖ) గ్రామాలకు వెళ్లి రైతులను వసూళ్ల పరంగా పీడించి, రైతులు పరారయ్యే పరిస్థితిని కల్పించే దుర్మార్గాన్ని వేంపల్లి షరీఫ్ "జీపొచ్చింది" కథలో ప్రతిబింబించారు.

ఇలా స్థానిక సంపన్నులు, ప్రభుత్వ ప్రతినిధులు రైతు వ్యతిరేకపాత్ర నిర్వహించడాన్ని చాలామంది కథారచయితలు అనేక పద్ధతుల్లో చిత్రించారు. గ్రామాల్లోని రైతులకే కాదు, అడవుల్లో పోడు వ్యవసాయం చేసుకొని బతికే గిరిజనులకు కూడా పల్లపు ప్రాంతం వాళ్ళుగా, మైదానం ప్రాంతం వాళ్లుగా అవతారమెత్తి సంపన్నులు దోచుకోవడం తెలుగునాట ఒక వాస్తవం. గిరిజన ప్రాంతాల కథా రచయితలు ఈ వాస్తవాన్ని కథలుగా మలిచారు. ఉత్తరాంధ్రలో భూషణం, అట్టాడ అప్పల్నాయుడు, గోదావరి జిల్లాల్లో వాడ్రేవు వీరలక్ష్మీ దేవి మొదలైన వాళ్లు ఈ వస్తువు మీద కథలు రాశారు. "అడివంటుకుంది" కథలో భూషణం వ్యాపారులు దోపిడీ చేయడాన్ని భరించలేక గదబ, జాతపు గిరిజనులు తిరగబడటాన్ని ఆవిష్కరించారు. 'పోడు–పోరు' కథలో గిరిజనులు తాము దోపిడీకి గురౌతున్న నిజాన్ని తెలుసుకొని తిరగబడితే, రాజ్యం దోపిడీదారులకు అండగా నిలవడాన్ని చిత్రించారు. చిన్న రైతులు ఆర్థిక సమస్యలను ఆధారం చేసుకొన్న సంపన్న రైతులు వాళ్ల సమస్యల్ని పరిష్కరించే నెపంతో వాళ్ళ భూముల్నే కాజేసే నిజాన్ని "బతుకు చెడిన దేశం" కథలో చూపించారు.

## రైతు ఉత్పత్తి – ధర నిర్ణయ హక్కు

రైతు కథల్లో మనకు కనిపించే ఒక ముఖ్యమైన పార్శ్వం నానా అవస్థలూ పడి, అతివృష్టికి, అనావృష్టికి తట్టుకొని పంటలు పండిస్తే ఆ పంటలు అమ్మే సమయంలో మద్దతు ధర, గిట్టుబాటు ధర లభించకపోవడం. గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల రైతులు కుదేలు కావడం, అప్పుల పాలు కావడం, కుటుంబంలో ఘర్షణలు జరగడం వంటి దుష్పరిణామాలు సంభవిస్తాయి. రైతుకు తన ఉత్పత్తికి ధరను నిర్ణయించే హక్కు లేకపోవడం వల్ల కూడా వ్యవసాయ రంగం పరాధీనమవుతున్నది. ఈ వాస్తవాలన్నింటినీ తెలుగు కథకులు చిత్రించారు. రైతు ఉత్పత్తుల ధరను పడగొట్టడంలో దళారీల దుర్మార్గాలను కూడా తెలుగు కథకులు వాస్తవికంగా చిత్రించారు.

మామూలు రైతులు తమ పంటను ఎక్కువ ధర పలికేదాకా నిలవ చేసుకోలేక, ఇంటి అవసరాలకు అతితక్కువ ధరకు అమ్మేసుకునే నిజాన్ని అందె నారాయణ స్వామి "గాలిలో దీపం" కథలో చూడవచ్చు. సింగమనేని నారాయణ "అదును", శాంతినారాయణ "దళారి", ఇంకా లంకిపల్లె వంటివారు తమ కథల్లో ఉత్పత్తులకు ధర నిర్ణయించే హక్కు రైతులకు లేకపోవడాన్ని ప్రశ్నించారు. "రైతు బలహీనపడటానికి ముఖ్యకారణం అతని పంటకు గిట్టుబాటు కాని ధరలు"

అన్నారు. "ఒరే రంగయ్యా..! దేశంలో సరుకులు తయారు చేసే వాళ్లంతా వాళ్ళ సరుకు రేటు వాళ్ళే నిర్ణయించు కుంటారు... కానీ, మన దగ్గరకు వచ్చేసరికి మనం పండించుకునే పంటకు రేటు మనం చెప్పుకునేందుకు లేదు. ఏ వ్యాపారస్తుడో చెప్పాలి. ఏ గవర్నమెంటో చెప్పాలి. హైదరాబాదు గవర్నమెంటు చెబుతుందో, ఢిల్లీ గవర్నమెంటు చెబుతుందో, నాగపూర్ మార్కెట్ చెబుతుందో..! మనం మాత్రం చెప్పుకునేందుకు లేదు. ఇంతకంటే అన్యాయం ప్రపంచంలో ఎవరికైనా జరుగుతుందా.. మన రైతుకు తప్ప" అని వాపోతాడు నారాయణప్ప అనే చీనీకాయల రైతు "అదుసు" కథలో. తెలుగు రైతు కథల్లో ఇది ఒక ముఖ్యమైన ఆర్థిక పార్శ్వం.

## రైతుల జీవితాలు దళారుల పాలు

రైతులు పండించిన పంటను అమ్ముకోవడంతో, వ్యవసాయంతో సంబంధం లేని, శ్రమతో సంబంధం లేని దళారీలు నిర్వహించే పాత్ర అమానుషమైనది. రైతును తన ఉత్పత్తి నుండి పరాయీకరిస్తున్నది దళారీ వ్యవస్థ. తెలుగు కథకులు ఈ దళారీ వ్యవస్థ నగ్నరూపాన్ని అనేక కథల్లో ప్రదర్శించారు. శాంతి నారాయణ "దళారి", సింగమనేని "అదుసు", "జూదం", సత్తిపల్లి చిదంబరరెడ్డి "అడవి" వంటి కథల్లో దళారుల మోసాలు బయటపడతాయి. మూడు కేజీల ముల్లంగిని మార్కెట్లో ముప్పై రూపాయలకు అడుగుతారు దళారులు. అనంతపురంలో లారీ బ్రోకర్లు మొదలు నాగపూర్‌లో చీనీ కాయల బ్రోకర్లు దాకా రైతును వంచించి, అవమానించి దోచుకుంటారు. దళారీ వ్యవస్థ నిర్మూలనను గురించి మాటలేగానీ, నిర్మూలన మాత్రం జరగలేదు. దళారుల మోసాలను గ్రహించిన రైతు "థూథూ అంతా బద్దు నాయాళ్లే.." అని తిట్టుకోవడం నోటితీట కాదు, ఆగ్రహం (దళారి). ఇలాంటి కథలు తెలుగు నాట అన్ని ప్రాంతాల నుంచీ వచ్చాయి.

ఇక్కడే మరొక వాస్తవాన్ని కూడా ప్రస్తావించుకోవాలి. అది విత్తనాల, పురుగుమందుల సరఫరా చేయడం. వ్యాపారులు చేసే మోసం. నకిలీ విత్తనాలు, కల్తీ మందులు, ఈ దుర్మార్గాన్ని కూడా తెలుగు కథకులు ఉపేక్షించకుండా కథల్లో ఉతికి ఆరేశారు. ప్రపంచీకరణ ప్రవేశానికి ముందు రైతులు తాము పండించిన పంటనుంచే విత్తనాలు దాచుకునేవారు. ప్రపంచీ కరణ వచ్చినాక, రైతు ప్రతిసారీ విత్తనాలు వ్యాపారుల నుంచి కొనుక్కునే పరిస్థితి వచ్చింది. వ్యాపారులు అమ్మే విత్తనాలు రైతును, వంచించి మోసం చేస్తాయి. పినాకపాణి రాసిన "విత్తనాలు" కథ కల్తీ విత్తన వ్యాపారాన్నీ విమర్శనాత్మకంగా ప్రతిబింబించింది. చిదంబర రెడ్డి "సుడిగుండం" కథ పట్టు గుడ్ల వ్యాపారులు చేసే మోసాలను బహిర్గతం చేస్తుంది. పట్టుగుడ్లకు బదులు బంకతో పేపరు మీద అతికించినవి గసగసాలని తెలిసి ఆశ్చర్యపోతాం.

## వాన కురుస్తే ...

అభివృద్ధికి దూరంగా నెట్టివేయబడిన ప్రాంతాల రైతులు, కరువు పీడిత ప్రాంతాల రైతులు జీవితంలో వాన కోసం నిరీక్షించబడటం ప్రధాన భాగం. ప్రకృతి అననుకూలత వాళ్లకు పెద్ద అవరోధం. రుతువులు గతితప్పడం, నేల నెర్రెలు బారడం, పైర్లు ఎండిపోవడం, విత్తనం వేసే అవకాశం రాకపోవడం, వాన కోసం అనేక మూఢాచారాలకు అనుసరించడం, నీటి కొరత కుటుంబ సంబంధాల మీద, గ్రామ సంబంధాల మీద క్రూరమైన ప్రభావాన్ని చూపడం వంటి అనేక దుష్పరిణామాలు సంభవిస్తాయి. వాన కోసం ఎదురు చూసే రైతు జీవిత ప్రతిఫలనాలుగా తెలుగులో చాలా కథలు వచ్చాయి. రైతు కథా సాహిత్యంలో ఇవి ఒక ముఖ్యమైన భాగం.

రాయలసీమ రైతు వానకోసం నిరీక్షించడం మీద కేతు విశ్వనాథరెడ్డి రాసిన "వాన కురుస్తే" కథ తలమానికమైనది. పాపిరెడ్డి జీవితమంతా వానకోసం ఎదురుచూడడంలోనే గడిచిపోయింది. ఆయన తర్వాత ఆయన కొడుకు తండ్రిలాగా వానకోసం ఎదురు చూడడం మొదలుబెడతారు. ఈ లోపల అనేక విపరీత ఆచారాలు.. "వానల కోసం ప్రజలు భజనలు చేస్తారు. వాన రాదు. కానీ, రాజకీయాలొస్తాయి". అంటాడు రచయిత. వాన వస్తుందని, కాలువ వస్తుందని రైతు ఎన్ని గాలి మేడలు కడతాడో, అవి ఎలా కూలిపోతాయో ఈ కథలో చూడవచ్చు. స్వామి "వాన రాలే" కథలో పెన్నప్ప కూడా చేసింది వానకోసం ఎదురుచూడటమే.. సన్నపురెడ్డి వెంకట రామిరెడ్డి కథ "ఒక్క వాన చాలు" కూడా వాన కోసం రైతు నిరీక్షించే కథ. వాళ్లకు వానలు వచ్చినట్లు కలలు వస్తుంటాయి. మెలకువ వస్తే అది అబద్ధమై ఉంటుంది. కరువు నేలలో వాన కోసం జరిగే అశాస్త్రీయ కర్మకాండను బాలగొండ ఆంజనేయులు రాసిన "కడవ సగినం" కథలో చూడవచ్చు. ప్రజల అవిద్యను స్వార్థపరులు ఎలా సొమ్ము చేసుకుంటారో కూడా ఈ కథ చెబుతుంది.

## రైతు X వ్యాపారి

రైతులు తిండిగింజలను ఉత్పత్తి చేస్తారు. వాటిని స్వయంగా అమ్ముకోలేని పరిస్థితిలో వ్యాపారులు బయల్దేరతారు. పెట్టుబడిదారీ వ్యవస్థ వ్యాపారుల ఆధిపత్యంలో ఉంటుంది. సాధ్యమైనంత తక్కువ పెట్టుబడి పెట్టి, వీలైనంత ఎక్కువ లాభం పొందడం వ్యాపార లక్షణం. కష్టపడి పండించేది రైతు. దాని మీద లాభాలు కొట్టేది వ్యాపారి. ఈ వైరుధ్యాన్ని అనేకమంది తెలుగు కథకులు వాస్తవికంగా చిత్రించారు. కాళీపట్నం రామారావు "యజ్ఞం", రెంటాల నాగేశ్వరరావు "స్వేదం ఖరీదు", కాట్రగడ్డ దయానంద్ "మబ్బు తునక – మట్టి ముద్ద", మధురాంతకం నరేంద్ర "అత్యాచారం", సుంకోజి దేవేంద్రాచారి "గొంగళి పురుగు", తుమ్మల రామకృష్ణ "మట్టి పొయ్యి" తదితర కథల్లో భారతీయ రైతుతో వ్యాపారవర్గం ఎలా ఆడుకుంటుందో చిత్రించారు. రైతు వ్యాపారివర్గాల ఉత్థానపతనాలను "యజ్ఞం" కథ మనకు స్పష్టంగా వివరిస్తుంది. వస్తు మార్పిడి పద్ధతి అమలులో ఉన్న కాలంలో రైతు పై స్థానంలో ఉన్నాడని, ధన మార్పిడి పద్ధతి అమల్లోకి వచ్చాక, వ్యాపారి పైకి ఎదిగి, రైతు కిందకి దిగబడిపోయాడని కా.రా. వాస్తవికంగా చిత్రించారు. స్వతంత్ర భారతదేశంలో నారప్ప వంటి రైతులు బాగా బతికే స్థితి నుండి వర్షాభావం వల్ల, ధరల పతనం వల్ల నాశనమైతే, రామ శేషయ్య వంటి వ్యాపారులు గుగ్గిళ్ళు అమ్ముకునే స్థితి నుంచి రైతుల రక్తాన్ని పీల్చే జలగలుగా తయారై వడ్డీలు తిప్పే దశకు ఎదిగిన క్రమాన్ని సింగమనేని "జూదం" కథ ప్రతిఫలిస్తుంది. రెంటాల నాగేశ్వరరావు "స్వేదం ఖరీదు" కథలో శేషగిరిరావు అనే రైతు భూమిని నమ్ముకుని శేషయ్యగా, కూరగాయలమ్మే వీరగాడు బ్రోకర్‌గా మారి మాగాణ భూములు కొని చిన వీరయ్య అయిన తీరును చిత్రించారు. కాట్రగడ్డ దయానంద్ అట్లపెనంతో వచ్చిన వైశ్యుడు అట్ల వ్యాపారంలో కోటీశ్వరుడు కాగా, 50 ఎకరాల వ్యవసాయం చేసిన రైతు అప్పుల ఊబిలో కూరుకుపోయిన తీరును ప్రదర్శించారు. సుంకోజి దేవేంద్రాచారి, తుమ్మల రామకృష్ణ వడ్డీ వ్యాపారుల వలలో పడి రైతు విలవిలలాడడం తమ కథల్లో చిత్రించారు. భూస్వామిగా భూమిని చేతిలో పెట్టుకొని, వడ్డీవ్యాపారం చేసే నాయుడు తన భూమిని నారాయణకు కౌలుకు ఇచ్చి, అతనిని అప్పుల్లో ముంచివేసిన తీరును సుంకోజి వాస్తవికంగా చిత్రించారు. గ్రామాల్లో వడ్డీ వ్యాపారుల బారిన పడి రైతులు కరిగిపోతున్న తీరును తుమ్మల రామకృష్ణ చిత్తూరు జిల్లా నేపథ్యంలో ఆవిష్కరించారు. అన్ని ప్రాంతాల నుంచీ ఇలాంటి కథలు వచ్చాయి. మామిడితోటల రైతులను మామిడికాయల వ్యాపారులు ముందుగా బాకీలిచ్చి ఎలా దోచుకుంటారో నరేంద్ర చాలా వాస్తవంగా చిత్రించారు.

## రైతు, కౌలు రైతు, పాలేరులు : సహకారం, సంఘర్షణ

గ్రామీణ జీవితంలో సహకారం, సంఘర్షణ రెండూ ఉంటాయి. ఆర్థిక సాంఘిక వైరుధ్యాలు ఇందుకు కారణాలు. రైతు, కౌలు రైతుల మధ్య రైతు పాలేరుల మధ్య సహకారమూ ఉంటుంది. సంఘర్షణగా ఉంటుంది. భూస్వాములైతే తక్కిన ఇద్దరితో సంఘర్షణే ఉంటుంది. మధ్య తరగతి, కింది తరగతి రైతులకు వాళ్లకు మధ్య సహకారముంటుంది. ఈ రెండు ధోరణులను కూడా తెలుగు కథలు ప్రతిబింబిస్తున్నాయి.

వేలూరి శివరామశాస్త్రి *(వ్యత్యాసం)*, తాళ్ళూరి నాగేశ్వరరావు (మమత), పి.రామకృష్ణ (కాపోడు – కూలోడు), సన్నపురెడ్డి (చనుబాలు) వంటి అనేకమంది కథకులు రైతు, పాలేరుల (జీతగాళ్లు) మధ్య ఉండే విడదీయరాని సంబంధాన్ని చిత్రించారు. అడవి బాపిరాజు (నరసన్న పాపాయి) కూడా అలాంటి కథలు రాశారు. రైతు నరసింహులు, పాలేరు కాటడు ఒకరికి అవసరం అయిన ఎప్పుడు ఇంకొకరు ఆదుకుంటూ సుదీర్ఘమైన జీవితం ఎలా గడపారో శివరామశాస్త్రి ఆసక్తికరంగా ఆవిష్కరించారు. నరసింహులు కొడుకు పాములు, కాటడు కొడుకు రాములు మధ్య ఈ అనుబంధం చెడిపోయింది. ఇందుకు కారణం రాములు కాదు, పాములే. రైతు కుటుంబంలో తరం మారిన తర్వాత వచ్చిన మార్పును ఈ కథ చెబుతుంది. తాళ్లూరి నాగేశ్వరరావు మోతుబరి రైతు వెంకట సుబ్బయ్యలో కన్నా, పాలేరు కోటేశులో మిగిలి ఉన్న కృతజ్ఞత, మమకారాలను ఆవిష్కరించారు. చిన్న రైతులు అవసరం కోసం కూలీలను పెట్టుకున్నా వాళ్లు అంతరాలు మరచిపోయి ఎలా పొలంలో పనిచేస్తారో పి.రామృష్ణ చిత్రించారు. సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి సంపన్న రైతు కుటుంబంలోని అబ్బాయి దళిత మహిళ పాలు తాగి బతికి బట్టకట్టిన తీరును చిత్రించారు. కరుణ కుమార "బిళ్లల మొలతాడు" కథలో కపటంలేని కష్టజీవి పాలేరు సుబ్బడు. అతని యజమాని రామిరెడ్డి, సుబ్బడి భార్య రమణి మీద కామంతో వాళ్ళను హింసిస్తాడు. కాని రామిరెడ్డి తల్లి లక్ష్మమ్మ గొప్ప మానవతామూర్తిగా కుటుంబానికి అండగా నిలుస్తుంది.

వ్యవసాయంతో సంబంధం లేని భూస్వామి ఉద్యోగి రంగారావు, ఊరి కరణం రామచంద్రయ్య కౌలు రైతు మల్లయ్యను క్రూరంగా వ్యాపించిన తీరును భాస్కరభట్ల కృష్ణారావు "ఇజ్జత్" కథలో చిత్రించారు.

## రైతు – ప్రకృతి అననుకూలత

ప్రకృతి అనుకూలించి సకాలంలో వర్షాలు పడితే రైతు జీవితం సంతోషంగా ఉంటుంది. అనావృష్టో, అతివృష్టో అయితే రైతు జీవితం దుర్భరం. తెలుగు కథకులు అనావృష్టి అతివృష్టులతోనే గాక, అకాల వృష్టితో కూడా రైతులు నష్టపోతున్న తీరును కథలుగా మలిచారు. తెలుగు నాట ఉత్తరాంధ్ర, తెలంగాణా, రాయలసీమల నుండి ఈ అంశం మీద కథలు వచ్చాయి. మధ్యాంధ్రలో పల్నాడు ప్రాంతం నుండి కూడా ఈ అంశంమీద కథలు వచ్చాయి. చాసో "వఱడు" కథలోనే కరువు చిత్రణ చేశారు. రైతుకు అవసరమైనప్పుడు రాని వాన, అవసరం లేనప్పుడు వచ్చే చక్రవేణు "కసాయి కరువు" కథలో రైతుకు, పశువుకు ఉండే విడదీయరాని సంబంధాన్ని, కరువు ఆ సంబంధాన్ని విధ్వంసం చేయడాన్ని ఆర్ద్రంగా చిత్రించారు. అలాగే "కువైట్ సావిత్రమ్మ" కథలో కరువు వల్ల కుటుంబాలను పోషించుకోవడానికి మహిళలు కువైట్ లాంటి దేశాలకు వెళ్లి అవస్థలు పడే తీరును ఆవిష్కరించారు. రాయలసీమ కథకులు అనేకమంది కరువు రాయలసీమ సమాజాన్ని అన్ని రకాలుగా, ఎలా ధ్వంసం చేస్తున్నదో అనేక కథల్లో చిత్రించారు. 'సీమ కథలు' సంకలనం ఈ వాస్తవానికి అక్షర రూపం. వాన కోసం ఎదురు చూడటంతోనే రైతు జీవితాలు గడిచిపోయినట్లే, కాలవల కోసం కూడా రైతులు ఎదురు చూసి చూసి నిరాశతో జీవితాలు చాలించిన వాస్తవం మీద జిఆర్ మహర్షి "నన్ను క్షమించు నాన్నా" కథ రాశారు. కరువు కక్షలకు ఎలా మూలమౌతున్నదో పాలగిరి విశ్వప్రసాద్ 'కరువూ వచ్చే కచ్చలు వచ్చే" కథలో చిత్రించారు. జి.నిర్మలారాణి "కాటేసిన కరువు", ఎం.హరికిషన్ "పచ్చి కరువు" వంటి అనేక కథలు పరిశీలింపదగినవి.

అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోయిన తీరును అడవి బాపిరాజు "వడగళ్లు", శశిశ్రీ "నదీ పాల్" వంటి కథల్లో ఆవిష్కరించారు. వర్షాభావం వల్ల రైతు దొంగగా మారిన విషాదాన్ని శశిశ్రీ "అలికిడి" కథలో చూపించారు. పోలవరపు కోటేశ్వరరావు 'చిల్ల పెంకులు' కథలో వరద రైతును ముంచివేసిన తీరును చిత్రించారు.

## రైతు భూమి, పశువు సంబంధాలు

రైతు, నేల, పశువు ఇవి ఒక త్రయం. రైతు కార్యక్షేత్రం భూమి. అతనికి తోడు పశువు. ఈ మూడింటి సంబంధాలను చిత్రించే కథలు, ఈ మూడింటి మధ్యగల అవినాభావ సంబంధాన్ని విచ్ఛిన్నం చేసే శక్తులను ప్రదర్శించే కథలు తెలుగులో చాలా వచ్చాయి. పారిశ్రామికీకరణ రైతును భూమి నుండి దూరం చేస్తున్న తీరును కేతు విశ్వనాథరెడ్డి 'నమ్ముకున్న నేల' కథలో చిత్రించారు. పెట్టుబడిదారీ వ్యవస్థ బలిసిపోయి, ప్రపంచీకరణ సమాజంలో వ్యాపార సంబంధాలను అభివృద్ధి చేసిన నేపథ్యంలో భూమి సంబంధించి రెండు తరాల మధ్య ఏర్పడిన వైరుధ్యాల్ని చిలుకూరి దేవపుత్ర "మన్నుదిన్న మనిషి" కథలో చూపెట్టారు. భూమిని అమ్మేయమని కొడుకు ఒత్తిడి చేస్తే, పొలంలో కన్నుమూసిన తండ్రి కథ ఇది. గోపీచంద్ "మమకారం", పి.యశోదరెడ్డి "ఎంకన్న", పి.రామకృష్ణారెడ్డి 'మనిషీ-పశువూ", "బట్టకోడె" వంటి అనేక కథలు రైతుకు, పశువుకు మధ్య ఉండే అనుబంధాన్ని ఆవిష్కరించాయి. బలమైన ఎద్దు రైతు కుటుంబ సభ్యులతో ఎంత మానవీయంగా ప్రవర్తిస్తుందో "బట్టకోడె" కథ చెబుతుంది. రాయలసీమలో రైతు పశువులను ఇంటిముందే కొట్టంలో పెట్టుకొని అభిమానించే తీరును "మనిషీ – పశువూ" కథ ప్రదర్శిస్తుంది. ఇప్పుడు గ్రామాల్లో వ్యవసాయం పశువులతో జరగడం తగ్గిపోయింది. కూలీల కొరత, యంత్రాల వల్ల పనులు వేగంగా జరగడం దీనికి కారణాలు. ఇదంతా ఒక ప్రాసెస్. భారతీయ రైతు భూమికి దూరం కావడం చూస్తున్నాం. ఆదాయాల వెంపర్లాటలో రైతు కూడా భూమిని వదలి వ్యాపార రంగంలోకి పోతున్నాడు. ఇది అంత మంచి పరిణామం కాదు.

## రైతూ, అప్పులు, వలసలు, ఆత్మహత్యలు

సామాన్య రైతుల బతుకులు అప్పుల్లో పుట్టి, అప్పుల్లో పెరిగి, అప్పుల్లోనే ముగుస్తున్నాయి. గాలిలో దీపంలాగా, సుడిగుండంలో నావలాగా ఉంటుంది సన్నకార, చిన్నకారు రైతుల పరిస్థితి. వ్యవసాయంలో నష్టపోవడం రైతు ఫిలాసఫీ అయిపోయింది. దీనివల్ల రైతు రైతుకూలిగా మారడం, లేదా వలసలు వెళ్లడం లేదా ఆత్మహత్యలు చేసుకోవడం ఇలాంటి పరిణామాలే కళ్ళముందు కనిపిస్తున్నాయి. ప్రపంచీకరణ ప్రవేశించిన తర్వాత ఈ పరిణామాలు వేగవంతమై రైతు పరిస్థితి మరింత దిగజారిపోయింది. ఈ వాస్తవాన్ని తెలుగు కథకులలో అనేకులు చిత్రీకరించారు.

తాతముత్తాతల కాలంలో బాగా బతుకుతూ క్రమ క్రమంగా భూమి తరుగుతూ అప్పులు పెరుగుతూ వచ్చే పరిణామం చాలా కుటుంబాల్లో కనిపిస్తుంది. అప్పులలోంచి బయటపడడానికి రైతులు రకరకాలుగా ప్రయత్నాలు చేస్తుంటారు. వాటిని స్వప్రయోజనాలకు వాడుకొనే వాళ్లు కూడా గ్రామాల్లోనే ఉంటారు. అలాంటప్పుడు రైతుకు మిగిలింది ఒకటే మార్గం. భూమిని అమ్మేసి, అప్పులలోంచి బయటపడి పట్నాలకు వలసపోవడం. అట్టాడ అప్పల్నాయుడు రాసిన "బతుకు చెడిన దేశం"లో బలరామనాయుడు చేసిన పని ఇదే. వల్లూరి శివప్రసాద్ రాసిన "గిట్టుబాటు ధర" కథ వ్యాపార పంటలలో దివాళా తీసిన రైతు అప్పులు తీర్చడానికి పొలం మాత్రమే కాదు, కిడ్నీలు కూడా అమ్ముకోవలసి వచ్చిన దుస్థితిని చిత్రించింది. ఇలాంటి వ్యవస్థను ఏమని స్తుతించగలమనే ప్రశ్నను ఈ కథ వేస్తుంది. ఆయనదే "నాగేటి చాలు" కథ కూడా వ్యాపార పంటలలో నష్టపోయిన రైతులు ఆత్మహత్య చేసుకున్న పరిస్థితి రావడాన్ని కళ్లకు కట్టినట్లు చిత్రించింది. పొగాకు వ్యాపారులు రైతులను ఎలా దివాళా తీయిస్తారో ఈ కథ చెబుతుంది.

పులికంటి కృష్ణారెడ్డి "దినం సచ్చేవాడికి ఏడ్చే వాడెవడు?" పాపినేని శివశంకర్ 'చింతలతోపు, మంచికంటి వెంకటేశ్వర రెడ్డి "మిత్తవ", గోపరాజు నారాయణరావు "పుడమి పుత్రులు", కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి "మూగచింత", శాంతి నారాయణ "రత్నాల సీమలో", వి.ఆర్.రాసాని "అన్నే కారిజల", తుమ్మేటి రఘోత్తమరెడ్డి పగలూ రేయీ శ్రమ పడుతున్నా', కె.వి.నరేందర్ "వేరు తొలిచే పురుగు" వంటి పదుల కొలది కథలు అనేక కారణాల వల్ల రైతులు నిర్బంధ మరణాల పాలవుతున్న వాస్తవాల్ని చిత్రించాయి. 'మృత్యువు పువ్వు'లో (జూకంటి జగన్నాథం) వీరయ్య, "అన్నేకారిజల"లో మునెప్ప, "దినం సచ్చే వారికి ..." కథలో పన్నెండు మంది రైతులు, "రత్నాల సీమ"లో మల్లన్న, 'మిత్తవ'లో గోయిందమ్మ వంటి వాళ్లందరూ అలా బలైపోయిన రైతులు. అన్నదాతల మరణాలు ఏ సమాజానికి గౌరవం కాదు.

## అభివృద్ధి : రైతు...

అభివృద్ధి పేరు మీద పాలకులు చేపట్టే భారీ నీటి ప్రాజెక్టులు, నగరీకరణ ప్రాజెక్టుల వల్ల కూడా రైతులు భూములను పోగొట్టుకొని నష్టపోతూ ఉండడం ఒక వాస్తవం. దీనిని కూడా తెలుగు కథకులు వదిలిపెట్టకుండా చిత్రించారు. రైతులు అభివృద్ధి నిరోధకులు కారు. అయితే వాళ్ల ఉనికినే ఊడ్చేసి, పెత్తందార్లకు, కార్పొరేట్ శక్తులకు మేలు చేయడం అన్యాయం. ఈ అన్యాయాన్నే కథకులు ఎత్తిచూపారు. శిరంశెట్టి కాంతారావు మానేరు డ్యాం నిర్వాసితుల మీద "మట్టి తాళ్ళ వల", నల్లూరి రుక్మిణి పులిచింతల ప్రాజెక్టు ముంపు ప్రజల మీద "ముంపు" వంటి కథలు రాశారు. ముదిగంటి సుజాతా రెడ్డి అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణంలో భూమిని పోగొట్టుకున్న రైతుల మీద "గుడిసెలూ–గుడిసెలూ" కథ వంటివి రాశారు.

సామాన్య రైతులు గానీ, రైతు కూలీలుగానీ శ్రామిక శక్తులు. వాళ్ళలో సహనం ఉంది, తిరుగుబాటు తత్వమూ ఉంది. గ్రామ స్థాయిలో రైతులు, రైతు కూలీలు... భూస్వాములు, పెత్తందార్ల ధోరణులను సహించటం వీలుకానప్పుడు తిరుగుబాటు చేస్తారు. సహాయ నిరాకరణ చేస్తారు. ఏదో ఒక స్థాయిలో ప్రతిఘటన చేస్తారు. గ్రామంలో పెత్తందార్లను ప్రశ్నించడమంటే జాతీయ, రాష్ట్రీయ స్థాయిలో పాలకులను ప్రశ్నించడమే. చాలా కథలలో వ్యవసాయ రంగంలో సామాన్య రైతులు, రైతు కూలీలు ప్రశ్నించి, తిరగబడిన వాస్తవాలు కనిపిస్తాయి. రైతులు వ్యాపార వర్గాల మీద తిరగబడిన కథలూ ఉన్నాయి.

వల్లూరి శివప్రసాద్ "పురుగు" కథలో పత్తి పంటకు కల్తీ మందులు అమ్మిన కొట్టువాడిమీద, దాని కొనించిన పట్టు వ్యాపారి కృష్ణమూర్తి మీద రైతు అమరయ్య తిరగబడి కొడతాడు. తమ పూర్వీకులంతా భూస్వాముల ఇండ్లల్లో వంచనకు, దోపిడీకి గురికాగా, చదువుకొన్న దళిత యువకులు ఆధిపత్య కులాలకు చెందిన భూస్వాములను ప్రశ్నించే చైతన్య సంపాదించుకోవడం కేతు విశ్వనాథ రెడ్డి "చీకటి నాడి – వెలుగు నెత్తురు", "మార్పు" వంటి కథల్లో ఆవిష్కరించారు. కాలువ మల్లయ్య "భస్మాసుర హస్తం" కథలో సంఘం చెప్పిన తిరుగుబాటు రైతులు, పేదకూలీల సమస్యలకు పరిష్కార మార్గమని పాలకులు, వ్యాపారుల చేతిలో నష్టపోయిన రైతు నర్సిరెడ్డితో చెప్పించారు. కరుణ కుమార, ఆవుల పిచ్చయ్య, వైసివిరెడ్డి వంటి అనేకమంది తెలుగు కథకులు, రైతు, రైతు కూలీలు తిరుగుబాటు చేసిన కథలను రచించారు.

భారతీయ గ్రామాలు సకల అసమానతలకు నిలయాలు కావడం వల్ల వ్యవసాయ రంగానికి రెండు చేతులైన రైతులు, రైతు వృత్తుల వాళ్లు, రైతుకూలీలు పరస్పరం సంఘర్షించుకుంటున్నా, పరస్పరం సహకరించుకోవడమూ కనిపిస్తుంది. ఈ రెండు పార్శ్వాల వాళ్ళూ పాలనా, కార్య నిర్వహణ వ్యవస్థల

వల్ల, స్థానిక పెత్తందారీ వ్యవస్థ వల్ల నష్టపోయిన వాళ్ల జీవితాలను తెలుగు కథకులు నూరేళ్లకుపైగా నిజాయితీగా చిత్రిస్తూ వస్తున్నారు. ఉద్యమ కథలలోనూ, ఉద్యమేతర కథలలోనూ వ్యవసాయ రంగం – రైతు, రైతు కూలీ, రైతు వ్యవసాయ వృత్తులు – వాస్తవ రూపంలో ఆవిష్కరింపబడ్డాయి.

"రైతు బలహీనపడినప్పుడు ప్రగతి కుంటిపడక తప్పదు"

"ఏకాలమైనా ఏదేశమైనా రైతును చిన్నచూపే చూసింది"

"రైతుకు చట్టపరమైన రక్షణ లేదు. సామాజిక ఆదరణ లేదు"

"మారుతున్న వాతావరణంలో సామాజిక న్యాయం రైతుకు అనుకూలంగా లేదు"

"అన్నదాతను పీడించి ఏడిపించిన ఏ ప్రభుత్వమైనా పరాభవాన్ని చవిచూడక తప్పదు" (లంకిపల్లె : జీవనం)

**ఆధారాలు :**


1. అనేక తెలుగు కథల సంపుటాలు
2. కథాంశం : రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
3. మన నవలలు – మన కథానికలు : రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
4. తెలుగు కథానిక – రైతు జీవిత చిత్రణ : పి.వి.సుబ్బారావు.
5. తెలంగాణ తెలుగు కథ : పంతంగి వెంకటేశ్వర్లు (సం)
6. ఉత్తరాంధ్ర కథా వెలుగు : వెలుగు (ప్ర)
7. రాయలసీమ ఆధునిక సాహిత్యం : సామాజిక సాంస్కృతిక విశ్లేషణ : వల్లంపాటి వెంకట సుబ్బయ్య
8. తొమ్మిది పదుల తెలంగాణ కథ : కాలువ మల్లయ్య
9. రాయలసీమ సమాజం – సంస్కృతి : స్వామి
10. కథా తెలంగాణం : బివిఎన్ స్వామి
11. కోస్తా ఆంధ్ర ఆధునిక సాహిత్యం : వి.వి. సుబ్బారావు
12. గుంటూరు మండలం సాహిత్యం : పెనుగొండ లక్ష్మీనారాయణ


కవిత

## గగనానికి మార్గం


- కళ్యాణదుర్గం స్వర్ణలత

9848626114


*నిర్మలాకాశం నేలమీద పరచుకొని*
*పున్నాగ పూలు తారకలై*
*మెరుస్తుంటే*
*వెన్నెల తోడైన చందురుడు*
*ఆకాశాన్ని పోల్చుకోలేక*
*కంగారు పడి..*
*నా చోటుకి వచ్చేసాడు..*



*నా దోసిలి అంత సంతోషాన్ని*
*పున్నాగ పూల పరిమళాన్ని*
*తనకిచ్చి తిరిగెళ్లమన్నాను*

*వీడిపోలేని భావాన్ని నింపుకున్న*
*తన గుండె తడి చల్లగా నన్ను తాకితే ..*
*కొమ్మలో నుంచి రెమ్మలోనుంచి*
*తానెళుతున్న మార్గాన్ని చూస్తున్న*
*నా కంటి వెలుగే తనకు మళ్ళీ గగనాన్ని చూపింది.*

## హంసధ్వని


- లక్ష్మీ కందిమళ్ళ

98493 68808


*సుకుమారమైన*
*శుభ్రమైన స్వచ్ఛమైన*
*వివేకం*
*అప్పుడే వికసించి,*
*హితమై*
*వినిపించే*
*విషయం*



*వసంతం*
*వెతుక్కుంటూ వచ్చి*
*ఉన్న క్షణాన*
*నన్ను తాకింది*

*నన్ను నేను*
*వ్యక్తీకరించుకునే*
*సమయం అదే*

*నాణ్యమైన*
*పారదర్శకమైన*
*కవితా చరణాలు*
*మరింత చిక్కబడుతూ*
*సాగుతుంటాయి*
*స్వచ్ఛమైన*
*శబ్దంతో*
*హంసధ్వని రాగంలా...*



సాహితి స్రవంతి సన్నాహకంగా 1998 డిసెంబర్‌లో జరిగిన శిక్షణా తరగతుల ప్రిన్సిపల్‌గా కేశవరెడ్డి, చిత్రంలో మోటూరు హనుమంతరావు, తెలకపల్లి రవి

# అధ్యాపక దీపం అనువాద రత్నం

- తెలకపల్లి రవి

కొమ్మారెడ్డి కేశవరెడ్డి మృతితో ఉపాధ్యాయ ఉద్యమం ఒక మంచి నాయకుడిని కోల్పోయింది. తెలుగు పుస్తక ప్రపంచం సమర్థుడైన, శక్తివంతుడైన అనువాదకుణ్ని పోగొట్టుకుంది. తన వల్ల ఉత్తేజం పొంది అభ్యుదయ భావజాలం వైపు ఆకర్షితులై ఆశయాల బాటలో ముందుకు సాగుతున్న చాలామంది చైతన్య జీవులు ప్రేరణనిచ్చిన గురువు గారిని పోగొట్టుకున్నారు. క్రమశిక్షణ, అంకితభావం, ఉదాత్త మానవీయ విలువలు, ఎంత కృషి చేసినా వినమ్రంగా మసలే సంస్కారం నిండిన పెద్దాయన కేశవరెడ్డి. గుంటూరు జిల్లా అంబాపురంలో పుట్టి పక్కనే వున్న గురజాలలోనూ, తర్వాత కర్నూలు, హైదరాబాదులలోనూ చదువు పూర్తి చేసిన కేశవరెడ్డి ... తెలుగు కళాసాహిత్యాలతో, ప్రజాజీవితంతో, ఉపాధ్యాయ ఉద్యమంతో పెనవేసుకుని పెరిగారు. బాల్యంలోనే హరికథలు, బుర్రకథలు, జానపదాలను చూస్తూ కళల పట్ల మక్కువ పెంచుకుని విద్యార్థి దశలోనే మ్యాగజైన్లలో రచనలు చేసిన జిజ్ఞాసువు ఆయన. సూర్యాపేటలో మొదలై తర్వాత చాలా ఊళ్లు తిరిగిన ఆయన ఉపాధ్యాయ జీవితం రేపటి పౌరులను చేరువ చేసింది. తను చదువుకుంటూ వారిని తీర్చిదిద్దుతూ ముందుకు సాగింది. ఉపాధ్యాయ ఉద్యమ ప్రభావం కేశవరెడ్డికి ఉత్సాహాన్ని మరింత పెంచింది. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆయన శాశ్వత చిరునామాగా మారింది.

**అక్షర ప్రస్థానం.. అపార అధ్యయనం**

అనేక పరిణామాల మధ్య ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఏర్పడినప్పుడు అగ్ర నాయకులుగా ఎ.వెంకటస్వామి, డి.రామిరెడ్డి, పివి సుబ్బరాజు వంటివారు ముందుండేవారు. వీరితో పాటు ఐక్య ఉపాధ్యాయ సంపాదకుడుగా మైనేని వెంకటరత్నం... విజయవాడలో ప్రజాశక్తి కార్యాలయం వెనకే యుటిఎఫ్ భవన్ నిర్మాణం జరిగాక వీరందరినీ నిరంతరం కలుస్తుండేవాళ్లం. గుంటూరు నుంచి దాదాపు వారంలో మూడు నాలుగు సార్లు వచ్చి వెళ్లే వారు కేశవరెడ్డి. ఐక్య ఉపాధ్యాయ సంపాదకవర్గ సభ్యులుగా మైనేనికి సహాయపడుతుంటేవారు. దేశదేశాల విద్యావిధానం గురించి వ్యాసాలు రాస్తుండేవారు. ఇలాటి సమయంలో హఠాత్తుగా *నగరం* వెలువడింది. అమ్మ నవలతో ప్రపంచ వ్యాపితంగా ప్రగతిశీల శక్తులకు ఊపిరులూదిన మాక్సిం గోర్కి నవల *స్వర్ణ పిశాచి నగరం* ఆ విధంగా కేశవరెడ్డి కలంలో రూపుదిద్దుకుంది. పాత్రలకు పేర్లు, వాతావరణం.. వీటన్నిటిని మార్చి తెలుగీకరించే ప్రయత్నం చేశారు. ఆ నవలపైన వచ్చిన సమీక్షలు నాకు తన రచనాశక్తిని పరిచయం చేశాయి. మరోవైపున ఈ విధమైన తెలుగీకరణ మంచిదా కాదా అని చర్చ కూడా నడచింది గాని కేశవరెడ్డి తన అభిప్రాయం మార్చుకోలేదు. కాకుంటే మరింత రెండు మూడేళ్ల పాటు ఏకధాటిగా ఇంగ్లీషు తెలుగు సాహిత్యం చదువుతూ అవగాహన పరిపుష్టం చేసుకున్నారు. పట్టు పెంచుకున్నారు. అప్పుడే ప్రజాశక్తి ఆదివారం అనుబంధానికి ధారావాహికలు రాస్తుండేవారు. 'కాశయ్య ముత్యాలు' వాటిలో నాకు బాగా గుర్తుంది. అది కూడా అనుసరణే అయినా జీవద్భాషలో చాలా పట్టుగా నడిచింది. రచన ఇవ్వడమే గాక ఆయన దానిపై స్పందన తెలుసుకోవడానికి ఎంతో తపన పడేవారు. నాలాటి వారిని పదేపదే ప్రశ్నలు వేసేవారు. పైపై మెచ్చుకోళ్ల కన్నా విషయ ప్రధానమైన విమర్శకు విలువనిచ్చేవారు. అలాటి చాలా చర్చలు నాకు గుర్తుకొస్తున్నాయి. చిన్న చిన్న గల్పికల్లాటి వాటితో గొప్ప భావన స్ఫురింపచేసే శక్తి ఆయనకుండేది. విస్తారంగా చదివారు గనక ఒక్క ఊపులోనే చరిత్ర గమనాన్ని గుదిగుచ్చి రాయగలిగేవారు.

### ప్రామాణిక గ్రంథ పరంపర

ఇఎంఎస్ నంబూద్రిపాద్ స్వాతంత్ర్య పోరాట చరిత్ర బృహద్గ్రంథ అనువాదం కేశవరెడ్డిని చాలామందికి పరిచయం చేసింది. మాన్స్ వర్ద్‌లీగూడ్స్ అనే సులభతర ఆర్థిక శాస్త్ర గ్రంథాన్ని అనువాదం చేసినప్పుడు 'మానవుడు సంపద సమాజం' అనే పేరు నేనే పెట్టాను. వర్గ సమాజ వాస్తవాలను కళ్లకు కట్టే *భూలోకంలో శని* మరో ప్రయోగం. (మూలం : ఆంటన్ టామ్‌సార్వే) బిపిన్ చంద్ర, సుమిత్ సర్కార్, కె.కృష్ణారెడ్డి స్వాతంత్ర్య సమరం పైన, భారతదేశ చరిత్రపైన రాసిన గ్రంథాల సిరీస్ అనువాదం పోటీ పరీక్షలకు గొప్ప వనరుగా కొనసాగుతోంది.

కేశవరెడ్డి ఈ కాలంలో అనారోగ్యంతో బాధపడినా, కుటుంబ బాధ్యతలు వెన్నాడినా కాస్త వెసులుబాటు కలగగానే ఏదైనా అనువాదం అడిగేవారు. ఎలాటి ప్రతిఫలం తీసుకోకుండా, ఆలస్యం లేకుండా అత్యంత బాధ్యతగా అనువాదం చేసి పంపుతుండేవారు. దశాబ్దాలుగా ఎంతో మంది ప్రయత్నించి కూడా తెలుగులో తీసుకురాలేకపోయిన ఎరిక్‌హాబ్స్ వామ్ రచనలు, పీపుల్స్ హిస్టరీ పేరిట ఇర్ఫాన్ హబీబ్ రాసిన చరిత్ర సిరీస్ అనువాదం చేయడం ఆయన పట్టుదలకు ప్రతిబింబం. ఇదే కాలంలో విద్యారంగంపై అగాధమైన శ్రమతో రాసిన సమగ్ర గ్రంథాన్ని ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు సహకారంతో గుంటూరులో ప్రచురింపచేశారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అందించిన ఆణిముత్యాల వంటి అనువాదకుల్లో అగ్రగణ్యులు కేశవరెడ్డి. తనతో పాటు గుర్తుకువచ్చే మరో పేరు ఎజి యతిరాజులు. అందుకే వీరిద్దరిని పలు సందర్భాల్లో అభినందించేవాళ్లం.

### పదేళ్ల పత్రికా బాధ్యత – సకుటుంబంగా సేవ

కేవలం రచనలు, అనువాదాల గురించే చెబితే కేశవరెడ్డి జీవిత చిత్రణ పూర్తి కాదు. ఉద్యోగ విరమణ వరకూ ఆయన ఉపాధ్యాయ బాధ్యతలకు న్యాయం చేసేందుకు ఎంతో శ్రమించేవారు. మరోవంక మైనేని వెంకటరత్నం తర్వాత ఐక్య ఉపాధ్యాయ సంపాదకత్వం చేపట్టి దశాబ్దం పాటు తీసుకువచ్చారు. ఆ కాలంలో సాహిత్యానికి ఇతోధిక ప్రోత్సాహం ఇచ్చారు. స్వయంగా రచయిత గనకే ఏది కావలసినా రాయడానికి కూచునేవారు. సతీమణి హనుమాయమ్మ ఎల్లవేళలా సహకరించి ఉండకపోతే ఇది సాధ్య మయ్యేది కాదు. ఇక వారి కుమారుడు ఈశ్వర్ మంచి ఉద్యోగం వదులుకుని ఐచ్ఛికంగా వచ్చి ప్రజాశక్తిలో దీర్ఘకాలం పాటు కీలక సేవలందించారు. ఈశ్వర్ భార్య, యుటిఎఫ్ నిర్మాత వెంకటస్వామి కుమార్తె అరుణ కూడా ప్రజాశక్తి ఫీచర్స్ విభాగంలో పనిచేశారు. కుమార్తె పద్మజ డాక్టర్ కాగా, అల్లుడు ప్రతాపరెడ్డి ఐటి నిపుణుడుగా ఫ్రీ సాఫ్ట్‌వేర్ ఉద్యమంలో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మరొక కుమారుడు శ్రీనివాసరెడ్డి, కోడలు రాజీ. ఇలా మొత్తం కుటుంబం ఉద్యమంలో ఉండటం ఎంత విశేషమో చెప్పనవసరంలేదు. తన కృషికి, అధ్యయనానికి వారు గొప్ప గౌరవాభిమానాలతో ప్రోత్సాహమిచ్చారు.

### సాహితీ స్రవంతితో అనుబంధం

రచనా రంగం, ఉపాధ్యాయ ఉద్యమం, సాహిత్యరంగం ... మూడింటిలోనూ మా ఇద్దరికి మంచి సాన్నిహిత్యం ఉండేది. సాహితీస్రవంతి ఏర్పాటులోనూ, విస్తరణలోనూ కేశవరెడ్డి పాత్ర మరువలేనిది. వాస్తవంగా సంస్థ ఈ పేరుతో ముందుకు రాకముందు 1999లో జరిపిన సాహిత్య తరగతులలోనే ఆయన ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఓపిక తగ్గినా గుంటూరు, విజయవాడలలో కార్యక్రమాలకు కృషి చేసేవారు. సాహిత్య శాలలు, కార్యశాలలలో చాలాసార్లు అధ్యక్ష స్థానంలో ఉండి పెద్దరికంతో నడిపేవారు. సాహితీ స్రవంతి ఉపాధ్యక్ష బాధ్యతలతో సహా పలు విధాల సేవలందించారు. సాహిత్యరంగ విశాల స్వభావం, విమర్శనాత్మక దృక్పథం కూడా ఆయనలో తగుపాళ్లలో ఉండేవి. నాయకులతోనూ మంచి సంబంధాలుండేవి. ముఖ్యంగా మోటూరు హనుమంతరావు గారిని కలుసుకోవడానికి తరచూ వస్తుండేవారు. ఎప్పుడు వచ్చినా అరగంటైనా కూచుని మాట్లాడుకోవడం తప్పనిసరి. సమస్యాత్మక అంశాలను, సైద్ధాంతిక కోణాలను సున్నితంగా సునిశితంగా చర్చించేవారు. మీడియాలోగాని రాజకీయాల్లో గాని ఏదైనా తప్పుగా జరిగినా, ఎబ్బెట్టుగా మారినా, ఏకపక్షంగా నడిచినా ఆమోదించేవారు కాదు. అప్పటికి ఆచరణలో సర్దుకున్నా అభిప్రాయాలతో రాజీపడేవారు కాదు. స్వతహాగా కొంత మొహమాటస్తులనిపించినా విధానాల విషయంలో దృఢమైన వ్యక్తిత్వం ఆయనది. ఇన్ని మంచి లక్షణాలున్నాయి గనకే ఎనిమిది పదులు వచ్చినా ఎత్తిన జెండా దించకుండా, రాసే కలం ఆపకుండా ముందుకే నడిచారు. అధ్యాపకుడుగా, అధ్యయన శీలిగా, అక్షరాన్వేషిగా, అనువాదకుడుగా ఆఖరి వరకూ సేవలందించిన కేశవరెడ్డి వంటి మేధావులు చాలా అరుదుగా ఉంటారు. ఆ మేధాశక్తిని మహోన్నతమైన మార్క్సిస్టు ఆశయాల సాధనకు, ఉపాధ్యాయ ఉద్యమాభివృద్ధికి, ప్రజాశక్తి ప్రచురణాలయానికి సంపూర్ణంగా సమర్పించిన సార్థక జీవితం కేశవరెడ్డిది. ఆయనకివే జోహార్లు. ■

## కవిత

# కిసాన్‌పై లాఠీ

- నాగరాజు మద్దెల
6301993211

గిప్పుడైన గప్పుడైన
ఇంకెప్పుడైన పండించేటోనికే బాధలు, బద్నాంలు
ఎదిరిస్తే లాఠీలతో, తూటాలతో దేహాన్ని సాగుచేస్తారు
సెమట సుక్కలు
నెత్తుర్లు కారుతున్నా కనికరించకుండ
ఖాకీబలగాలను దింపుతారు
టీయర్ గ్యాసులు పేలుస్తరు
కడుపు నింపేటోనీ కడుపు కొట్ట
సూస్తుండ్రు
కళ్ళల్ల కన్నీళ్ళ తెప్పిస్తఱు
ఇనుపసంకెళ్ళతో,
తీగలతో, బారికెడ్లతో బంధించి
సమస్య గొంతును నులిమేసే
ప్రయత్నాలు ప్రతిసారీ జరిగేవే...
కష్టం కోర్చి పండిన ధాన్యం
అమ్మజూస్తే ధరల్తో దళార్లతో
లూఠి చేస్తరు
ఎన్ని పక్షాలైనా
మా 'పక్షం' సట్టం సవరించరే
అభద్రత నేడు కూడళ్లలో
రాజదాని నడిబొడ్డులో నరాలు బిగబట్టి
బిగ్గరగా అరుస్తుంది
ఆలు బిడ్డలుకూడ ఉప్పెనలా
ఉద్యమానికి ఊపిరి ఐతుండ్రు
సెమట సుక్కలు రోడ్లపై అర్ఘిస్తున్న
మట్టిపాదాలు చేను విడిచి రోడ్లపై
సట్టసవరణ సేయమని పిడికిలి బిగించినా
పట్టని దోరణి దేనికి సంకేతం?
చర్చల పేర ఉట్టి ముచ్చట్లు సట్టాల్ని మార్చవు...

ఎన్నేముకంటరు
ఎన్నువిరగగొడుతున్నరు
సన్మానించి నా సేతులు
సంకెళ్లతో బందిస్తున్నరు




శ్రమను పుస్తకాలలో పొగిడి
పుడమి బిడ్డలని ఊకదంపుడు ముచ్చట్లతో
మురిపెంగా దునియాకు సిత్రమే
సూపెడతరు
సంకనెట్టుకుని
సంబురపడెట్టు సేస్తరు
ఆకర్న అంగడిలో సరుకులా
నడిరోడ్డుపైకి రప్పిస్తరు

వీరిది ఆకలికి మద్దతు కొట్లాట
వారిది కార్పొరేట్లా సర్దుబాట్ల
తండ్లాటా..
ఇదో అర్ధం కానీ అభివృద్ధి
ముసుగులో రహస్య వొప్పందం.
రాజులు, రాజ్యాలు మారినా
వారసత్వ పునాదులు బలపడినంతగ
కర్షకుని కష్టాలు కాల ప్రవాహంలో
నిత్యం కొట్టుకు రావడం .. బహు చిత్రం..
జై కిసాన్‌పై జై జవాన్ లాఠీ
'నాదాన్ని' చేస్తుంది లూటీ

చర్చలు సఫలమయ్యే
ఆలోచనలు కూసున్నప్పుడు
అధికారంతో అన్నీ సులభమే...
ఆ వైపు పడే ప్రతి అడుగు
అందర్ని సేన్లల్లో వుండేలా
దేశ ఆకలిని తీర్చేలా
అబివృద్ధి గాలిలో శ్రమ పరిమళాలతో
వెలసిల్లెలా సేస్తరూ ..
ఆ వైపుగా ఆచరణ జరగాలని
కోరుకుంటూ... రైతులకు మద్దతుగా
అర్పిస్తున్న అక్షర నివాళి!



# అల్లాంరబ్బా

- తూర్పింటి నరేష్ కుమార్
8184867240

సుక్క పొడవంగనే కలత నిద్రలో దిగ్గున లేచి కూర్చున్నాడు ఉస్మాన్. ఇంకా తెల్లారలేదు. ఇంట్లో పది దినాల సంది జర్గుతున్న ఇంటి పోరు నిన్న రాత్రి చెర్వు కట్టలా తెగినట్టయ్యింది. పద్దెనిమిదేళ్ళ సంసారం రోడ్డున వడ్డది. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబం తనది. నాలుగు రాళ్ళు సంపాదిస్తేనే నాల్గు మెతుకులు నోట్లోకెల్తయి. బొంతలు కుట్టడం, నవార్లు అల్లడం, అల్లాంరబ్బా అమ్మడం తన తాతైన మౌలాలీ కాలం నుంచి వారసత్వంగా వస్తున్న వృత్తి. అలా ఆలోచిస్తూ గుడిసె పైకి చూసాడు. గుడిసె పైన వేసిన కాసె గడ్డి, ఈతకమ్మలు తొలిగిపోయి ఆ సందులోంచి సుక్కలు మిణుకు మిణుకు మంటూ మెరుస్తున్నాయి.

అబ్బాజాన్ ఇచ్చిన వారసత్వపు ఆస్తి తానుంటున్న గుడిసె.. ముందున్న ఖాళీ జాగా. వచ్చే ఎండాకాలం పూర్తయ్యేలోపు ఎలాగైన గుడిసెను కప్పాలి. వానాకాలం వచ్చిందంటే చిన్న చినుకు కురిసినా గుడిసె చెరువైతుంది. తన ఒళ్ళో మూల్గుతూ పడుకున్న బిడ్డ అక్తరున్నీసాకు మూడ్రోజులనుంచి ఒకటే జ్వరం. అర్ఎంపి డాక్టర్ వద్దకు తీసుకెళ్ళాలన్నా చేతిలో చిల్లిగవ్వ లేదు. ఊర్లో ఎవర్నైనా అప్పడగాలన్నా 'నెత్తిమీద ఆఠాణా పెట్టినా చారాణాకు చెల్లని' తనకు అప్పెవరిస్తారు? పెద్దోడిది ఈ ఏడాదితో పది పూర్తైతది. ఆ తర్వాత ఎవరైన తెల్సిన మెకానిక్కు వద్ద పనికి కుదిరిస్తే నెల నెలా డబ్బులు పంపిస్తాడు. గుడిసె బయట నులకమంచం మీద బేగం చోటాబచ్చాను ఒళ్ళో వేస్కొని నిదరోతుంది. ఆడిని అప్పోసప్పో జేసి ఇంగ్లీష్ బడిలో ఎయ్యాలె. ఎన్నెల రాత్రుళ్ళో శ్వేత నాగులా ఆలోచనలు పరుగులెత్తుతున్నై. చాలా రోజులుగా తను ఇంటిని నిర్లక్ష్యం చేస్తుండు. ఇంట్లో కాణీ చిల్లర ఇవ్వడం లేదు. అప్పుడప్పుడు చిన్నా చితక పనులు చేసి పైసలు సంపాదించినా వాటిని ఇస్పేటాటలో పోగొట్టుకునేవాడు. మిగిలిలిన పైసలతో పుల్లుగా మందు తాగేటోడు. పోయిన అమాస నుంచి నిన్నటి పున్నమి వరకు ఇంట్లో సాగుతున్న సంసార యుద్ధం చిలికి చిలికి గాలివానగా మారి రేతిరి ఉప్పెనగా మారింది. రేపట్నుంచి ఏదైనా పనికి వెళ్ళి నాలుగు రూకలు సంపాదిస్తేనే తన పెళ్ళాం ఇంట్లో ఉంటది. లేదంటే పుట్టింటికి వెళ్తానని ఈ దినమే హుకుం జారీ చేసింది. నల్లరాయి లాంటి దృఢమైన నిర్ణయానికొచ్చాడు ఉస్మాన్. మసీద్‌లో హజాన్ పిలుపొస్తుంది. మంచి శకునంలా భావించాడు. వెంటనే ఇనుము బాండిలో చక్కెరపాకం తయారు చేశాడు. చల్లారిన తర్వాత అల్లం ఇలాచితో కల్పి అల్లాంరబ్బాను చిన్న చిన్న బిళ్ళలుగా చేసాడు. దాని వాసన ఆ చుట్టుపక్కలా అలుముకున్నది. అంతలోనే తెల్లారింది.

ఇంటిముందున్న ఏప పుల్లతో పండ్లు తోముకున్నడు. ఆరుబయట ఉన్న కళాయిలోని నీళ్లతో తానం కానిచ్చిండు. పెండ్లాం కాసిన ఏడిఏడి తైదంబలిని మట్టి పాత్రలో పోసుకుని చింతతొక్కు నాకుతూ.. మధ్య మధ్యలో ఉల్లిగడ్డను కొరుకుతూ అంబలిని జుర్రుకున్నాడు. కడుపు నిండడంతో బ్రేవ్‌మని తేన్చాడు. మేదరిబుట్టలో అల్లాంరబ్బా ముక్కలు ఒకదానిపై మరొకటి క్రమపద్ధతిలో సర్దుకుని బుట్టను నెత్తిన ఎత్తుకుని ఊర్లోకి బయల్దేరాడు.

దేవుని మిట్ట నుంచి ఉత్సాహంగా నడుస్తూ కొత్తగేరికి వచ్చాడు. 'అల్లంరబ్బా.. ...అల్లం రబ్బా..' అని పిల్లలున్న చోటల్లా గట్టిగా అరుస్తూ కాసేపక్కడే ఆగుతున్నాడు. ఎస్సీ కాలనీ, చాకలి గేరి, మంగలి గేరి తిరిగాడు. ఎందుకో ఈదినం బాగలేదు. పిల్లలు, పెద్దోళ్ళు ఎవ్వరూ ఒక్క బిళ్లా కొంటలేరు. సైతాన్ నెత్తిమీద ఎక్కి ఆడిస్తున్నాడు అని అనుకుంటూ ముందుకు అడుగులు వేస్తున్నాడు.

ఎండాకాలం... అసలే రోళ్లు పగిలిపోయే రోహిణి కార్తి. కాళ్లకు చెప్పుల్లేవు. నడుస్తుంటే కాళ్ళు బొబ్బలెక్కుతున్నాయి.

నెత్తిమీద కట్టుకున్న ఎర్రటి రుమాలుతో మాటిమాటికి కారుతున్న సెమటను తుడ్చుకుంటున్నాడు. ఊరికి దూరంగా ఎండినసెర్వులో క్రికెట్ ఆడుతున్న ఊరి పిలగాల్లు కన్పించారు. కుబుసం విడ్సిన పాములా మెల్లగా అటువైపు కదిలాడు. ఎర్రటి

ఎండలో నల్ల రేగడిలో క్రికెట్ ఆడుతున్న వారిని చూస్తూ కాసేపు నిలబడ్డడు. గుంపులు గుంపులుగా నిల్చున్న వారి సుట్టూ బొంగురంలా తిరుగుతూ 'అల్లంరబ్బా ...' అంటూ నూతిలో గొంతుకతో అరవసాగాడు. ఆటలో పడ్డ ఏ ఒక్కరూ ఒక్క బిళ్లా కొనడంలేదు. కాసేపట్లో ఆట ముగిసింది. పాపిరెడ్డి ఇంట్లో పెళ్లి ఉందని వాళ్లలో వాళ్లే మాట్లాడుకోవడం విన్పించింది.

దింపుడు కల్లం ఆశతో ఎండలో పాపిరెడ్డి ఇంటివైపు భారంగా అడుగులు వేస్తున్నాడు. కాపు గేరికి వచ్చాడు. ప ట్వారీ నర్సింహారెడ్డి ఇల్లు దాటాడు. పక్క సందులోంచి నేరుగా వెళ్తే పాపిరెడ్డి ఇల్లొస్తుంది. ఆయన ఇంటినుంచి గేరి గేరంతా చలువ పందిళ్లు పరిచారు. అలంకరించిన చమ్కీ డెకరేషన్లతో కళకళలాడుతుంది. పాపిరెడ్డి డెబ్బై ఐదు ఎకరాల ఆసామి. వాళ్ళ నాన్న నుంచి వారసత్వంగా వచ్చింది. యాభై ఎకరాలు. సన్న చిన్నకారు రైతుల నుంచి పొలాలను బలవంతంగా ఆక్రమించి కొంత, రైతుల మధ్య కొట్లాటలు సృష్టించి కోర్టు కేసులు పెట్టించి వారు ఆర్థికంగా నష్టపోయిన తర్వాత అతి తక్కువ ధరకే కొని కొంత సంపాదించాడు. ఆవిధంగా మరో ఇరవై ఐదు ఎకరాలకు యజమాని అయ్యాడు. ఎంగిలి చేత్తో కాకిని విదిలించని పాపిరెడ్డి సార్థక నామధేయుడు.

అతని ఏకైక వారసురాలి వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. విందు భోజనాలు చేసిన పెళ్లి వారంతా తిరుగు ప్రయాణమవుతున్నారు. చుట్టాల రద్దీ తగ్గిన తర్వాత పెళ్ళి పందిట్లోకి వచ్చాడు ఉస్మాన్. పెళ్లి మంటపంలో బెలూన్లూ, థర్మాకోల్ షీట్లతో పిల్లలు కేరింతలు కొడ్తూ ఆడుతున్నారు. కాసేపు అటూ ఇటూ తచ్చాడాడు. వెదురు బుట్టను కిందికి దించుకుని అల్లాంరబ్బా కొంటారేమోనని ఆశగా ఎదురు చూస్తున్నాడు. ఇంతలో ఉరుములు పిడుగులు లేకుండా వచ్చే వానలా లోపల్నుంచి ఊడిపడ్డాడు పాపిరెడ్డి. వచ్చీరాగానే తిట్ల దండకం అందుకున్నాడు. పెళ్లి మంటపంలోని వారంతా ఒకేచోట గుమిగూడారు. ఆ గేరినుంచి వెళ్లేవారంతా టికెట్ లేని సినిమాలా ఫ్రీ షో చూస్తున్నారు.

ఈ లొల్లికి అమ్మలక్కలతో మాట్లాడుతున్న సత్యవతమ్మ ఊతకర్రను ఆసరాగా చేసుకుని మెల్లిగా బయటికి వచ్చింది. పాపిరెడ్డిని ఆగమని సైగ చేసి సాయెబ్ దగ్గర అల్లాంరబ్బాను తీసుకుని మెల్లిగా త్రుంచి బాగుందంటూ తినసాగింది. ఉస్మాన్ వైపు మెచ్చుకోలుగా చూసింది. అక్కడున్న పిల్లలంతా ఎగబడి నాకో బిళ్ల .. నాకో బిళ్ల అంటూ అరవసాగారు. సత్యవతమ్మ చెప్పగానే జేబులోంచి వందనోటు తీసి ఉస్మాన్ కిచ్చాడు పాపిరెడ్డి. పొద్దున్నుంచి పడ్డ కష్టమంతా గాలిలో తేలియాడే దూదిపింజలా మనసు తేలికయ్యింది. ఆ క్షణాన సత్యవతమ్మ తన కష్టాలు తీర్చే దేవతలా కన్పించింది ఉస్మాన్‌కు.

బియ్యం, పప్పు, ఉప్పు, కారం, వెచ్చాలు ఇంట్లో నిండు కున్నై. ఈ రోజైనా కడుపునిండా తినాలి. ముందు అత్యవసరంగా మందుల దుకాణానికి వెళ్ళి జ్వరంతో ఉన్న బిడ్డకు మందులు కొనాలి. చేయాల్సిన పనులు గుర్తుకు రాగానే నీరసమంతా ఎగిరిపోయింది. వెయ్యి ఏనుగుల బలం వచ్చింది. వేగంగా అడుగులు వేస్తూ మందుల దుకాణానికి ఎల్లిండు. జ్వరానికి సిరఫ్ తీసుకుని తన దగ్గరున్న వంద రూపాయల నోటిచ్చాడు. ఓ వైపు చిరిగి రంగులంటిన నోటును ఎగాదిగా చూ సిన షావుకారు శీనయ్య బండబూతులు తిడ్తూ .. ఉస్మాన్ కాళ్ళావేళ్ళా పడ్తున్న వినకుండా ఇచ్చిన మందులను బలవంతంగా లాక్కున్నాడు. రోడ్డుపై వెళ్తున్న వారంతా పోగ య్యారు. తలోమాట మాట్లాడుతున్నారు. వారంతా డబ్బున్న షావుకారు పక్షం వహించి అతనికి వంతపాడటం మొదలు పెట్టారు. ప్రజలంతా తనకు వత్తాసు పలికే సరికి రెచ్చిపోయిన షావుకారు... అల్లాంరబ్బా బుట్టను ఎత్తి కిందకు పడేశాడు. అల్లాం రబ్బా బిళ్లలు కిందపడి చెల్లాచెదరయ్యాయి. ఏం చేయాలో తోచక, ఏం జరుగుతుందో అర్థంకాక చేష్టలుడిగిపోయాడు ఉస్మాన్.

చిరిగిన రంగులంటిన నోటును అంటగట్టిన భూస్వామి పాపిరెడ్డిని తిట్టాలా?

మానవత్వం లేకుండా మందులు లాక్కున్న షావుకారును ఎదిరించాలా?

ముందు వెనకలు ఆలోచించకుండా అన్యాయాన్ని సమర్థించే గొర్రెదాటు జనాన్ని ప్రశ్నించాలా?

దీనికంతటికి కారణమైన పేదరికాన్ని... నసీబ్‌ను నిందించాలా?

జనాలవైపు ఎర్రి చూపులు చూస్తూ నిస్సహాయంగా కిందపడ్డ అల్లాంరబ్బా బిళ్లలను ఏరుకోసాగాడు ఉస్మాన్.

■

# అడవి మల్లెలు

- ఉప్పరి తిరుమలేష్
96189 61384



ఉద్యమాల గడ్డపై
తొలి పొద్దై తూర్పు కొండల్లో
నిత్య చైతన్య కిరణమై
పిడికిల్లెత్తిన  కొమరం భీం
వారసులు గిరిపుత్రులు

నిజాం నిరంకుశత్వాన్ని ఎదురొడ్డి
ప్రాణాలను పణమొడ్డి
రగిలే విప్లవ రగల్ జెండాలై
జంగల్ జమీన్ శ్వాసగా పీల్చిన
ప్రపంచ విప్లవ ఉద్యమాల విప్లవ జ్వాల
గిరిజన ఉద్యమాల ధృవతార
తెలంగాణ తొలితరం విప్లవ వీరుల
వారసత్వ ప్రతీకలు అడవి బిడ్డలు

చెరబట్టిన వాన్ని చీల్చి చెండాడి
అణగారిన బతుకుల్లో వెలుగు నింపిన
కొమురం అంబుల పొదుగులోని విల్లంబులై
విజయాన్ని ముద్దాడిన గిరిపుత్రులు గోండ్లు

చెట్టు పుట్ట గుట్టను నమ్ముతూ
స్వాతంత్ర్య ఉద్యమాన్ని సాగించిన
స్వదేశీ ఉద్యమ నిప్పు కణికలైతూ
బీడు భూముల్లో సిరులు పండించిన
బుక్కెడు బువ్వలేని నిరుపేదలు

తెలంగాణ సాయుధ పోరాట వారసులై
నిజాం నైజాన్ని బట్టబయలు జేస్తూ
సాయుధ పోరాట సమర నినాదాలై
సింహాలా గర్జించిన జనసవ్వడి ఆదివాసులు
కట్టు బానిసత్వాన్ని
కూకటి వేళ్ళతో పెకిలించి వేసి
పోరుభూమిలోనే గోడు వెళ్ళబోసిన
పచ్చని ప్రకృతిలో విరగబూసిన
తెల్లని అడవి మల్లెలు గోండుబిడ్డలు


కూటికోసం గూటి కోసం పోరుజేస్తూ
పచ్చజొన్న సంకటే పరమాన్నంగా భావిస్తూ
చెమట చుక్కలను నమ్ముకొన్న
వనంలోని నాగోబా సంస్కృతికీ
వారసులై నిలిచిన గిరిజన సంస్కృతి వారసులు..

సాయుధ పోరాట పోరు కిరణాలై
సామ్రాజ్యవాదుల గుండెల్లో దరువై
భూస్వామ్య పెత్తందారులను
తుదముట్టించిన
తొలితరం సమరయోధులు

మాటల్లో మానవత్వం
నిలువెల్లా అమాయకత్వం
నమ్మినోల్లకు ప్రాణమిస్తూ
నమ్మక ద్రోహుల గుండెల్లో సింహస్వప్నాలవుతూ
ప్రకృతిని నమ్మిన ఉద్యమ యోధులు
అక్షరానికి దూరమైన
వన్యప్రాణుల వన్నెలను పసిగట్టిన మట్టి మనుషులు

ఆకుపసరును నమ్ముకొన్న అసామాన్యులు
బంజారా సంస్కృతికి మూలవారసులు
భవిష్యత్ తరాలకు మార్గదర్శకులు
కొండకోనలో కొలువైన వనదేవతలను
నమ్మి బతికే గిరిపుత్రులు ఆదివాసులు..

## పరిచయం




# 'గే' కమ్యూనిటీకి బాసటగా ...



జాని తక్కెడశిల (అఖిలాశ)

**- సుహాసిని రెడ్డం**

మనకు తెలిసిందే రాయాలి అనే మాట తెలుగు సాహిత్యంలో ఎక్కువగా వినపడుతుంది. మనం అనుభవించింది రాస్తేనే సాహిత్యం బాగుంటుందనుకోవడం అనేకమంది రచయితలు ఇచ్చే సలహా. మనకు తెలిసింది రాస్తే సాహిత్యం వాస్తవికంగా ఉంటుంది కాని తెలుసుకొని రాయకూడదు అని లేదు. ఎవరి సమస్యలపై వాళ్ళే రాసుకోవాలి. అలా రాసుకుంటేనే సమస్యలు వెల్లడవుతాయని అనుకోవటం కూడా పూర్తి వాస్తవం కాదు. అలాగే పరిశోధన, సహానుభూతి, వస్తువు గురించి పూర్తి అవగాహన... లేకుండా రాయడం తప్పు. దళితుల కథలు దళతులే రాయాలి, ముస్లింల కథలు ముస్లిం రచయితలే రాయాలి, 'గే' కథలు గేలు మాత్రమే రాయాలంటే కుదరదు. తీసుకున్న వస్తువు మీద రచయితకు ప్రేమ, అభిమానం, ఎమోషన్, సమస్యను సమాజంలో పెట్టి చర్చకు ఆహ్వానించే గుణం ఉంటే చాలు.. అప్పుడు రచయిత ఏ వస్తువునైనా రాయవచ్చు. తెలుగు సాహిత్యంలో హిజ్రాల గురించి కాని, 'గే'ల గురించి కాని మొన్నటి వరకు పెద్దగా సాహిత్యం రాలేదు. వాళ్ల గురించి రాయడానికి కూడా మనసు లేని రచయితలు ఇప్పటికీ ఉన్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో యువ కవి, రచయిత, విమర్శకుడు జాని తక్కెడశిల (అఖిలాశ) హిజ్రాలపై దీర్ఘ కావ్యం ప్రకటించి సంచలనం సృష్టించారు. ఆ పుస్తకంపై దాదాపు అరవై వ్యాసాలు పత్రికల్లో వచ్చాయంటే కవికి సమస్య పట్ల ఎంతటి సానుభూతి ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు జాని తక్కెడశిల 'మది దాటని మాట' పేరుతో 'గే' కమ్యూనిటీపై ఒక నవలను ప్రకటించారు.

"ఇది ప్రాంతీయ, జాతీయ సమస్య కాదు ప్రపంచ సమస్య. ఇది జెండర్ సమస్య కాదు లైంగికత సమస్య. ఆలోచించాల్సిన సమస్య, అర్థం చేసుకోవాల్సిన సమస్య, చర్చించాల్సిన సమస్య, వివక్షకు గురైన సమస్య, అవమానాల, అవహేళనల సమస్య, ఒక జాతిని తప్పుగా, నిర్లక్ష్యంగా చూస్తున్న సమస్య. మరమ్మతులు చేయవల్సిన సమస్య, బిగ్గరగా అరచి చెప్పాల్సిన సమస్య, మద్దతు తెలపాల్సిన సమస్య, అంతిమంగా మానవుని సమస్య, పరిష్కరించుకోవాల్సిన సమస్య." **MY SEXUAL ORIENTATION MY RIGHT** పుస్తకం వెనుక 'గే' సమస్య గురించి జాని తక్కెడశిల ఈ విధంగా రాశారు. ఇది ప్రపంచ సమస్య. అలాంటి సమస్యను తెలుగు రచయితలు రాయకపోవడం దేనికి నిదర్శనం? ఇక్కడ రచయిత అంటున్నది 'గే'లు సమస్యగా ఉన్నారని కాదు. వాళ్లను సమాజం పట్టించుకోకపోవడం, ప్రభుత్వాలు విస్మరించడం, వారి హక్కులను కాపాడలేకపోవడం, వాళ్లను మనుషులుగా చూడకపోవడం లాంటి వాటిని రచయిత ఖండించారు. దేన్నీ అయినా చర్చలతో పరిష్కరించుకోవాలి. చర్చ జరగాలంటే సమస్య తెలియాలి. సమస్య తెలియాలంటే రచయితలు ఆ సమస్యను సాహిత్యంగా మార్చాలి. ఈ పనిని తెలుగు సాహిత్యకారులు చేయలేదు. దానిని భర్తీ చేస్తూ జాని తక్కెడశిల (అఖిలాశ) ఈ నవలను తీసుకువచ్చారు. ఇప్పుడు ఈ నవలపై చర్చ జరగాలి.

ప్రస్తుత సమస్యకు ప్రస్తుత కాలమే పరిష్కారం ఇవ్వాలి. గత రెండు, మూడేళ్ల కాలాన్ని పరిగణనలోకి తీసుకొని రచయిత నవలను తీర్చిదిద్దారు. నవల బెంగళూరు, కడప జిల్లా పులివెందుల పట్టణం నుంచి అమెరికా వరకు వెళ్లి మళ్ళీ బెంగళూరులో స్థిరపడి చివరకు రాయలసీమలో ముగుస్తుంది. 'గే'లు కేవలం పట్టణాల్లో ఉంటారని నిర్ధారించలేము. ప్రతి చోటా ఉన్నారు. ప్రకృతిలో భాగమై ఉన్నారు. వారిని ప్రకృతి నుండి వేరుగా చూడటం అసహజమైన చర్య. 'గే'ల సమస్య జెండర్ సమస్య కాదని, అది లైంగికత సమస్య అని తీర్మానించారు. తీసుకున్న వస్తువును హ్యాండిల్ చేసిన విధానం, అవసరమైన మేరకు తప్ప అనవసరమైన చర్చలు నవలలో పెట్టకపోవడం రచయిత పరిణతికి నిదర్శనం.

అయితే నవలలో శ్రీరామ్ పాత్ర చేత రచయిత అనేక స్టేట్‌మెంట్లు పాస్ చేశారు. సంప్రదాయవాదులకు అవి మింగుడు పడవు. సృష్టి కోసం బ్రహ్మ కన్న కూతురైన సరస్వతిని పెళ్లి చేసుకున్నాడని, దాని కంటే 'గే'లు ఏం తప్పు చేశారని ఒకచోట ప్రశ్నిస్తాడు. స్త్రీలకి చేయూతను అందించాలని ముస్లిం మగవాళ్లు ఒక్కొక్కరు ఎంత మందినైనా పెళ్లి చేసుకునే సౌలభ్యం ఎందుకు ఉందని అడిగారు. అడుగడుగునా సంప్రదాయం, సంస్కృతి పేరుతో జరిగే అరాచకాన్ని శ్రీరామ్ పాత్ర తీవ్రంగా ఖండించింది. శ్రీరామ్ పాత్ర నవీన మానవుడికి ప్రతీక లాంటిదే. మునుపు లాగా నేటి మానవులు అన్నింటినీ సమర్థించే అవకాశం లేదు. నేటి మానవులు ప్రశ్నిస్తున్నారు. సమాధానాలు అడుగుతున్నారు. ఖండిస్తున్నారు. శ్రీరామ్ పాత్ర కూడా అదే చేసింది.

ఈ నవల రెండు వేరు వేరు కథలుగా సాగి ఒక చోట కలుస్తుంది. ఒక 'గే' జంట పల్లె నుండి వచ్చి తాము 'గే' అని ప్రకటించుకొని 'గే' హక్కుల కోసం పోరాడే దాకా వెళుతుంది. భారతదేశ 'గే' అంబాసిడర్‌గా ఎలా ఎదిగాడన్నది ఒక కథ. మరొక 'గే' బెంగళూరులో ఉద్యోగం చేసి, ఆ తర్వాత ఒక యువకుడిని ప్రేమించి తన ప్రేమను బయటకు చెప్పుకోలేక, బెంగళూరు నుంచి అమెరికా వెళ్లి పోయి, అక్కడ అనేక మందితో శృంగారంలో పాల్గొని ఎయిడ్స్ తెచ్చుకుంటాడు. ఆ తర్వాత అమెరికా నుండి తిరిగివచ్చి, 'గే' హక్కుల కోసం పోరాడతాడు.

నవలలో ఉన్న మూడు స్త్రీ పాత్రలూ ముఖ్యమైనవి. ఒకటి శ్రీరామ్ తల్లి, రెండు కృష్ణ తల్లి, ఆ తర్వాత దీప అనే మరో పాత్ర. ఇక్కడ శ్రీరామ్ తల్లి మొదట శ్రీరామ్‌ని అంగీకరించదు. ఆ తర్వాత తన బిడ్డ చేసే పోరాటానికి బాసటగా నిలుస్తుంది. అలా చేయడం ద్వారానే శ్రీరామ్ తమ హక్కుల కోసం పోరాటం చేయగలిగాడు. దీన్ని నుండి రచయిత చెప్పదల్చుకున్నది ఏంటంటే 'గే'లను మొదట కుటుంబం అంగీకరించాలి. ఆ తర్వాతే సమాజం అంగీకరిస్తుందని. కృష్ణ తన తల్లికి తాను 'గే' అని చెప్పుకోలేకపోతాడు. చివరకు తన జీవితాన్నే బలి చేసుకుంటాడు. తాము ఏమిటో నిర్భయంగా చెప్పుకునే రోజులు గేలకు రావాలని రచయిత ఆకాంక్ష. దీప, కృష్ణతో సుఖపడాలని కోరుకుంటుంది. ఆ తర్వాత కృష్ణ 'గే' అని తెలిసిన తర్వాత, కృష్ణ మొహమ్మద్‌ని ప్రేమిస్తున్నాడని తెలుసుకొని, తనకు మద్దతుగా నిలుస్తుంది. స్నేహితురాలిగా మారిపోతుంది. ఈ విధంగా ఈ మూడు పాత్రలూ చాలా ఉన్నతంగా ఆలోచిస్తాయి. అలాగే సాయి అనే పాత్ర యొక్క తండ్రి టీచర్. మొదట సాయిని అంగీకరించకపోయినా, ఆ తర్వాత బిడ్డను అర్థం చేసుకుంటాడు. ఈ నవలలో మూడు 'గే' పాత్రల తల్లిదండ్రులు వారిని అంగీకరిస్తారు. ఇప్పుడు కావాల్సింది అదే!

నవలను నిర్మించిన పద్ధతిలోనూ, కథనం విషయంలోనూ, సమాజంపై కోపాన్ని కాకుండా సున్నిత మందలింపు చేయడంలోనూ రచయిత ఎక్కడా తన సహనాన్ని కోల్పోలేదు. పాత్రలు స్వేచ్ఛగా తమ భావాలను ప్రకటించాయి. 'గే' హక్కులకై, సమస్యల పరిష్కారాలకై ఈ నవల ఒక కరదీపిక లాంటిది. రచయిత 'గే' కమ్యూనిటీ సమస్యలను చాలా మేరకు ఈ నవలలో పొందుపరిచారు. అన్ని సమూహాల్లోనూ మంచి వారు ఉంటారు, చెడ్డ వారు ఉంటారు. అలాగే 'గే'లలో అలాగే ఉంటారని, 'గే'లు సమాజాన్ని నాశనం చేస్తున్నారని, ప్రకృతికి అసహజమైన వారని చెప్పడం సరైన పద్ధతి కాదని ఈ నవల ద్వారా చెబుతారు.

ఎవరూ పెద్దగా పట్టించుకోని సమస్యను వస్తువుగా తీసుకొని చక్కని భాషతో నవలను తీసుకొచ్చిన జాని తక్కెడశిల (అఖిలాశ)కు అభినందనలు. ఇంతవరకూ పట్టింపునకు నోచుకోని ఇలాంటి సమస్యలపై మరిన్ని రచనలు రావాలి, చర్చ జరగాలి.

■

## కవిత

# నాగలి యుద్ధం

- శిఖా - ఆకాష్
93815 22247


రైతు గొప్పా
దేశం గొప్పా అంటే
రైతే అంటాను
అసలు రైతే దేశమంటాను
రైతు లేని దేశం
ఒక దేశమేనా?
అదొట్టి శ్మశానాల దిబ్బ!
అన్నం పెట్టే వాడిని
బిచ్చగాణ్ని చేసిందెవరో
ఇప్పుడెవ్వరూ ఎవరికీ
చెప్పాల్సిన అవసరం లేదు
కార్పొరేట్ శక్తుల ముందు
రాజ్యం తాకట్టు పడడం కూడా
రహస్యమేమీ కాదు
దేశానికి ఉరి బిగించేందుకు
పాలకులు అమ్ముడుపోయారని
కూడా ప్రజలకెవరు చెప్పాలి?!
దేశంలో దొంగలు పడ్డారంటే
పాలకులే అసలైన గజదొంగలని
ప్రజలకు ప్రత్యేకంగా నే చెప్పను
గజదొంగలని కుక్కల్ని చేసి
దేశాన్ని సర్కస్ చేయిస్తున్న
బానీలూ, దానీలూ...
ఒరేయ్ ఏమి తిని బతుకుతార్రా...
బంగారం తినో..
రూపాయి కట్టలు మింగో బతకండ్రా..
గోసీగుడ్డ నడుము వంచకుండానే
రైతు చేతిలో ఈ మట్టి
సజీవమవ్వకుండానే
ఏ దేశంలోనైనా ఎవరైనా
ఎట్టా బతికి బట్టగలరో
డియర్ కార్పొరేట్స్?
మై డియర్ బ్యూరోక్రాట్స్?!

◆ ◆ ◆

ఈ దేశాన్ని
మతోన్మాదుల మంత్రదండమేదో..
కార్పొరేట్ల తంత్ర వ్యూహమేదో..
రాజ్యాన్నాడిస్తున్నది!?
రైతును యుద్ధంగా
నీ కోట గుమ్మం ముందు నిలబెట్టాము
మట్టికి ప్రాణం పోసిన వాడిని
ప్రకృతి వారసుడైన దేశ జీవధాతువును
దేశానికే తలపాగా అయిన
అసలు దేశమే తానైన మట్టి మనిషిని
ప్రపంచానికింత బువ్వైన ప్రాణసేతువును
చలనసూత్ర నిర్వచనమైన
శ్రమశక్తి క్షేత్రమైన
అవిశ్రాంత కాల రూపాన్ని
యుద్ధంగా సిద్ధం చేసినందుకు
రాజ్యమా!
నీకో పెను సవాల్!!

◆ ◆ ◆


ఎన్ని చీకట్లను తన భుజాన
నాగలి మోసినట్టు మోయలేదూ..
ఎన్ని కన్నీళ్లను శిలువ మీది జీసస్‌లా
దిగమింగలేదూ..
ఎన్నెన్ని సముద్రాల ఆటుపోట్లను
తలరాతగా భరించలేదూ..
దేశానికే రాజంటూ
దేశ వెన్నెముకే నీవంటూ...
బికారిగా మార్చినా వెన్ను విరిచినా
ఎందరు నయవంచక
పాలక మూకల్ని సహించ లేదూ..
రాజ్యమా!
రాజకీయ చదరంగం క్షేత్రమా!
నువ్వెన్ని కుట్రల క్రూర రచనలు చేసినా..
ఎన్ని సునామీల అవతారమెత్తినా
కొండ కదలదు గుండె బెదరదు
రైతంటే రాజకీయం చేతిలో రిమోట్ కాదు
రాజ్యం బిగించే బేడీలకు
పాలక కేడీల కాకి లెక్కలకు
తలవంచని శిఖరం!
ప్రకృతి ఎన్ని విషమ
పరీక్షలనైనా తట్టుకుని
తలయెత్తి రెపరెపలాడిన



జాతీయ జెండా అతడు
బతుకులెంత ఛిద్రమైనా..
ఎంత భారమైన తాకట్టు జీవనమైనా..
ఎంతటి కరోనా మహమ్మారి
విపత్తులనైనా కడతేర్చగల
ప్రకృతి సహచరులు
కాదు, అసలు ప్రకృతే వాళ్ళు
ఏ బ్యారికేడ్లు, ఏ భాష్పవాయువులు,
ఏ అగ్ని గోళాలూ.. మరే
మరఫిరంగులూ..
ఈ మట్టి పిడికిళ్లను
చెమట నెత్తురులు కలగలిసిన
రైతు సంకల్ప బలాన్ని
ఎవరాపగలరు?
మీరూ, మీ నల్ల చట్టాలను
కలుపుమొక్కల్ని ఏరినట్టు
ఏరిపారేసే సింహబలురు వాళ్ళు
ఏ కార్పొరేట్ రూపాయి శక్తులనైనా
తొక్కి నార తీయగల యోధులు వాళ్ళు.
చరిత్ర ఎరుగని ధరిత్రి యుద్ధమిది
చరిత్ర మరువని నాగలి యుద్ధమిది!

◆ ◆ ◆

రాజ్యమా!
నీ సమాధి మీద
శిలాఫలకాలై మొలుస్తారు
కార్పొరేట్ సామ్రాజ్యమా!
నీ కోటగోడలు
శిథిలం చేస్తారు.
ఇది మట్టి మనుగడ యుద్ధం
మట్టి మనుషుల నాగలి యుద్ధం!




# వొడువని ఆత్మకథ వృద్ధాప్యం

- గడ్డం సత్యపాల్ రెడ్డి
తెలుగు ఉపన్యాసకులు
దిలావర్ పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల
9963668822


డా॥ఎన్.గోపి డా॥ఎస్.రఘు

సమాజంలోని రుగ్మతలను తొలగించడంలో, పాఠకులలో సామాజిక చైతన్యం రగిలించడంలో వచన కవితది ప్రత్యేక స్థానం. వృద్ధాశ్రమాలు పెరుగుతున్న దురదృష్టకరమైన నేటి పరిస్థితుల్లో వృద్ధుల పట్ల మానవీయంగా ప్రవర్తించాలని గళమెత్తిన వచన కవితా సంకలనం ఆచార్య ఎన్.గోపి గారి 'వృద్ధోపనిషత్' ప్రముఖమైనది. దక్షిణ భారత సాహిత్య చరిత్రలో వచన కవితా ప్రక్రియకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకువచ్చిన కొద్దిమంది కవుల్లో ఎన్.గోపి ఒకరు. వీరు రాసిన 'కాలాన్ని నిద్రపోనివ్వను' అనే గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం రావడమే కాకుండా 23 భాషల్లోకి అనువదింపబడి చరిత్ర సృష్టించింది. వీరు సృష్టించిన నానీలు ప్రక్రియ విశేష ఆదరణ పొంది భారతీయ సాహిత్య చరిత్రలో వీరికి చిరకాలపు కీర్తిని తీసుకువచ్చింది.

జీవితం పలు దశలు, పలు రసాస్వాదనల సమాహారం, అనుభవాల సారం. బాల్యం, యవ్వనం, మధ్య వయస్సు చివరికి వృద్ధాప్యం. ఎన్నో సంవేదనలు, ఎంతో లోకానుభవం, జీవన సారాంశం. వృద్ధాప్యం విలువైన వజ్రం. వృద్ధుడంటే ఊడ్చి అవతల పారేసే వ్యక్తి కాదు. మన జీవితం ఊడ్చుకుపోకుండా కాపాడే జ్ఞాన భాండాగారం. ఆచార్య ఎన్.గోపి వృద్ధులు ఎదుర్కొనే సమస్యలను వివరిస్తూ, యువతరం వృద్ధులను అర్థం చేసుకోవాలని, రేపు మనదీ వృద్ధాప్యమేనని భవిష్యత్తును గుర్తుచేస్తారు. వృద్ధుడంటే ముసలివాడు కాదని, వృద్ధిచెందిన వాడని చక్కని నిర్వచనం ఇస్తాడు. ఆచార్య ఎన్.గోపి గారికి వారి అమ్మ చెప్పిన మాట "జీవితమంతా గడిపింది గొప్ప కాదురా, వృద్ధాప్యం గడిపిందే గొప్ప". అది వారికే కాదు సమాజంలోని ప్రతి వారికి చెప్పినట్లుగా ధ్వనిస్తుంది. అది అక్షర సత్యమైన మాట కూడా.

రైలు ప్రయాణంలో యాదృచ్ఛికంగా పరిచయమైన హర్షవర్ధన్ గారిని ఎదలోపలి మిత్రునిగా స్వీకరించి, తన గురించి ఏమి ఎరగనంటూనే అతని సహృదయతని ఎరిగి ఈ వృద్ధోపనిషత్ అంకితం చేసిన సహృదయులు డా॥ ఎన్.గోపి గారు. మంచి మనుషులను అభిమానించే వీరు హర్షవర్ధన్ గారి ప్రణయానికి, నిర్బంధానికి గురయ్యానంటాడు. ఇతరులకు ప్రేమను పంచేవారు మాత్రమే ఆ ప్రేమతత్వానికి లొంగబడతారు.

నా దృష్టిలో వృద్ధుడంటే ఒక నిఘంటువు. వృద్ధుడంటే టీకా తాత్పర్యం. వృద్ధుడంటే నేటి కాలపు జిపిఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్). ఆచార్య ఎన్.గోపి గారు జీవితాన్ని మూడు దశలుగా విభజించి బాల్యాన్ని బంగారు వన్నెలా, లేలేత ఉషస్సుగా, యవ్వనం కలల్లోకి వచ్చే కన్నెలా, ఏడు రంగుల ఇంద్ర ధనస్సులా, వృద్ధాప్యాన్ని చల్లారిన పాలగిన్నెలా, అనుభవాల తేజస్సులా చక్కని పోలిక చెప్పారు. వృద్ధాప్యంలో ముసలి ముడుతలు మీదపడుతున్న, అనుభవాలనెడి తేజస్సు కనబడుతుందని చక్కని పోలిక చెప్పారు. మనిషి తన

జీవితంలో తాను సాధించిన విజయాలు, అనుభవించిన కష్టాలు, తనను వెంబడించే జ్ఞాపకాలు, బాధించిన క్షణాలు ఒకటేమిటి .. అతనిది వొడవని కథనే. వృద్ధాప్యం ఎక్కడి నుండో రాదని, అది లోపలి నుండే దొంగలా చొర బడుతుందని, దానితో పేచీ లాభం లేదని, స్నేహంగా ఆహ్వానించాలని చక్కని సూచన చేస్తారు. "పాపం శరీరం" అనే కవితలో శరీరంలోంచి బయటకు వచ్చి, శరీరాన్ని గమనిస్తూ యవ్వనంలో ఉన్న అందమైన శరీరం సహజంగా వృద్ధాప్యంలో ముఖం ముడతలు పడడం, వెంట్రుకలు తెల్లబడడం, పండ్లు ఊడిపోవడం, కళ్ళకింద ముడతలు ... ఇవన్నీ మనకు ఆశ్చర్యమే అనిపిస్తుంది అనే విషయం కవి చక్కగా సహజంగా వర్ణించారు. నిజంగా మన పాతకాలపు చిత్రాలు చూసినప్పుడు మార్పు చాలా చిత్రంగా అనిపిస్తుంది. మన యవ్వనపు ముఖం ఎంతో అందంగా కనిపిస్తుంది. విచారం మిగుల్తుంది. అందుకే కవి ధైర్యంగా ఉండాలంటాడు.

వృద్ధుడు అనే కవితలో వృద్ధుడు అనే మాటకు చక్కని నిర్వచనం ఇచ్చాడు. వృద్ధుడంటే వృద్ధి పొందినవాడని, అది అనుభవ పరిణతితో పాటు మనస్సు పెరగడం అని అంటారు కవి. వృద్ధుడు కాలుతున్న క్యాండిల్ వెలుగులు పంచుతూ, తాను కరిగిపోయినట్లుగా, తన శరీరం శిధిలమవుతున్న కుటుంబంలో వెలుగులు నింపుతూ జీవన సాఫల్యత పొందుతాడు. అందుకే 'వృద్ధాప్యం జీవితం ఒడిసిపట్టుకున్న తత్త్వం' అని కవి అంటారు. చివరగా ఇవాళ కాసేపు వృద్ధులను తలచుకుందాం అంటాడు.

మనిషి తన జీవనగమనంలో పరుగులెత్తుతూ, వృద్ధ తల్లిదండ్రులను మరిచిపోతుంటారు. కాదు కాదు, తమ వృద్ధాప్యంలో తమను మరిచిపోయే విధంగా, తమకు తెలియకుండానే పిల్లలను పెంచుతుంటారు. అలాంటి వారికి వారి భవిష్యత్తును చక్కగా దర్శింపజేస్తారు కవి. అందుకే కృతజ్ఞత అనే కవితలో కవి "నిత్యం మనం వాడుకొని పడేసే వస్తువు కాదు, మన కృతజ్ఞతకు హద్దు" అని చక్కని నుడికారం పలుకుతాడు. వృద్ధుడు నిన్నటి వార్తా పత్రిక కాదు – రేపటి ఆలోచన, వృద్ధుడు సుగంధం తగ్గిన గంధం కాదు– మనకు ఎదురైన వరం, వృద్ధుడు రద్దైన పద్దు కాదు– మన పిల్లలను విజ్ఞులను చేసే ముద్దు...

"సీనియర్ సిటిజన్స్" అనే కవితలో కవి వృద్ధులు కనిపించే ప్రదేశాలు, పడే పాట్లను చక్కగా వివరించారు. బ్యాంకులు, పోస్టాఫీసులు, హాస్పిటళ్లు.. ఒకటేమిటి? అన్నిచోట్లా కన్పిస్తారు. అంతటా నిర్లక్ష్యమే వృద్ధులంటే. ముసలితనమే రోగమన్నట్లు డాక్టర్లు యాంత్రికతను ప్రదర్శిస్తారు. అంతెందుకు? వృద్ధుల జీవితానికి వారి కళ్ళే నిదర్శనాలు. వారి జీవితం మసక బారుతున్నట్లు, కళ్ళు సింబాలిక్‌గా మసకబారుతుంటాయి. 'వయసు మళ్ళిన పాట'లో చక్కని భావుకత కన్పిస్తుంది. మిత్రులు చనిపోతూ స్మృతి నక్షత్రాలవుతారట. మన మాటలు చెల్లని నాణేలు అవుతాయట. ఎవరినో పిలుస్తాము. నిజానికి ఎవరిని పిలవాలో తెలియదు. మార్పు అంటే పురోగమనానికి ప్రతీక. కాని ఇవాళ మార్పు అంటేనే భయమేస్తోంది అంటూ వృద్ధుల పరిస్థితి చక్కగా వివరించారు.

ఒంటరితనం అంటే చుట్టూ ఎవరూ లేకపోవడం కాదు. ఉన్నా లేనట్టు అనిపించడం అంటూ మన అందరినీ ఆలోచింపజేస్తారు కవి. నేడు వృద్ధులే కాదు, ప్రతి మనిషి ఒంటరివారైపోయారు. వృద్ధాప్యం మరీ ఒంటరైంది. 'నీళ్ళు' అనే కవితలో 'ఎవరు నింపారో తెలియదు కాని అతని కళ్ళనిండా నీళ్ళు' అని ఎంతో చక్కని భావుకతని ప్రదర్శిస్తారు. వృద్ధులను ఎవరూ పట్టించుకోవడం లేదని, వారి అవసరాలు కూడా తీర్చటం లేదని కవి బాధపడతారు. "అమ్మ ఒక మనిషి" అనే కవితలో అమ్మ ముసలితనాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించారు. వృద్ధుల పట్ల ఓపిక వహించాలని సూచన చేశారు.

"ఆమె కూడా" అనే కవితలో కవి తన సహధర్మచారిణి ముసలితనం గురించి వివరించాడు. ఒకప్పటి నా అందాల సుందరి, తరగని అనురాగ రాగిణి కూడా ముసల్ది అయిందని ఆశ్చర్యం వ్యక్తం చేసాడు. అందుకే సిగ్గు పడ్తున్నానంటాడు. ఆమెకు సహాయపడుతున్నాను. సహాయమంటే మరేమో కాదు నా పనులు నేను చేసుకుంటున్నాను అంటాడు. ముసలితనంలో వచ్చే మతిమరుపును 'ముది మది' అనే కవితలో చక్కగా వివరించారు. 'హృదయంపై చిక్కగా ముద్రించిన అక్షరాలు వెలిసిపోతున్నాయి. అన్ని మర్చిపోతున్నాను. కాపలా కాసే

వాళ్ళు నా జ్ఞాపకాలను కూడా కాపాడితే బాగుండు' అని కవి అంటాడు. 'వృద్ధాశ్రమం' అనే కవితలో నేటి కాలంలో వృద్ధాశ్రమాలు వెలిసి అన్ని అవసరాలు తీర్చుతూ జీవితాన్ని పొడిగిస్తున్నాయి. కాని అది జీవితమేనా? అని సమాజాన్ని ప్రశ్నిస్తాడు. శత్రువులెవరూ లేని వారికి కూడా వృద్ధాప్యమే శత్రువైంది. వృద్ధాశ్రమంలో మంచాలు పాతవే, వచ్చి పోయే వాళ్లే మారుతుంటారని, ఆ మంచాల కన్నా వృద్ధాశ్రమంలో పడ్డవారి ఆయుష్షు తక్కువని కవి ఆవేదన వ్యక్తం చేశాడు.

'పూర్ణకుంభం' అనే కవితలో మునలితనాన్ని అంగీకరించడం ఎవరికైనా కష్టమేనని, వృద్ధాప్యం అనుకున్నంత సులువు కాదని గొప్ప తత్త్వాన్ని బోధిస్తాడు. వృద్ధులు మరణానికి భయపడనివారని 'నిర్భయ గీతి'లో ప్రకటిస్తాడు. 'మృత్యువులో ముఖాముఖి' అనే కవితలో మనిషి భవబంధాల్లో బంధింపబడి ఎంతటి బిజీగా ఉంటాడో చక్కగా వివరించాడు. "పిల్లల కోసం భద్ర ప్రణాళికలు రచిస్తున్నాను. కాస్త బిజీగా ఉన్నాను" అంటాడు. మనిషి తనకు వృద్ధాప్యం వచ్చినా ఇంకా ప్రేమ చావక కుటుంబం అంటూ తపన చెందుతుంటాడు. పిల్లలు చిన్నవాళ్ళు అనుకుంటాడు. చివరికి మరణానికి కాస్త ఓపిక పట్టు నీ ధర్మానికి అడ్డురానంటాడు.

"శేష జీవితం" అనే కవితలో శేష జీవితం కాదిది, అశేష అనుభూతుల నిధి అంటాడు. నిజమే! సాధారణంగా రిటైర్‌మెంట్ కాగానే అందరూ శేష జీవితం అంటుంటారు. నిజానికి అశేష అనుభవంతో సాగించే కొత్త జీవనం అది. స్నేహజీవితానికి నాంది అది. అవును.. మనం రోజూ చూస్తుంటాము. ఆ అనుభవ రత్నాలన్నీ గ్రౌండులో, కల్వర్టుపైన కూర్చొని వారి మనసు మూటలు విప్పుకొని హాయిగా మాట్లాడుతూ, నవ్వుతూ కన్పిస్తుంటారు. వృద్ధాప్యం అంటే జీవితం ముగింపు దశ అనే స్పృహ మన మదిలో చేరుతుంది.. అందుకే కాబోలు కవి కాస్త భ్రమణవేగం పెరిగింది అంటాడు.

'మనసుకు వయసు లేదు' అనే కవితలో ముసలితనాన్ని ఎవరూ ప్రేమించరని, కాని హృదయానికి వయసు లేదన్నప్పటికీ, శారీరక శైథిల్యాల మధ్య అది చిన్నబోతుంది అంటాడు. చివరగా చైతన్యం ఒక గొప్ప వెలుగు అని ఆ వెలుగులో శిథిలం కూడా కొంతవరకు పదిలమేనని ప్రతివారికి ఆత్మవిశ్వాసం నూరిపోస్తాడు. వృద్ధులు జ్ఞానులుగా మారాలని కవి కోరుకుంటాడు. జ్ఞాని అయినవాడు జ్ఞాపకాలను మూటగట్టుకొని మోయకుండా అక్కడక్కడ మైలురాళ్ళుగా నాటాలంటాడు. తొంభై మైళ్ళు దాటి 10 మైళ్ళు గమ్యమే అయినా ఆశకు ఆస్కారం లేదనుకోడు. ఏదో తత్త్వం నడిపిస్తుంది. జీవితాన్ని ప్రేమించేవాడికి మరణమంటే భయముండదు అంటాడు. నిజంగా జీవితాన్ని ఆస్వాదించే వారికి మరణమంటే భయముండదనే మాట నిజమే. "చిరకీర్తి" అనే కవితలో మనిషి వెంట మేడలు, మిద్దెలు రావని, ఇతరుల హృదయాల్లో నిలిచిపోయే పనులు చేయాలని హితవు పలుకుతాడు. అందరి హృదయాల్లో నిలిచిపోవాలంటే మంచి పనులు చేయాలని సూచన చేస్తాడు. చివరగా "ఫలశృతి" కవితలో వృద్ధులను బ్రహ్మ అని, సార్థక్య మానవజన్మ అని, చిరకాల యోధుడని కీర్తిస్తాడు. వృద్ధాప్యాన్ని అనుభవించడమంటే జీవితం సార్థక్యమైనట్లే కదా!

నేటి యువతరం ముసలి తల్లిదండ్రులు భారం అని తలుస్తూ వృద్ధాశ్రమాలు వైభవం సంతరించుకునేలా చేస్తున్న దురదృష్ట పరిస్థితుల్లో, కనీసం రేపటి మన భవిష్యత్తు కూడా ఇదే అనే జ్ఞానం మరిచిన సమాజానికి "వృద్ధోపనిషత్" చురకలంటించడమే కాకుండా, బాధ్యతను గుర్తు చేస్తూ వృద్ధుల గురించి ఆలోచించేలా చేసే చక్కని వచన కవితలను అందించారు. ఆచార్య ఎన్.గోపి తన కుటుంబం కోసం జీవితాంతం శ్రమించే వృద్ధులను ఆదరిస్తూ, జీవిత చరమాంకంలో వారికి ప్రశాంతతను, ఆనందాన్నిస్తూ వారి అనుభవాలను స్వీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని బాధ్యతను గుర్తుచేశారు. వృద్ధుల పట్ల నిర్లక్ష్యం వల్లనే సమాజంలో నేడు మానసిక ఒత్తిళ్లుపెరిగి, చిన్న చిన్న సమస్యలకే ఆత్మస్థైర్యం కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడే సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. కాబట్టి "వృద్ధులను ఆదరిద్దాం – బలమైన కుటుంబ వ్యవస్థను నిర్మిద్దాం."

**ఆధార గ్రంథాలు :**


1. వృద్ధోపనిషత్ – డా॥ ఎన్.గోపి
2. సమన్వయ సాహిత్య వ్యాసాలు – డా॥ ఎస్.రఘు

కవిత

## మేలుకొలుపు

- డా. కట్టా సత్యప్రసాద్
94900 98918

**నా** చుట్టూ
అలుముకున్న దృశ్యాలను
నా ఎదుటే
జరుగుతున్న దుర్మార్గాలను
చూడలేక కట్టుకున్న
గాంధారి గంతల్లో
మూతలు పడ్డ నాకళ్ళను
తెరిపించ జూస్తున్నట్లు
ఒక అలికిడి

ఎక్కడో
అగాధపు
లోతుల్లోంచి
నాలో మరుగునపడ్డ
మూలాలను గుర్తు చేస్తున్నట్లు
నాదుగా ఒక శబ్దం

ఎప్పుడో
మూగబోయి
నాలో ఇంకా మిగిలిఉన్న
మొద్దుబారిన మనసును
నిద్దుర లేపుతున్నట్లు
ఒక మేలుకొలుపు

తరాలుగా
పొరలు పొరలుగా
పేరుకొన్న సంప్రదాయపు
నమ్మకాల కారుమబ్బులను
ఛేదించే వేల కాంతిపుంజాల
విద్యుత్
నా మెదడులో
ఒక మెరుపు
నా గుండెలపై వేసే
ఆధిపత్య శక్తుల
ఉక్కుపాదాల కథాకళికి
వేదిక కాలేనని
నిరసన గళం విప్పేందుకు
గొంతు నరాలను పెకిలించే
నా ప్రయత్నం
ఒక పిడుగు ■



## విశ్వకవి

- ప్రొఫెసర్ ఇ.శ్రీనివాస రెడ్డి
78931 11985

**బీ**డు బడ్డ మెదడు పొలాలను
కలాల హలాలతో దున్నుతూ
అక్షరాల విత్తనాలు నాటి
విజ్ఞానపు ఫలాలు పండించటానికి
సాహితీ సేద్యం చేసే నిత్య
కృషీవలుడు కవి కర్షకుడు

మూఢాచారాల అగ్నిగుండాల్లో
మస్తకాలను సమిధలుగా చేసి
కలాల సిరాను ఆజ్యంగా పోస్తూ
విజ్ఞాన భాండాలను వెలికితీయడానికి
సాహితీ యజ్ఞం చేసే నిత్య
తపస్వి కవి కర్మయోగి

మేధోమధనంతో ఉద్యమాలకు బీజం వేసి
సిరా కలాలను ఆయుధాలుగా చేసుకుని
అక్షర తూణీరాలను ఎక్కు పెడుతూ
మరుగున పడ్డ నిజాలు వెలికి తీస్తూ
సాహితీ పోరాటం చేసే
నిత్య విప్లవ స్ఫూర్తి కవి కామ్రేడ్



మండుతున్న ఆలోచనల కొలిమిలో
లోహపు మెదళ్లను కరగపెడుతూ
అందమైన అక్షరాల అచ్చుల్లో పోసి
కలాల సిరాతో చల్లార్చుతూ
ఆశయాలను ఆకృతులుగా మారుస్తూ
సాహితీ పరిశ్రమ చేసే
నిత్య శ్రామికుడు కవి కష్టజీవి! ■

కథ

# వేట

తమిళ మూలం : **బవా చెల్లదురై**
అనువాదం : **జిల్లేళ్ళ బాలాజీ**



వీధిలో వెలిగించిన మట్టి పొయ్యిలో కాలుతున్న సైకిల్ టైర్లతో అన్నం ఉడుకుతోంది. కొన్ని సట్లలో పునుగు పిల్లి ఎండు మాంసం, సారా వాసనా వీధి వీధంతా గుప్పుమంటూ, ఉత్సాహాన్ని కలిగిస్తున్న సాయంకాలం పూట జపాన్ ముసలోడు తూర్పు దిక్కుకేసి మొక్కి వీధిలోకి నడిచాడు.

"నేనూ వొస్తాను తాతా!" అన్న గొంతును అతను లక్ష్యపెట్టలేదు. 'యాటంటే నాకూ అడివికీ మద్దెన జరిగే పోరు.' అన్న భావన ఆ అలక్ష్యంలో ఇమిడి ఉంది. ఇక అతను మాత్రమే! ఏదైనా అతనికి అలక్ష్యమే. చాలాకాలంగా బాధలో కూరుకుపోయి ఉన్నాడు. బాధ అతని మాటల్ని మింగేసింది. రావిచెట్టు మైదానం నుండి వొద్దన్నా పిలుచుకొచ్చి ఈ పెంకుటింట్లో కుదేసినప్పుడు, అతని జ్ఞాపకాల నుండి ఆ మైదానం కనిపించకుండా పోయింది. నిద్రలేవగానే గోడల ముఖాలను చూడాల్సి రావటం భరించలేక పోతున్నాడు. ఎంతసేపూ అతని ముందు విస్తరించి ఉన్న మైదానం బలితో అతను మాటలు పోగొట్టుకున్న వాడయ్యాడు.

ఏదీ నచ్చటం లేదు. అయితే ఇంకెందుకు బతకటం?

అడవికి... ఇతనితో సదా జత కలిసి ఉండేది అదే. ఇతనే ఎప్పుడూ గెలుస్తూ ఉన్నాడు. మెల్లమెల్లగా అడవి ఇతని చేతిలో పోగొట్టుకొంటున్నది తనను.

వీధిలో కాలు పెట్టిన మరు నిమిషం ఎదురుగా పెద్దపెద్ద వాయిద్య సామగ్రితో క్రైస్తవులు అట్టలు వేసిన పుస్తకాలతో ఎదురుపడ్డారు.

"ఈళ్లొకళ్లు...' గొణిగాడు. 'నక్కలోళ్ల దెగ్గిర ఏం జూసినారో... రేత్రిపూట, అడివిలో తిరిగే పిల్లనాయాండ్లను ఎంటేసుకుని పాటలు పాడతా... అరస్తా, దీర్ఘాలు తీస్తూ... ఛ ఛ..."

రోడ్డుమీదికి వచ్చేశాడు. బస్సులు, లారీల శబ్దాలతో వణికిపోయాడు. శబ్దం ఎప్పుడూ తట్టుకోలేనిదే. రావిచెట్టు మైదానం మాత్రమే మనసుతో హత్తుకుపోయింది.

చెట్టును వదిలిపెట్టి, ఇతణ్ణి వేరుతో సహా లాక్కొచ్చి వీధిలో నాటారు. తొణకక బెణకక చెట్టుదిమ్మెలా నిలబడ్డాడు జపాన్ ముసలోడు.

భుజాన వేలాడుతున్న తోలుసంచిలో దాక్కుని ఉన్న వలలు బరువెక్కి ఉన్నాయి.

కొంతసేపు... కొంతే కొంతసేపు వలల్ని విప్పి, సరైన చోటు చూసి పన్ని... ఆ జ్ఞాపకాలు మాత్రమే అతణ్ణి తడుముతున్నాయి. చుట్టి, చుట్టి ముఖంలో నిప్పులు పోసిన జీవితంలో ముఖం కాలిపోయి, నాలుక వేలాడేసుకుని చచ్చిపోయి ఉంటాడు. ఈ అడవే కాపాడింది.

రోడ్డుమీద నుండి కాలిబాటమీదికి దిగిన పాదాలు. తారు రోడ్డునుండి మట్టిరోడ్డు మీదికి దిగుతున్నప్పుడే జపాన్

ముసలోడు అడివితో జత కట్టటానికి తయారవుతాడు. పిచ్చెక్కుతుంది రక్తంలోకి... 'వొద్దు...వొద్దు...' అని అరిచీ అరిచీ... ఇతను వెళ్లిపోతున్నప్పుడు దాని బిడ్డల కొస ప్రాణంతో లాక్కునే వెళతాడు.

నెరిసిన మీసాల పక్కన గెలుపు నవ్వు విచ్చుకొని మాయమవ్వటం ఆ సమయంలో మాత్రమే.

మట్టినేల మీద పడగానే శనిమూలన మొక్కాడు.

నల్లతుమ్మ ముల్లు ఎడమకాలి బొటనవేలిలోకి దిగింది.

విసురుగా కాలును పైకెత్తి పీకి పడేశాడు. రక్తం పొంగింది. ఎంగిలిని మట్టితో తాకించి రక్తపు నోటికి పూశాడు.

నడిచాడు. ఎప్పుడూ చెప్పులు వేసుకునే వాళ్లను చూస్తే ఎగతాళే ముసలోడికి. చెప్పుల శబ్దానికి కుందేలు పిల్లయినా పారిపోతుంది.

రావిచెట్టు మైదానంలో వెల్లకిలా పడి ఉన్నప్పుడు, దేన్నైనా వదిలించుకునే మనసుండేది. కాలిబాట చివరిగా ఇతనితో గొడవపడి నిలబడి పొయ్యే అడవి, పెనుగాలులతో భయపెడుతున్నది.

చీకటి కమ్ముకుంటున్నది. ఇతనిలో ఇతను మాత్రమే ఉన్న రోజులవి. అన్నీ వదిలించుకుని నిర్వాణంగా ఉన్నది మనసు. చూశాడు. ఎదురుగా తన రాక్షస రెక్కల్ని విప్పి ఇతణ్ణి అలాగే పొడిచి ఎత్తుకొని పోవటానికి నిలబడున్న ఆ అడివిని.

ఈ క్షణాల్లోనే ఇతను భయం లేకుండా పోతాడు. సిగ్గులు వొలిచి తేలికవుతాడు. గాలిలాగా హక్కుతోనూ, వేరొకడిలాగానూ అడవిలోకి ప్రవేశిస్తాడు.

చీకటి పడింది.

చల్లని గాలి మొహాన చరిచింది. నిదానంగా ఒడిని తెరిచి పొగాకును తీసి నోట్లో పెట్టుకున్నాడు. ఇది అతని ప్రపంచం.

అవసరమైన ప్రపంచం. అవసరం జీవిని ఉసిగొలుపుతుంది. ఒక సుదీర్ఘమైన రాత్రి అతని కోసమే ఈ కాననంలో ఎదురుచూస్తోంది. ఎందుకు తొందర?

పెద్ద బండమీదికి ఎక్కాడు. ఎక్కే దారి అలవాటైంది. అమావాస్యకు ముందు ఐదు రోజులూ, తర్వాత ఐదు రోజులూ వేటకు అనుకూలమైనవి. వెలుతురు లేని రాత్రులు మనిషి రాకను జీవులకు గ్రహింపచెయ్యలేవు. వెలుతురుకు ఎప్పుడూ టార్చ్‌లైట్ వాడలేదు. కళ్లే! చుట్టూ బూడిద పూసి మధ్యలో ముత్యాల్లా బ్రౌన్ కలర్‌లో మెరుస్తుందే.. దానికన్నానా సెల్‌తో కూడిన టార్చ్‌లైట్?

గతవారం కురిసిన వర్షానికి మేకు (కొయ్యను చీల్చే యంత్ర సాధనం) సులభంగా నేలకు దిగింది. మెల్లగా వలల్ని వదులు చేశాడు. నిదానం... నిదానం...

ఒక్కొక్కటిగా నేలమీద పరిచాడు. లాక్కుంటూ జరుగుతున్నాడు. ఇనుప సంకెళ్ల కదలికలు కూడా అతని నియంత్రణలో ఉంది. చెవిటోడి గుంట తూర్పుమెట్ల వరకూ వచ్చింది పిడి గొలుసు.

ఎక్కించి చూశాడు. కంటికి కనిపించినంత దూరం వరకూ అలుముకున్న చీకటి. తల తిప్పాడు. దూరంగా వెలుతురు లేని ఒకట్రెండు నక్షత్రాలు. వర్షం వచ్చేలా ఉంది. రానీయ్. దానికేం? ఏమైనా రానీయ్. అడవిలో కొసన నిలబడి దాన్నే రచ్చకీడ్చేలా ఒక చూపు చూసి నిర్ణయానికొచ్చాడు.

'శని మూలకూ చెవిటోడి గుంటకూ మధ్యలో...'

ఏ రోజు తప్పించుకుంది అతని కంటికి? గుర్తుగా ఒళ్లో పెట్టుకొని ఉన్న కర్పూరాన్ని వెలిగించి, శని మూలను చూసి మళ్లీ ఒక నమస్కారం. వలకూ అతనికీ మధ్యనున్న సంబంధం టపుక్కున తెగిపోయినట్టుగా ఒక ఊహ అతనిలో కలిగింది. తాత్కాలికమే. గుంట ఒడ్డున పరిచిన వలమీద కన్నేసి చూశాడు. ఏదీ తప్పిపోలేదు.

నడిచాడు. ఇంకా నడిచాడు. నడక మాత్రమే. తూర్పు నుండి దక్షిణం వైపుకు కాళ్లను నడిపించాడు. కాలి ఎముకలకు శరీరపు బలం పెరిగింది. అరిగిన పాదాలు దారి చూపిస్తుంటే జంట మువ్వలు కట్టిన కర్రను నేలకు ఆనిస్తూ, తిప్పుతూ నడిచాడు. రెండు వైపులా పొదలూ వృక్షాలూ అతనికి అలవాటే.

అడవిలో ఈమధ్య, గుంతలు తవ్వి చింతచెట్టు కొమ్మలు నాటి ఉండటం కోపాన్ని తెప్పించింది అతనికి. 'పనికిమాలిన... పని...' అని జేవురు మీసాలు కదలాడాయి. 'దేముడికి తెలీదా... ఈ అడివి జీవాలకు ఏవేవి సెట్లు? ఏవేవి తీగెలు అని? సింతకొమ్మలు పెడతాండారు... సింతకొమ్మలు... బొచ్చులో...' కోపంతో ఒక కొమ్మను గుంతలో నుండి గట్టిగా పెరికాడు. రాలేదు.

బలంగా భూమిలోకి చొచ్చుకుపోయి ఉన్నాయి వేర్లు. ఆత్రంగా చేతుల్ని విప్పదీసి, చేతిలోని కర్రతో పై భాగాన్ని రాశాడు. లేతాకులు రాలి కిందపడ్డాయి. సగం గెలుపూ, మిగతా ఓటమిగా నడిచాడు.

మల్బరీ తీగెల్ని గుత్తుగా పెరికి వాసన చూశాడు. అడివి

వాసన తలకెక్కింది. చిన్న చిన్న డూమ్‌లైట్లలా పండిపోయిన మల్బరీ పండ్లను గుత్తుగా కోసి నోట్లో వేసుకున్న మరునిమిషమే ఊసేశాడు. గింజలు నేలమీదకు వచ్చి పడ్డాయి.

ఇవ్వాళా, నిన్నా కాదు; యాభై అరవై ఏండ్లుగా జరుగుతున్నాయి ఈ తిప్పలు అడివిలో. దక్షిణం వైపుకు వెళ్లి పడమరకు తిరిగి మళ్లీ అతను వలల దగ్గరికి సమీపిస్తుండగా తెల్లవారి పోవాలి. ఇదీ లెక్క. ఇది తప్పకూడదు. దేవుడా.. ఇందులో తప్పు చెయ్యటానికి వీలు కాదు, చుట్టి చుట్టి చేర్చి పెట్టే డబ్బులో మేకల్ని నరికేదంతా ఈ లెక్క తప్పకుండా ఉండటానికే. దాన్ని కాదంటున్నారే... నచ్చలేదు... అడివిని వొదిలెయ్యమంటున్నారు? దుకాణం పెట్టి ఇస్తారట దుకాణం...

ఒంటరి నడకలో పాత జ్ఞాపకాలు వరుస కట్టాయి.

ఇలాగే చిత్రినెల చీకటి. ఎదురుచూడని వాన. ముందు కెళ్లటానికి వీల్లేకపోయింది. వెనక్కు పరుగెత్తి బండకు కింద గుండ్రాయిలా కూర్చున్నాడు. ప్రవాహం ఎక్కువై వాన ఆగగానే, బండమీదికెక్కి నిలబడి చూశాడు. అంతా చీకటి అలుముకొని ఉంది. ఇతని టార్చ్‌లైట్ కళ్లు మూసుకుపోయాయి. ఎక్కడా ఆగకుండా, తుంపర్ల మధ్యే నడిచాడు. తెల్లవారుతుండగా, అతని వలలో నాలుగైదు అడివి పందులు. నమ్మలేకుండా కళ్లు నులుముకుని చూశాడు. ఆ ప్రదేశమే ధ్వంసం కాబడి ఉంది. అరడుగు, ఒకడుగు గుంతలు ఏర్పడి కనిపించాయి. పందుల మూర్ఖత్వం గుంతల లోతుల్లో కనిపించింది. చెట్టు వెనకన దాక్కుని గమనించాడు. ఏ దారీ లేదు. తిరిగి చూశాడు. పొదలన్నీ పక్కలకు తొలగించి చూశాడు. పందుల గర్జన. అడవిని వణికిస్తున్నాయి.

తోడు అవసరం ఒక్క క్షణం అర్థమైంది. మరుక్షణం మనసుతో నిరాకరించాడు. కాలిబాట గుండా పరుగెత్తసాగాడు. గస ఎక్కువైంది. అప్పుడంతా నాలుగు గోడలు లేని రావిచెట్టు మైదానమే. శబ్దం చేస్తూ బేరమాడి మధురైకు తుపాకీ సహితం పరుగెత్తే సమయం, సూర్యుడు చంద్రున కాలుస్తున్నాడు.

దూరం నుండే గుర్తులు చూపించేసరికే రెండు తప్పించుకొని పారిపోయి ఉన్నాయి. తెగిన వలలు ఇతణ్ణి కలవరపరిచాయి. పేలిన శబ్దానికి మిగతా రెండూ పక్కకు వాలాయి.

గుంపంతా మాంసం తిని తాగింది. వచ్చిన ధరకు గౌండర్‌కు జవురి ఇచ్చాడు.

ఆ విధమైన రోజుల చురుకుదనమే ఈ నడక...

పడమరకు తిరిగి ఉన్నాడు. ఇనుప చువ్వలమీదికి ఎగిరి పొదుస్తోంది. మంచివి లేవు. విషపాములే... నిదానించాడు. ఒళ్లంతా అద్దాలు అద్దాలుగా... అద్దాల విషప్పాము. నాలుగడుగులు వెనక్కు వెళ్లి పరుగెత్తుకెళ్లి వీపు మధ్యన ఎగిరి తన్నాడు. దబ్బుమన్న శబ్దంతో పొదలో కిందపడ్డది. తిరిగి చూస్తూ నడిచాడు.

శబ్దం చేస్తూ జీవాలను తరిమాడు. ఏ ఆర్భాటమూ లేదు. గజ్జెల కర్ర, గాల్లో ఆడుతూ వచ్చింది. పొదల కదలికతో ఆగాడు. చెట్టులా నిలబడి, పొదలోకి కళ్లతో జొరబడ్డాడు.

అయిదారు అడివి పంది పిల్లలు. నిన్న రాత్రి లేదా ఇవ్వాళ ఈని ఉంటుంది. రక్తపు జిగట చేతిలోకి తీసుకున్న పిల్లమీద కనిపించింది. సహించలేని శబ్దం చేస్తున్నాయి. వీటిని కూడా జవురుకుని వెళ్లిన రోజులు ఉన్నాయి. అది కాశెమ్మకు ముందు.

తల్లి పంది మూర్ఖత్వానికి భయపడి చప్పున ఎన్నో జాగ్రత్తలతో నడిచాడు.

రక్తస్రావాన్ని ఆపలేక, గవర్నమెంటు ఆసుపత్రికి తీసుకెళ్లి, ఆ లేడీడాక్టర్లు ఆమెను తాకటానికి అసహ్యించుకుంటూ... జన్ని ఎక్కి చచ్చిపోయిన తర్వాత... దేని పిల్లల్నీ, పసి గుడ్డుల్నీ తాకటం లేదు కాశెమ్మకు గుర్తుగా.

వలల్ని సమీపించేసరికి తెల్లవారుతూ ఉంది. ఆతురత నిండి తిరిగిన కళ్లకు, శూన్యమే మిగిలింది. ఏమీ లేదు. ఒక్క పునుగు పిల్లి కూడా లేదు. నాలుగైదు సార్లు వలలకు దూరంగా నడిచి చూశాడు. ఏ జీవి పాదాల ముద్రలూ కనబడలేదు.

జీవితంలో మొదటి ఓటమి. నిర్ఘాంతపోయాడు.

కాలు చాపి నేలమీద కూర్చున్నాడు. పృష్టంలో చురుక్కుమని ముల్లు గుచ్చుకుంది. నొప్పితో లాగేశాడు. నల్లతుమ్మ ముల్లు. వెనక్కు తిరిగి తిరిగి చూశాడు. అడవి నీరసంగా గాల్లో ఊగిసలాడుతున్నది.

చీల లాగి వలల్ని విప్పాడు. దానిపట్ల ఉన్న సంబంధమే వెగటుగా అనిపించింది. ఇప్పటివరకూ మోసగించలేదు. ఒక కుందేటి పిల్లయినా తగులుకొని ఉండేది. ఏం జరిగిందో ఆలోచించటానికే వీలు కాలేదు.

ఎలా ఒఠి చేతుల్తో వెళ్లటం? 'ఏం తాతా తీస్కచ్చావ్...' అన్న ప్రశ్నకు ఏం జవాబివ్వాలి?

రక్తపు మరకలున్న సంచిలో నుండి చిన్నకళ్ల వలను

తీశాడు. ఎప్పుడూ సంచీలోనే ఉంటుందది. రాత్రి పూర్తయ్యీ అలాగే పగటికి, దీన్ని ఇంతవరకూ తియ్యలేదు. ఎప్పుడైనా... పగల్లో... మైనా, గోరింక, బెళవాయి పిల్లల్ని పట్టటానికే. ఈ లేనితనం, దీన్ని తీసేలా చేసింది.

చిన్న వలకు పక్షుల్ని పిలిచి, పిలిచి నీరసించాడు. మూటలో ఉన్న రాగులూ, జొన్నలూ వల పక్కన గడ్డపార పడున్నాయి. బెళవాయి అరుపులు, గోరింక అరుపులూ అన్నీ ఆరోజు ఏ చెవికీ వినిపించకుండా పోయాయి. అడవి, గాలి శబ్దానికి పిచ్చిపట్టినట్టుగా ఆడి ఇతణ్ణి దృష్టిలో ఉంచుకుంది.

కళ్లు చీకటి పడుతూ వచ్చాయి. చెవిటోడిగుంట నీళ్లు ఎన్ని పూటలకని ఆకలిని తీర్చగలదు. ఉడుము వేయించిన కూరా, సంగటీ నిన్న సాయంకాలం తిన్నది. ఎండ మాడ్చేస్తోంది. సకల విద్యలూ ప్రయోగించబడి ఓటమి పాలవుతున్నాయి. వలల్ని చుట్టటానికి కూడా మనసు రాక నడిచాడు.

అడవితో అతనికున్న బంధం, అనురాగం, హక్కు అన్నీ దూరమైపోయినట్టుగా అనిపించింది. మీసాలకు దగ్గరగా ఉన్న నవ్వు చచ్చిపోయి వేలాడుతోంటే, కోదండం పంపుసెట్టు దారిగుండా రోడ్డుమీదికొచ్చాడు.

అడుగులు తడబడుతున్నాయి. ఎవరైనా టీనీళ్లు తీసివ్వకపోతారా... అనిపించింది.

ఖాళీ సంచి భుజానికి వేలాడుతుంటే, ఎదురుపడ్డ తెలిసినవాళ్లు "ఏంట్రా ఉన్నాయి..." అన్న ప్రశ్నల్ని పూర్తిగా నిరాకరించి చేతులు తిప్పుతూ చూపించి మాట్లాడటానికి మనసురాక నడిచాడు.

అతని వీధి అతణ్ణి దూరం చేస్తున్నట్టుగా నిలబడి చూస్తోంది. దీపాలు వెలిగిస్తున్నారు. క్రైస్తవుల వేదికమీద, ఒకటే గీతాలు, శబ్దాలు వినిపిస్తున్నాయి. ఇతను ఇంటిని సమీపించాడు.

కోడలు పిల్లా, మనవడూ అన్నాన్ని వడ్డించుకొని వీధిలోకొచ్చి కూర్చొని ఉన్నారు. నీరసంగా ఉన్నాడు. దూరం నుండి పాటలు వీధంతా నిండిపోయింది. మెర్క్యురీ వెలుతురులో ఆరేడుగురు ఆడవాళ్లు పాడుతూ ఉండటం స్పష్టంగా కనిపించింది.

*నడిపించు నా నావా*

*నడి సంద్రమున ఓ దేవా...*

ఎప్పుడూ లేకుండా, ఇప్పుడు అతని మనసులో మెదులుతోంది పాట.

దెబ్బతిన్న గాయాలకు పొట్టుతో కాపడం పెడుతున్నట్టుగా, నొప్పి అంతా కరిగిపోతోంది, ప్రాణాల్ని పట్టుకుని లాగుతున్నట్టుగా ఉంది పాట.

ఇతను ఇంటి ముందు ఆగకుండా, దాటుకుని, వేదిక దగ్గరకు వెళుతున్నాడు.

వలలు ఇతని సంచిలో భద్రంగా ఉన్నాయి.

■

---

## నానీలు

**- బసు పోతన**

**94408 78247**

*అప్పుడు వీధిలో బ్లీచింగ్*
*అంతా జనమే*
*ఇప్పుడు వేస్తే*
*పిట్టా కూడా లేదు!*

*కరోనాతో వాడి*
*పోరాటం*
*వాడిపై బతకడానికి*
*మరొకడి ఆరాటం!*

*ఎండా వానా*
*అత్తా కోడలు*
*ఏ కాలమైనా*
*ఎప్పుడు కలిసుంటారో!*

*అన్యాయానికి*
*తరగని ఆకలి*
*న్యాయానికి*
*రూకల్లేవు!*

*వాననీళ్లకూ*
*తప్పని హింస*
*దారిలేక రోడ్డు మీద*
*పడిగాపులు*

*పగలు రాత్రి*
*రాత్రి పగలు*
*ఎవరినెవరు*
*తరుముతున్నారు!*

*జడివాన*
*పోలీస్ అయ్యింది*
*హౌస్ అరెస్ట్ చేసి*
*చితక్కొడుతోంది!*

*ఆమె ఆకాశమంతా*
*ఎగురుతోంది*
*దారం మాత్రం*
*ఆయన చేతిలో ఉంది!*

*న్యాయదేవత*
*కళ్ళకు గంతలు*
*దోషి ఎవరో*
*కనపడలేదు*


■

కవిత

# సీమ సేద్యం

- రజిత కొండసాని

96528 38920



పాలింకి పోయిన రొమ్ము కదా ఈ శప్తభూమి
ఇక్కడెప్పుడూ కరువు ఒక్కటే ఋతువు
ఇక్కడి భూమ్యాకాశాల్లో నీరు చచ్చిపోయింది
చెట్లకి కూడా కన్నీళ్ళుంటే బాగుండు
అవి తాగి కొన ప్రాణానైనా నిలుపుకునేవి
ఏమున్నదిక్కడ?
వట్టిపోయిన ఆకాశం
నెర్రెలు చీలి ఎండిపోయిన నేల
మోడు వారిన చెట్టు తప్ప!
పిడచకట్టుకుపోయిన గొంతులెన్నో
గొంతెత్తి ప్రార్థించినా
చేతులు జోడించి పూజించినా
అదంతా మన గొంతులు తడవడానికి కాదు
నేల గుండె తడవడానికే కదా!

ఇక్కడ నాగలి జచ్చిన పామే
తోట కాడ చేరి తలెత్తి ఆకాశం వైపు చూసి చూసి మా నాయన
కళ్ళు నెర్రెలుజీలిన నేలలాగే నెత్తురోడి అలిసిపోతున్నాయి!

భరోసా లేని బతుకులు
ఎండిన బీళ్ళ మధ్యన పచ్చటి ఇగుళ్ళ కోసం
కలలు కని అప్పుల మోత భుజాకెత్తుకుని
ప్యానాలు పెనంగా పెట్టినా
వాన రాదు ఆశ తీరదు

కుంటలు ఎండిపాయె
కాల్వలు కనుమరుగాయే
నలుగురికి అన్నం పెట్టిన మా నాయిన
మట్టిని నమ్మి జీవంతో మట్టిపాలయినాడు
వట్టిపోయిన దేహంతో

మాయమ్మ పుస్తెల తాడు మాయమై
పసుపుతాడు దర్శనమిచ్చే
అమ్మ కండ్లు ఊటబాయిలయ్యే

ప్రభువులారా!
దేశమంటే మట్టి కాదు
దేశమంటే బువ్వ పెట్టే భూమి
దేశమంటే ఓటర్లు కాదు
దేశమంటే చచ్చిపోయే వరకు
గొప్పగా బతికే మనుషులు
మాకూ, మా భూమికి నీళ్లివ్వండి!





రవీంద్రసూరి నామాల

# కన్నీళ్ల సిరాతో వెన్నంటిన ప్రాణస్పర్శ

- తిరునగరి శ్రీనివాస్
84660 53933

**చె**మ్మగిల్లిన కళ్లను ఆత్మీయంగా తుడిచి అంతరాత్మను ఆవిష్కరించే మాటల ఆర్ద్రతే కవిత్వం. సృజనతను స్పర్శించిన చేతివేళ్ల పనితనం అందమైన కావ్య సృష్టికి ప్రాణవాయు వవుతుంది. సందర్భానికి ఆవశ్యకతగా, విప్పారిన వ్యవస్థాపనగా, మార్మికతల క్రియాత్మకతగా, వర్తమాన పరితపనగా కుదురుకున్న కవితా వాక్యమే మనస్సు చుట్టూ అల్లికై ముసురుకుంటుంది. మన్ను ముద్ద అద్దిన కాటుకగా, నిరంతరాన్వేషణలో దక్కిన పరిపూర్ణమైన నీటి బొట్టులా, అనిర్వచనీయమైన ప్రజ్వలిత కాంతిగా కవిత్వాన్ని భాసింపజేయడం కవిలోని కళాత్మకతకు నిదర్శనం. 'అనాహత'లో అంతర్గత నదులను అదిలించి కాలనాళికలో భావ ప్రవాహమైన నామాల రవీంద్రసూరి. రవి లాంటి కవి అనిపించుకున్నారు. హృదయ ద్రావకంగా సాగిన కవితాధారతో సరికొత్త ఒరవడిని ఆయన ప్రతిపాదించారు.

*కచ్చురం కనిపిస్తుందా/ ఉసిల్ల ఊసైనా ఉందా/ గీసకత్తి మొక్కబోయింది/ కుమ్మరాము కనుమరుగైంది/ మోటబావి- చెరువుతూము/ ఛిద్రమైన పల్లెటూరి సంస్కృతి/ పాలపిట్ట- శమరకాకి/ లింగన పురుగు- కుమ్మరి పురుగు/ తుమ్మిష్క- భూం పాప/ఎర్రలు-తేనెటీగలు- బుడ్బుంగలు.. తీరొక్క పక్షులు ఏమైనట్టు?* అని ప్రశ్నించడంలో పర్యావరణ అసమతుల్యత, వైభవాన్ని కోల్పోయిన పల్లె కనిపిస్తాయి. గతం పునాదులపై భవిష్యత్తును నిర్మించుకుంటూ జీవవైవిధ్యాన్ని వెతుక్కుంటున్నాడు మనిషి అంటారు. రాయలసీమ ఒకనాడు రత్నాలు పండించిన భాగ్యసీమ అని ఇప్పుడు రగిలే జ్వాలలతో రావణకాష్టంగా మారిందని వేదన పడతారు. మొక్కనైతేనేం/ మనిషి మొక్కేంతగా ఎదుగుతాను/ మనిషికి ఆదర్శమే నేను అంటూ అమ్మతనం లాంటి హరిత గీతాన్ని ఆలపించారు. చెట్టునైతేనేం/ చెట్టంత మనిషిగా తోడుంటాను అని భరోసా ఇచ్చారు. లోతైన చూపులు కొన్నైతే/ పైపైన చూపులెన్నో అంటూ అనేక రకాల చూపులను విశ్లేషించి చూపారు. దృశ్యాల మూటలను తెచ్చి మనిషి మదిలో ముద్రించగలిగే శక్తి చూపులకు ఉందంటారు. బతుకమ్మ పండుగ ఒకప్పుడు ఎంతో గొప్పగా ఉండేదని చెప్పి ఇప్పుడు మారిన కాలమాన కర్కశ పరిస్థితుల్లో పండుగ వైభవం ఎండమావి అయ్యిందంటారు. పిస్తోలు బిల్లలు మోగకుండా, ఒంటి మీద కొత్త బట్టల వాసన తగలకుండా, టపాసుల శబ్దాలు మారుమోగకుండా నిశ్శబ్దంగా బతుకమ్మ బయలెల్లిందని వేదన చెందారు.

డబ్బే ముఖ్యం కాదని, సంపాదనంటే జ్ఞానమని చెప్పారు. చూడలేని నీలిదృశ్యాన్ని/ ఆపలేక/ గుడ్డివాడైన సూర్యుడు/ గుండె పొడుచుకొని/ ఆకాశం ఆరేసిన శవమైనప్పుడు సర్వం ధ్వంసం అనడంలో సమస్యల చీకటిలో చిక్కుకొని దయనీయంగా మారిన బతుకును విశ్లేషించారు. నేను కంటున్న కల/ తీరని

*అలల తాకిడికి ముక్కలైతే/ చీకటిని దాటేస్తూ అతికించు కుంటున్నాను/ నేను ఏనాడో రాత్రి అనే పదానికి రిప్ చెప్పేశాను/ ఒళ్లు తెరిచే నిద్రపోతున్నాను* అనడంలో గాయపడిన జీవితం గుర్తుకు వస్తుంది. ముక్కలవుతున్న కలలకు ప్రాణం పోయాలన్న తపన వ్యక్తమవుతుంది. బాల్యం, మానవత్వం, మానవ జీవితంపై మాధ్యమాల ప్రభావం, దు:ఖం, సినిమా రంగం వంటి అంశాలు కవితల్లో కనిపిస్తాయి. జీవితం దుఃఖాల కూడిక/ సంతోషాల తీసివేత అంటారు. *ఆకాశం/ సముద్రం/ భూమి అక్కడే కుర్చుంటారు... నాలాగ/ కూర్చుని ఉండడమంటే/ చలనం ఆగినట్లా/ సంచలనం కోసమే* అన్న ఉద్విగ్నస్థితి వ్యక్తమైంది. బంధాలు, బంధుత్వాలు శాశ్వతమా అని ప్రశ్నించారు. క్రమంగా వెళ్లినవాడు/ గమ్యాన్ని చేరుకుంటాడు/ దారి తప్పిన మనిషి/ ఎంత దూరమని వెళ్లగలడు అని అన్న నగ్న సత్యాన్ని చెప్పారు. ఊపిరి పోసిన/ అమ్మతో సమానం/ ఊరు కన్నబిడ్డలా/ వెచ్చటి కౌగిలింతల్లాంటి పచ్చటి జ్ఞాపకాలు అని తన ఊరును గుర్తు చేసుకుంటారు. నేను తిరిగేది ఎక్కడో/ వెతికేది ఏంటో/ ఎవ్వరికీ కనిపించదు అనడం ఆయనలోని అన్వేషణాశీలతను తెలుపుతుంది.

పలు కవితల్లో ప్రయోగాలు, ప్రతీకలు, ఉపమానాలు, పదబంధాలు అనేకంగా కనిపిస్తాయి. జంటపదాల ప్రయోగం కూడా పలు కవితల్లో ఉంది. పాపాన్ని, శాపాన్ని తుడిచిపెట్టేది జ్ఞానమే అంటారు. అహం కొమ్మలను/ అప్పుడప్పుడు అదిలించకపోతే/ వదిలించుకుంటుంది సమాజం అని నిర్మొహమాటంగా ప్రకటిస్తారు. చెట్టుకు మనిషికి పోలికెక్కడిది అన్నారు. విజ్ఞానం విచ్ఛిన్నమైన చోట ఫలితం మనిషికి దక్కదని చెప్పారు. అడ్డదిడ్డంగా పెరిగిన కొమ్మలను కత్తిరిస్తేనే చెట్టు నేలను చూస్తూ నింగిని అందుకోగలదని అంటారు. రిక్తహస్తాలతో/ నిలుచున్న మనిషి కూడా ఋషి కాగలడు అని సందేశిస్తారు. స్త్రీలో గణించలేనన్ని గగనాలు/ కనిపించని సంవేదనల సమాహారాలు ఉన్నాయంటూ ప్రతిరోజూ కొత్త దు:ఖాన్ని కొనుక్కునే సహనశీలిగా ఆమెను అభివర్ణించారు. స్త్రీని సముద్రాన్ని పోలిన అక్షరంగా భూదేవికి సమానార్థకంగా సూచించారు.

తాత్విక అధ్యయనం, జీవిత అనుభవంతో వెలువడిన వ్యక్తీకరణలుగా కవితలు కనిపిస్తాయి. నిరంతర అధ్యయన సృజనశీలత అడుగడుగునా వ్యక్తమైంది. ప్రభాతకు నులివెచ్చని చురకలో ఆదమరచిపోయారు. సమాజంలోని వేదనను ఎత్తిచూపారు. ఆకలితో కూడిన కడుపుమంట ఎవ్వరికీ ఉండకూడదని కోరుకుంటారు. సృష్టిలోని ఆవిష్కరణలు అన్నీ మనిషి ఆలోచనలకు ప్రతిరూపాలేనని అంటారు. ఆలోచనల వేగంతో సర్వవిద్యల మకుటధారిగా మనిషి అవతరించాడని చెప్పారు. మట్టికున్న సమానత్వాన్ని మనిషి తెలుసుకోవాలంటారు. ఏ ఇంట్లో పుడితేనేం/ ప్రతి ఒంట్లో ప్రవహించేది/ ఎర్రటి నెత్తురే అంటూ అచంచల మానవత్వాన్ని గుర్తు చేశారు. రాజకీయ ఎత్తులు, స్వార్థపు జిత్తులు సమాజ పటంపై మాసిపోని మరకలని అన్నారు. ఏ జీవితమైనా/ అక్షర బద్ధమైతేనే కదా/ ఆదర్శమవగలదు అని శాశ్వతత్వానికి నిర్వచనమిచ్చారు. ఓదార్పును అమ్మతనమని వివరించారు. నా ఆలోచనల ధార/ ప్రవహిస్తూనే ఉంటుంది/ జ్ఞాపకాల జాడలను సృష్టిస్తూ అంటూ తన నిత్యపురోగమనాన్ని స్పష్టంగా సూచించారు.

విభిన్న అంశాలు ఉన్నా విషయ సమన్వయాన్ని పాటిస్తూ మట్టికోయిల గొంతులో కొత్త చైత్రాన్ని పట్టుకున్నట్టుగా గతిశీలంగా, వైవిధ్యభరితంగా రవీంద్రసూరి కవిత్వం సాగింది. గాయాలకు ఆప్తవాక్యాలను అద్ది కొండంత భరోసా ఇచ్చారు. సమస్యలపై పోరాటంలోనే మందహాసాన్ని వెదికారు. కన్నీళ్ల సిరాతోనే వెన్నంటే ధైర్యం నూరిపోశారు. చలిముల్లులు గుచ్చిన చోట దుప్పటిలాంటి రక్షణ కవచమయ్యారు. చెరువంత విశాలతనూ, చెదిరిపోని ధైర్యాన్ని అవలంబించారు. చీకటిని తరిమే సూర్యుడిలా ప్రకాశిస్తూనే తల్లివేరులా దయాళువై ప్రాణస్పర్శను కురిపించి విశ్వసనీయ కవితా పత్రాన్ని ఆవిష్కరించారు.

■

# పూర్తి చేయని పద్యం



- సాంబమూర్తి లండ
96427 32008

పూర్తి చేయని పద్యమెప్పుడూ
ఊరిస్తూనే ఉంటుంది
ఆకూ రేకూ ఏరుకొచ్చి ఎంత శ్రద్ధగా అల్లినా
పూర్తికాని గిజిగాని గూడులా
గుండె కింద గుచ్చుతూనే ఉంటుంది

చెరువు మట్టి తెచ్చి నీళ్లు చిలకరించి
మెత్తగా ముద్ద చేసి ఆకారాన్ని చేసినా
పూర్తికాని మట్టిబొమ్మలా
మనసులో మెదులుతూనే వుంటుంది

వెలిగే వెలిగే దీపం ఆరిపోయాక
చీకటిలో బాగా పరిచయమున్న ముఖమేదో
తలుపు దగ్గర తచ్చాడుతున్నట్లు
తెగదెంపులు చేసుకుని వెళ్లిపోయిన ప్రియురాలు
అకస్మాత్తుగా కలలో నవ్వుతూ కనిపించి
నుదుటి పైన ముద్దుపెట్టుకుంటున్న క్షణంలో
స్వప్నం చెదిరిపోయినట్టు
చేతులు చాచి నాకేసి వస్తున్న పసి జాబిలి
అనూహ్యంగా అమ్మవేపు తిరిగి
వెన్నెలనంతా ఒంపేసినట్టు...
ఎంతకీ పూర్తికాని పద్యం
ఒక తీయని వేదన!
చిత్రం గీసే లోపు కొమ్మమీంచి ఎగిరిపోయిన పిట్ట

ప్రతి పద్యాన్నీ
లేచిగురును తాకినట్టే తాకుతాను
ఇంతలో తనేదో చిలిపి కబురుందని పిలుస్తుంది
ఆ ముచ్చట్లు విని వచ్చేలోపు
ఏదో అల్లరి గాలి చిగుళ్లను విరిచేసిపోతుంది

పొద్దున్నే ఏదో ధ్యానంలో ఉంటాను
కాగిత తీరాలకేసి
ఓ పద్యం కదిలొస్తూ వుంటుంది
సముద్రపు ఒడ్డున దూరాన్నుంచి
మనకేసి నడిచివచ్చే మనిషికి మల్లే
అంతకంతకూ చేరువౌతూ
స్పష్టతకీ అస్పష్టతకీ మధ్య కదలాడుతున్నప్పుడు
నా బుగ్గలమీద పసి పెదవుల తడి స్పర్శ
నేను తపోభంగమైన మునినౌతాను
పూర్తికాని ప్రతి పద్యం ఓ అభిసారిక

రాత్రుళ్ళకు రాత్రుళ్ళు మింగేసి
ఏమెరుగని నంగనాచిలా కవ్వించే పద్యాలూ
శైలీ శిల్పం భావం భాషా అంటూ
కావాల్సిన దినుసులన్నీ వేసాక్కూడా
ఇంకేదో వెలితిగా ఉందని
అలిగి వెళ్లిపోయిన పద్యాలూ
రాస్తున్నకొద్దీ దుఃఖాన్ని రేపుతూ
ముగింపు ముంగిట నన్ను
నిస్సహాయంగా వదిలేసిపోయిన పద్యాలూ
పూర్తి చేయని పద్యాలన్నీ
మనసు మట్టిలో నాటుకున్న విత్తులు
మొలకెత్తి పచ్చని చెట్లయ్యేవరకూ
సేద్యం చేస్తూనే వుండాలి!



# శాస్త్రవేత్తలపై స్మృతి కవిత్వం

- సుంకర గోపాలయ్య
తెలుగు శాఖాధ్యక్షులు,
పీఠికాపురాధీశ కాకినాడ ప్రభుత్వ కళాశాల
94926 38547

సమాజం అనేక వ్యక్తుల సమాహారం. వ్యవసాయం, వృత్తిపనులు, సేవారంగం, జర్నలిజం ఇలా అనేక రంగాల్లో తమ వంతు కృషి చేసిన వ్యక్తులు ఉన్నారు. అలాగే శాస్త్ర పరిశోధనల ద్వారా సాంకేతికతను, ఆధునికతను అందుబాటులోకి తెచ్చే శాస్త్రవేత్తలు, ఆటల ద్వారా దేశ ప్రతిష్ఠ పెంచే ఆటగాళ్ళు ... ఇలా అనేక విషయాల్లో వ్యక్తులు ఆదర్శంగా నిలిచే వాళ్ళు ఉంటారు. అటువంటి వ్యక్తుల్ని కోల్పోయినపుడు, కవులు స్మృతులు రాశారు. అలాంటి స్మృతి కవితల్ని ఈ వ్యాసంలో పరిశీలిద్దాం.

ఆధునిక యుగంలో వేగం సంతరించుకోవడానికి పారిశ్రామిక విప్లవానికి ఎంతోమంది శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలు ఆలంబనలు. శాస్త్రవేత్తలు కనిపెట్టిన విషయాలు వల్ల విప్లవాత్మక మార్పులు సంభవించాయి. శాస్త్రవేత్తలు ప్రపంచ సంపద. మన దేశానికి చెందిన కల్పనా చావ్లా గొప్ప అంతరిక్ష శాస్త్రవేత్త. అంతరిక్ష పరిశోధనలో భాగంగా నింగిలోకి వెళ్లిన ఆమె, తిరిగి నేలకు రాలేదు. ఆ పరిశోధనలో భాగంగా ఆమె ప్రాణాలు కోల్పోయింది. ప్రపంచం నివ్వెరపోయింది. మన దేశం కూడా దిగ్భ్రాంతికి గురైంది. ఆమె స్మృతిలో తెలుగు కవులు కవితలు రాశారు.

ఎమ్మెస్ సూర్యనారాయణ అనే కవి 'కల్పనా రోహిణి' అనే కవితలో రాశారు. 'ఆకాశంలో సగం' స్త్రీలు అంటారు. కానీ 'కల్పన' మహోన్నతంగా విస్తరించేందుకు గొప్ప ప్రయత్నం చేసిందని కొనియాడారు.

*శూన్యంలో*
*సగం వాటా కోసం కాదు*
*మహాకాశంలో*
*మహోన్నతంగా*
*విస్తరించేందుకే*
*పరితపించి వుంటావు!*
*జీవితాన్ని అర్థవంతం చేసేందుకే*
*నిన్ను నువ్వు నిరూపించుకుని వుంటావు*

(శబ్దభేది, పుట. 33)

ఇంకా కవి 'కల్పన' చిన్నప్పటి నుంచి చూసిన చుక్కల లోకాన్ని అందుకునే క్రమంలో ప్రాణాలు వదిలింది. చుక్కల గౌను తీసుకుని కన్న కల 'తేలిక' పడిందని బాధ పడ్డారు.

*కల్పనా!*
*చిన్నప్పుడు నువ్వు*
*చుక్కల గౌను వేసుకున్నప్పటి నుంచీ*
*చుక్కల లోకం*
*చూద్దామనుకుని వుంటావు!*
*అద్భుత అంతరిక్ష కల్పనా...*
*ఎంత తేలిక పడ్డావు!*

(శబ్దభేది, పుట. 33)

శిఖామణి కల్పన స్మృతిలో రాసిన కవిత 'గగన కుసుమం'. ఇది చాలా ఉదాత్తమైన దాదాపు 50 పాదాల కవిత. శిఖామణి కవిత 'ఎత్తుగడ'లో మామూలుగా ప్రారంభించినా... ముగింపులో గొప్ప చాతుర్యం ప్రదర్శిస్తాడు. ఈ కవిత ప్రారంభంలో కవి, కల్పనని... దిరిసిన పువ్వుగా, లేలేత చెంగల గరికపోచగా, మాఘమాసపు మధ్యాహ్నవేళ

నేలరాలే పసుపు పచ్చ గన్నేరు పువ్వుగా చెప్పుకొస్తాడు. అంటే 'స్త్రీ' అంత సున్నితమైనదని కవి భావం. కానీ కల్పన రోదసిమెట్లు ఎక్కింది. అప్పుడు కవికి కల్పన 'వజ్ర వనిత'గా కనిపించింది.

*నువ్వు*
*ఉత్త దిరిసెన పువ్వువే*
*అనుకున్నాను*
*శీతాకాలపు*
*పొద్దు పొడుపువేళ మంచు ఆవిరికే*
*శిరసు శిఖరాగ్రం వొంచే*
*వేవేలు చెంగల గరిక పోచవే అనుకున్నాను*
... ... ...
*కానీ విశ్వరహస్యాలను ఛేదించడానికి*
*ఆత్మ విశ్వాసమే చోదక శక్తిగా*
*నీవు రోదసి మెట్లు ఎక్కుతున్నప్పుడు*
*నీలో అజేయమూ అమేయమూ అయిన*
*వజ్ర వనితను చూశాను*

*(నల్లగేటూ నంది వర్ధనం చెట్టు, పుట. 14-15)*

ఎల్లలు లేని ఆకాశంలోకి కల్పన వెళ్లాలనుకుంది. పెంజీకట్ల కావలకు ప్రయాణం కట్టింది. రోదసిలో విహరించి, నేలపై సగర్వంగా అడుగుపెట్టాలని ఆశించింది. భారరహిత వాతావరణంలోకి వెళ్ళిన 'కల్పన' దు:ఖభారాన్ని మిగిల్చిందని కవి ఆక్రోశించాడు.

కళ్ళనిండా ఆశ్చర్యంతో
దోసిళ్ళ నిండా పూల గుత్తులతో
మేం నీ రాక కోసం ఎదురు చూస్తుంటే
నువ్వు వినువీధిని అనంతశయ్యను
చేసుకుని విశ్రమించావు
మాకు ఎప్పటికీ అందని గగన కుసుమం అయ్యావు
ఏ అపరాత్రి వేళో
రహస్యంగా
నేలకు జాలువారే వెన్నెల సొనలో
నీ కన్నుల కాంతిని పోల్చుకుంటాం
వర్షాకాలపు
సోమరి సాయంకాలపు నీరెండ వేళ
ఇలకు వొంగే ఇంద్రధనస్సులో
నీ మృదు దరహాసాలను చూస్తాం

(నల్లగేటూ నందివర్ధనం చెట్టు, పుట. 15-16)

దేశమంతా ఆమెకోసం ఎదురు చూసింది. కానీ ఆమె ఆకాశ వీధిని 'మరణశయ్య'గా చేసుకుంది. గగన కుసుమంగా మారింది. వెన్నెలసొనలో సాయంకాలపు నీరెండ వేళలో కిందకు వంగే హరివిల్లులో నీ జ్ఞాపకాలన్నీ వెతుక్కుంటాయని కవి ఆశిస్తున్నాడు. ఇక ముగింపులో కవి

*ఇప్పుడు*
*ఆకాశంలో ఏ మూల*
*ఏ తార తళుక్కుమన్నా*
*మా కల్పనా చావ్లాయే అనుకుంటాం*

*(నల్లగేటూ నందివర్ధనం చెట్టు, పుట. 16)*

మరణించిన వారంతా ఆకాశంలో నక్షత్రాలుగా మారతారని బాల్యంలో... పెద్దలు చెప్పిన విషయాన్ని కవి ఇక్కడ ఆవిష్కరించాడు. అందుకే అంతరిక్షంలోని కొన్ని కోట్ల తారకలలో కల్పన చేరింది. ఇప్పుడు ఏ తార మెరిసినా అది కల్పన చావ్లాయే' అని కవి భావిస్తున్నాడు.

కవయిత్రి చిల్లర భవానీ దేవి కల్పన స్మృతిలో రాసిన కవిత 'ఓ తారకా'. కల్పన చావ్లా అంతరిక్ష ప్రయాణం పదహారు రోజులపాటు సాగి, ఆ రోజు భూమికి చేరుకోబోతుంది అనే ఆనందం అందరిలోనూ వెల్లివిరిసింది కానీ దురదృష్టం వెక్కిరించి, ఆమె దుర్మరణం చెందింది.

*ఆకాశంలో.. పేగు బంధానికి దూరంగానా...*
*విజయోత్సవం*
*పదహారు రోజుల పాటు*
*ఆనందాల వెల్లువగా*
*భూమాత కౌగిట్లో వాలేందుకు తపించిన క్షణం*
*నీటి బుడగలా మాయం*

*(భవాని కవిత్వం-2, పుట. 33)*

అంటూ 'కల్పన'ను స్మరించుకుంది. 'కల్పన'లానే 'కల్పనా చావ్లా' జీవితం ముగిసిందని ఆవేదన చెందింది.

అమెరికాకు చెందిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుడిపై కాలుమోపిన మొదటి మానవుడు. వ్యోమగామి. అంతరిక్ష చోదకుడు. జూలై 20, 1969 జాబిల్లిపై అడుగు పెట్టాడు. ఆయన ఆగస్టు 25, 2012న మరణించారు. ఆయన స్మృతిలో ఎమ్మెస్ సూర్యనారాయణ 'నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్' అనే స్మృతి కవిత రాశారు.

*అలల చేతులు చాచి*

కవిత

## చెదపురుగులు

- డా. కె.జి. వేణు,
98480 70084



దేశానికి ఫొటో తీస్తే
అన్నీ ఎముకలే
కెమెరా కన్ను లోపల
దేశం దేహన్ని తింటూ
వాగ్దానాల చెద

*దేవుడి బొమ్మ*
*గీస్తున్నాను*
*రంగులతో దేవుడి బొమ్మ*
*చిత్రం పూర్తయింది*
*చిత్రంగా ఆ చిత్రం నిండా*
*నా దేశం రైతన్న!*

*పున్నమిని అందుకోవాలని*
*అనాదిగా అతని కాంక్ష*
*కానీ*
*తన అర్ధానుస్వారంలో*
*వెన్నెల ఇమడలేదు*
*అందుకనే కాబోలు*
*చిరదీక్షా తపస్సముద్రుడు*
*నా మానవుడై*
*నీల్ ఆర్మ్ స్ట్రాంగై*
*జాబిలిని జయించాడు*

*(శబ్దభేది, పుట. 23)*

అనాదిగా చూస్తున్న చంద్రుడిని అందుకోవాలని, ఎంతోమంది కలలు కన్నారు. పున్నమిని తాకాలని ప్రయత్నించారు. కవి, మానవుడి కల... నీల్ ఆర్మ్‌స్ట్రాంగై నెరవేరిందని ఆనందపడుతున్నాడు. నీల్‌ను 'చిరదీక్షా తపస్సముద్రుడిగా తల్చుకున్నాడు.

"డాక్టర్ వర్గీస్ కురియన్" శ్వేత విప్లవ పితామహుడిగా మనకు తెలుసు. భారతదేశాన్ని పాల ఉత్పత్తిలో మొదటిస్థానంలో నిలబెట్టడంలో ఆయన కృషి అనిర్వచనీయం. ఆయన తన 90వ ఏట కన్నుమూశారు. ఆయన స్మృతిలో 'లకుమ' అనే కవి 'క్షీర విప్లవ పితామహుడు' అనే కవిత రాశారు.

*శరీరం పాంచ భౌతికం*
*కురియనూ పాంచ భౌతికమే*
*అట్లా, కురియన్ భౌతికంగా లేరు*
*ఇట్లా కురియన్ భౌతికంగా ఉన్నారు!*
*కురియన్ –*
*పాలల్లో, పాల పొదుగుల్లో, పాలు పితికే పాత్రల్లో*
*పాలకేన్లలో, పాల వ్యాన్లలో*
*పొంగే పాలలో, తాగే పాలలో, తేన్చే పాలలోనూ వున్నారు*

*(విశాలాక్షి మాసపత్రిక, నవంబర్–2015, పుట. 16)*

కురియన్ భౌతికంగా లేకపోయినా... 'పాలు' కనిపించిన ప్రతిచోటా కవికి 'కురియన్' గుర్తుకొస్తున్నాడు. పసిపాపలు తాగే పాలల్లో, పాల పెదవుల్లో పాపల ఎదుగుదల్లో కురియన్ ఉంటారని... కవి ఆకాంక్షిస్తున్నాడు.

*పుట్టింది మొదలు చచ్చేవరకూ*
*మనతో ఉండేది నీళ్ల తర్వాత పాలే*
*ఐదేళ్ల వయస్సులో అమ్మ పాలను మరపించిన దగ్గర్నుంచి*
*కురియన్ – మన ఆలనా 'పాల'నను*
*స్వచ్ఛందంగా స్వీకరించాడు*
*ఒక క్షీర విప్లవ పితామహుణ్ణి*
*అందునా ఒక భారత రత్నాన్ని*
*'భారతరత్న' అని సంబోధించడానికి*
*ఒక కేంద్ర ప్రభుత్వ అనుమతి అవసరం అని*
*నేను అనుకోవడం లేదు*
*ఒక అనధికార శాసన కర్తగా*

భారతీయ పాల ఉత్పత్తికి ఎంతో కృషి చేసిన... కురియన్‌కి భారతరత్న రాకపోవడం కవిని బాధించింది. అయినా కవి అనధికార శాసనకర్తగా... కురియన్‌ను భారతరత్నగా సంబోధించి... తనను తాను సంతృప్తి పరుచుకున్నాడు.

**కవిత**

# చూస్తావేమిటి భయ్యా

- ఏటూరి నాగేంద్రరావు
7416665323

ఎందుకో రాయాలనిపిస్తుంది
ఈ కాలం గురించో, నా గురించో,
లేదూ నీ గురించో,
గుంపులోంచి అదృశ్యమైన వ్యక్తి గురించో,
రోడ్డుమీద పడిపోయిన
నా మాదిరే వున్న, నాలాగే వున్న
మనిషి గురించో!

బహుశా అక్కడ పడిపోయింది నేనేనేమో!
ఎందుకు వీళ్ళ మధ్యన జెండాలూపుతున్నాను
వాళ్ళ మధ్య కూర్చుని కలో, గంజో తాగుతున్నాను
ఈ సమూహంలో, ఈ గుంపులో, ఈ శిబిరంలో
నేనో బికారినో, లేదూ ఫకీరునో కావచ్చు
బాబూ! ఇంకో రొట్టె వెయ్యవయ్యా
నిన్ను కన్నతల్లి చల్లగుండ!
చూస్తావేమిటి భయ్యా!
నువ్వూ ఓ రొట్టె వేయించుకో!
అరిచి అరిచి నీ గొంతు బొంగురు పోయింది.
ఇంత సున్నం రాస్తానుండు.

ఈ పరిహాసం లో ఏకాకివే నువ్వు.
ఇదిగో khaini తింటావా!
సాగరూ, నీకు అలవాటు లేదనుకుంటా!
ఆ నిషా వుంది చాలదూ!



దుప్పట్లో చుట్టిన శవాలకు రంగులు వేస్తున్నారు!
అవి గాల్లోకి ఎగరాలని ఆశ పడ్తున్నాయి
ఈ దీపాలు కూడా నిశ్శబ్దంగా మూలుగుతున్నాయి

ఎవరి దుఃఖం ఎవరికి కావాలి!
ఈ వాల్ పోస్టర్‌కి ఎంతసేపలా కొట్టుకుంటావ్!

ఈ జీవిత కాలానికి సెలవు లేదు!
భరించడం నేర్చుకో!
దేశంలో అందరూ నిత్యం చస్తున్న శవాలే!

## దళిత కథా వార్షికకు కథల ఆహ్వానం

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో 1 జనవరి 2020 నుంచి డిసెంబర్ 31, 2020 వరకు వివిధ దిన, వార, పక్ష, మాస పత్రికల్లోనూ, అంతర్జాల పత్రికల్లోనూ ప్రచురించబడిన దళిత కథలు నుంచి ఎంపిక చేయబడిన కథలతో దళిత కథావార్షిక 2020 పేరిట కథా సంకలనం ప్రచురించాలని సంకల్పించాము. కావున దళిత కథకులు తమ కథలను ఫాంట్ సైజ్ 15తో అను పేజీ మేకర్ ఓపెన్ ఫైల్, పిడిఎఫ్ లేదా యూనికోడ్ ఓపెన్ ఫైల్ పంపించగలరని కోరుతున్నాం. ఈ కింద ఈమెయిల్‌కు జనవరి 10, 2021 లోపల పంపగలరని కోరుతున్నాము.

Email: sygiri773@gmail.com

**ఫోన్లు : 94412 44773, 94933 19878, 94416 41702**

**సంపాదకులు : డా. సిద్దెంకి యాదగిరి, గుడిపల్లి నిరంజన్, తప్పెట ఓదయ్య.**

**కథ**

# సంకల్పం



**- గన్నవరపు నరసింహమూర్తి**

**ఆ** రోజు ఆదివారం. ప్రత్యూషపు వేళ లేచి బయట కొచ్చాను. బయట చాలా విశాలమైన ప్రదేశం... చుట్టూ పొడవైన చెట్లు.... మధ్యలో మా బంగ్లా... చింత, పాసి, వేప, నేరేడు, జామి... ఇలా ఎన్నో పెద్ద పెద్ద నీడనిచ్చే చెట్లు. ఆ చెట్ల నీడలో ఒక ఉయ్యాల... కాసేపు కూర్చోని ప్రకృతిని గమనించసాగేను. ఆ తోటలో రకరకాల పక్షులు ఆకాశంలోకి ఎగురుతూ కనిపించాయి. నీలాకాశంలో ఎగురుతున్న కొంగలబారు తెల్లటి పూలదండలా కనిపిస్తోంది.

ఇంతలో నా భార్య మాధురి టీ పట్టుకొని అక్కడకు వచ్చింది. అది ఎప్పుడో బ్రిటిష్ వాళ్ళు కట్టిన సబ్ కలెక్టర్ బంగ్లా. వంద సంవత్సరాల పురాతనమైనది. సువిశాలమైన ఐదెకరాల స్థలంలో కట్టబడింది.

నేను రెండేళ్ళ క్రితం డిగ్రీ పూర్తయిన తరువాత సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాసి ఐయ్యేయస్‌కి ఎంపికయ్యాను. ముస్సోరిలో శిక్షణ పూర్తి చేసుకున్న తరువాత నన్ను ఆంధ్రా కేడర్‌కి ఈ రెవెన్యూ డివిజన్‌కి సబ్ కలెక్టర్‌గా పోస్టింగిచ్చారు. నేను పనిచేస్తున్న రెవెన్యూ డివిజన్ ఒడిశా బోర్డర్‌కి దగ్గరగా ఉంటుంది.

మాధురీ, నేనూ ఓ అరగంటసేపు ఆ తోటలోనే కబుర్లు చెప్పుకుంటూ నడుస్తుంటే ఆ ప్రభాత సమయంలో చాలా ప్రశాంతంగా అనిపించింది. కొంచెం సేపటి తరువాత మాధురి పనుందంటూ బంగ్లాలోకి వెళ్ళిపోయింది.

నేను ఉయ్యాల ఊగుతూ ఆరోజు దినపత్రిక తిరగవేస్తుంటే.. జిల్లా ఎడిషన్‌లోని ఒక వార్త నన్ను ఆకర్షించింది. 'పదిళ్ళున్న గిరిజన గ్రామానికి రూ.5 కోట్లు ఖర్చు పెట్టి వేసిన రోడ్డు అవినీతి వల్ల పూర్తి కాని వైనం.. ఉన్నతాధికారుల మౌనం...' అన్న శీర్షిక కింద వివరాలు ఇలా రాసి ఉన్నాయి : 'ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన' పథకం కింద జిల్లాకి మంజూరైన పది రహదారుల్లో ఒకటి గన్నేరు నుంచి గిరిజన గ్రామం జన్నిగూడకి వేసిన 15 కిలోమీటర్ల రహదారి. దీనికి ప్రభుత్వం రూ.5 కోట్లు ఖర్చు చేసింది. ఈ రహదారిని గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ విభాగం నిర్మించింది. కానీ ఈ రహదారి 12 కిలోమీటర్ల దూరం వరకే పూర్తయింది. మిగతాది ఎందుకు నిర్మించలేదనీ ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నిస్తే నిధులు సరిపోక ఆపి వేయాల్సి వచ్చిందని చెప్పారు. ఈ విలేఖరి మొన్న ఆ రహదారి మీద ప్రయాణించినపుడు అది జన్నిగూడకు మూడు కిలోమీటర్ల దూరంలో అసంపూర్తిగా ఆగిపోయి ఉంది. దీంతో, దీనివల్ల ఆ ప్రాంత గిరిజనులకు ప్రయోజనం అందకుండా పోయింది. నిజానికి ఆ మూడు కిలోమీటర్లు రహదారి ఆ తండా చేరుకోవడానికి ఎంతో

ముఖ్యం. లేకపోతే ఆ రహదారి నిర్మించిన ప్రయోజనం ఆ గ్రామానికి కలగదు. ప్రభుత్వం ఈ విషయంలో సరైన చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు. ఇంతకీ పదిళు ్ళన్న ఆ తండాకి రహదారి కోసం రూ.5 కోట్లు ఖర్చు పెట్టడం ఏ విధంగా సబబో అధికారులు చెప్పాలి". ఆ వార్త పక్కనే ఆ రహదారి ఫొటో కూడా వేసారు.

ప్రస్తుతానికి ఐటిడిఎ పీవో బదిలీ కావడంతో నాకే ఆ బాధ్యత కూడా అప్పచెప్పారు. నాకెందుకో ఆ రహదారి విషయంలో ఏదో తప్పు జరిగినట్లపించింది.
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్‌ని ఆఫీసులో నన్ను కలవమని చెప్పాను. 11 గంటల ప్రాంతంలో ప్రసాద్ వచ్చి నన్ను కలిసాడు. నేను ఆ వార్తను అతనికి చూపించి వివరాలు అడిగాను.

అతను ఆ వార్తని చదివిన తరువాత .. "సార్! ఆ రోడ్డు కోసం రూ.8 కోట్ల ఫండ్ కావలసి ఉండగా రూ.5 కోట్లే మంజూరు చెయ్యడంతో 3 కిలోమీటర్ల రహదారి మిగిలిపోయింది" అన్నాడు.

"మిస్టర్ ప్రసాద్! ఫండే చాలకపోతే ఆ రహదారిని నిర్మించకూడదు.. సగం వేసి వదిలేస్తే అది ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడుతుంది చెప్పండి? ఇందుకే మన మీద ప్రజలకు నమ్మకం పోతోంది. ఈ విషయంలో మీ మీద ఎందుకు చర్య తీసుకోకూడదు చెప్పండి? మనం ఏది చేసినా ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. మనం తీసుకొనే జీతాల దగ్గర్నుంచీ ప్రతి పని మీద ఖర్చు పెడుతున్న డబ్బు వరకు అంతా ప్రజల సొమ్మే.." అన్నాను కోపంగా.

ప్రసాద్ మౌనం దాల్చేడు. "ఈ పథకంలో రహదారి నిర్మించేటపుడు సమగ్రమైన సర్వే చేయాలి. ఈ పేపరు వార్త ప్రకారం ఆ రహదారిని పదిళ్ళున్న గ్రామం కోసం నిర్మించారు. 5 కోట్లతో నిర్మిస్తున్నపుడు చుట్టు పక్కల ఓ పది గ్రామాలకు ఉపయోగపడాలి కదా! సర్లెండి... రేపు నేను ఆ రోడ్డు చూద్దామనుకుంటున్నాను. మీ సిబ్బందితో మీరు రండి" అని చెప్పడంతో అతను వెళ్ళిపోయాడు.

***

ఆ మర్నాడు ఉదయం గంటలకు రెండు జీపుల్లో ఆ ఊరికి బయల్దేరాం. ఈఈ ప్రసాద్‌తో పాటు, తహసీల్దారు, రెవెన్యూ, ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు... అంతా వచ్చారు. కొంచెం సేపటి తరువాత ఏజెన్సీ ప్రాంతం చేరుకున్నాం. మేము వేసిన రోడ్డు మీద అరగంట సేపు జీపు ప్రయాణించింది. ఆ రోడ్డు నిర్మాణం సరిగ్గా లేదని నాకర్థమైంది.

"ప్రసాద్! ఈ రోడ్డు నిర్మాణ సమయంలో మీరెప్పుడైనా ఇన్‌స్పెక్షన్ చేసారా? నాణ్యత పరీక్షలు జరిపారా?" అనడిగాను జీపు దిగిన వెంటనే.

"రెండుసార్లు వచ్చాను సార్. నాణ్యత నిర్ధారణ పరీక్షలు కూడా చేయించాము.'

"ఇపుడు దీని నాణ్యత మనకి తెలీదు. వర్షాకాలం తరువాత తెలుస్తుంది."

"సార్! ఇక్కడి నుంచి ఓ మూడు కిలోమీటర్లు నడవాలి" అన్నాడు.

"అంటే పేపర్లో రాసింది నిజమేనన్నమాట. చూసారా? మనకంటే వాళ్ళే పరిశీలిస్తున్నారు. పూర్వంలా కాదు ప్రసాద్ గారూ... అవినీతి చేస్తే వెంటనే తెలిసిపోతోంది. చాలా జాగ్రత్తగా ఉండాలి. ఊరి దాకా రోడ్డు వెయ్యకపోతే 5 కోట్లు ఖర్చుపెట్టి ఉపయోగం ఏమిటి చెప్పండి? ఏ పని చేసినా ప్రజలకు ఉపయోగపడితేనే దాని సార్ధకత... మీరు చాలా తప్పు చేసారు" అని అతనితో గట్టిగా చెప్పాను. అతను మౌనంగా నడవసాగేడు.

అరగంట తరువాత మేము జన్నిగూడ చేరుకున్నాము. తహసీల్దారు, రెవెన్యూ ఇనస్పెక్టర్లు ముందుగా వెళ్ళి ఊళ్ళో వాళ్ళకు చెప్పడంతో .. వారు మమ్మల్ని చూసి బయటకు రావడం మొదలుపెట్టాడు.

నేను ఆ పరిసరాలను గమనించాను. ఆ తండా కొండవాలులో ఉంది. అక్కడక్కడ విసిరేనట్లు ఇళ్ళు.. ఒక నాలుగైదు పూరిళ్ళు, మిగతావి పెంకుటిళ్ళు. ఒక చింతచెట్టు కింద మంచం వేసాడు ఆ ఊరి సర్పంచ్ అని చెప్పుకున్న సహదేవ్. అతనికి ఓ యాభై ఏళ్ళుంటాయి. కళ్ళు ఎర్రగా ఉండి మనిషి తూలిపోతున్నాడు. బాగా తాగి ఉన్నాడని అర్థమైంది...

తహసీల్దార్ పేరు శ్రీధర్.

"శ్రీధర్! ఈ ప్రాంతం మీరెప్పుడైనా వచ్చారా?" అనడిగాను.

అతను కాసేపు మౌనంగా ఉండి "సార్! నేనీ మండలానికి వచ్చి ఎనిమిది నెలలే అయ్యింది. అందుకే రాలేకపోయాను" అన్నాడు.

"ఎనిమిది నెలలంటే తక్కువ సమయం కాదు. ఒక తహసీల్దార్‌గా మీ మండలంలో ఉన్న మొత్తం 40, 50 ఊళ్ళకి కూడా మీరు వెళ్ళకపోతే ఎలా చెప్పండి? జీతాలెందుకు తీసుకుంటున్నాం? మనమే రాకపోతే ఎలా?" అని అడిగాను.

దూరంగా ఓ పదిమంది పిల్లలు తాటి టెంకలతో ఆడుతూ కనిపించారు.

"ఇక్కడ ఎన్ని ఇళ్ళున్నాయి' అని తహసీల్దార్ని అడిగాను. 'మన లెక్కల ప్రకారం ఇరవై ఇళ్ళుండాలి...' అనీ అతను చెబుతుండగా, దూరం నుంచి ఒక యువకుడు వస్తూ కనిపించాడు. అతని వెనకాల పదిమంది పిల్లలు, కొందరు పెద్దవాళ్ళు వస్తున్నారు.

అతడు వస్తూనే నాకు నమస్కారం పెడుతూ "నాపేరు పోలన్న దొర. ఇక్కడ ఏకోపాధ్యాయ పాఠశాల ఉపాధ్యాయుణ్ణి' అని పరిచయం చేసుకున్నాడు.

"ఇక్కడ స్కూలుకి భవనం కట్టారా? ఎంతమంది పిల్లలు చదువుతున్నారు?" అని అడిగాను.

"సార్... ఇక్కడ ఉన్నవే పదిహేను ఇళ్ళు. ఒకపుడు పాతిక దాకా ఉండేవి. ఐదేళ్ళ క్రితం డెంగీ జ్వరాలచ్చీ ఓ పదిమంది దాకా చనిపోతే ఓ పదిళ్ళవాళ్ళు ఇక్కడకు దూరంగా వెళ్ళిపోయి అక్కడ కట్టుకున్నారు. ప్రస్తుతం రెండూళ్ళ వాళ్ళు కలిసి ఓ పాతికమంది దాకా పిల్లలు వస్తుంటారు. రిజిస్టర్లో ఏభై దాకా పేర్లున్నా చాలామంది పెద్దవాళ్ళైపోవడంతో వాళ్ళెవరూ రారు.. " అని చెప్పాడతను..

"మీదే ఊరు?"

"నేను కూడా గిరిజనుణ్ణే. ఇక్కడికి పాతిక కిలోమీటర్ల దూరంలో మా తండా ఉంది" అని చెప్పాడు.

"ఈ రోడ్డు వేస్తే మీకుపయోగమేనా?" అని సర్పంచ్‌ని అడిగాను. అతను మత్తులో ఉండటం వల్ల ఏమీ చెప్పలేకపోయాడు. ఇంతలో ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వాళ్ళిద్దరూ సన్నగా, బక్కగా ఉన్నారు. చెవులకు కాడలతో, చిన్న జుట్టుతో, మెడలో పూసలదండలు...

'శ్రీధర్ ! వీళ్ళంతా ఎవ్వరు?"

"సార్! మన జిల్లాలో చెంచులెక్కువ. కొద్దిగా మిగతా గిరిజన జాతులున్నాయి. వీళ్ళు పోడు వ్యవసాయం చేసుకొని బతుకుతుంటారు. మన అడంగులు ప్రకారం ఈ గ్రామంలో 200 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. రాగులు, జన్నలు, కొద్దిగా వరి పండిస్తుంటారు. వర్షాధారం" అనీ రికార్డు చూసి చెప్పాడు.

ఆ ఇద్దరి రైతుల్లో ఒకర్ని 'నీ పేరు' అని అడిగాను.

'బిడ్డిక దొర'

'నీకెంతపొలం ఉంది...?'

'బాబూ! నాకు ఐదెకరాల పొలం ఉంది.'

'నీటి సదుపాయం ఉందా?'

'ఆ ఇసయం సెప్పడానికే వొచ్చాము దొరా. రోడ్డు పడితే మా ఊరికి మంచిదే కానీ అంతకన్నా మా సెరువులు తవ్వితే బోలేడు నీళ్ళు నిలవుంతాయి. ఆపుడు మా పంటలకు డోకా ఉండదు. కొండ గెడ్డకు సెక్‌డాములు కడితే సెరువులు నిండుతాయి. ముందు కడుపులు నిండితే అపుడు రోడ్లు" అన్నాడు బిడ్డికదొర.

అతని మాటలు నాకు చెంప చెళ్ళుమనిపించేటట్లు తగిలాయి. ఇంతలో రెండో వ్యక్తి ముందుకు వచ్చి "నా పేరు రామన్నదొర. మా ఊరోళ్ళమంతా రోడ్డెయ్యక ముందు పీవో గార్ని కలిసి సెరువు, సెక్ డామ్‌లు కట్టమని సెప్పాము. రోడ్డు సేంచనైంది. తరువాత సెరువులు పని సూద్దామనీ సెప్పినారు" అని చెప్పాడు.

ఆ తరువాత ఆ ఊరు స్కూలుని, దూరంగా కట్టుకున్న కొత్త ఊరుని చూసి తిరుగు ప్రయాణమయ్యాం. వెళ్తున్నపుడు అగమ్య గోచర స్థితిలో ఉన్న నాకు వస్తున్నపుడు గమ్యం కనిపించింది.

***

"ఇది నేను అయ్యేయస్ పూర్తి చేసుకొని కొత్తగా సబ్ కలెక్టర్‌గా చేరినపుడు ఎదురైన చాలా పెద్ద సమస్య. మొదట్లో ఏ విధమైన అభివృద్ధికీ నోచుకోని రెవెన్యూ డివిజన్లో పోస్టింగ్ వచ్చినందుకు నాతో సహా మా కుటుంబ సభ్యులు నిరాశపడ్డారు. ఈ సంఘటన నా దృక్పథాన్ని మార్చి వేసింది. పేద గిరిజనులకు సహాయం చేసే అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనే ధృడసంకల్పం నాలో మొదలైంది. దాన్నొక ఓ ఛాలెంజిగా తీసుకున్నాను.

ఆ తరువాత ఒక అద్భుతమైన బృందాన్ని తయారు చేసాను. అంతవరకు స్తబ్దుగా ఉండే శ్రీధర్ లాంటి తహసీల్దార్లు, ప్రసాద్ లాంటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతోనే పని చేయించి అద్భుతాలు సృష్టించాను. మొదటగా జన్నిగూడలో పెద్ద చెరువు తవ్వించాను. కొండగెడ్డకి రెండు చోట్ల

## కవిత

# స్తబ్ధకోశం

**- డాక్టర్ ఎన్.గోపి**



ఎప్పుడు పోతుందో ఈ కోవిడ్!
ఎవరి చూపులూ స్థిరంగా లేవు
ఎవరి బతుకులూ స్థిమితంగా లేవు
కవిత్వం రాయక మూడు నెలలైంది
భావుకలోకంలో దివాళా
ప్రతి చిన్న కదలికా ఒక జల్‌జలా

ఎందరో మిత్రులు నిష్క్రమిస్తున్నారు
ఏ నిజమూ హజం కావటం లేదు
ఆర్థిక చక్రాలు కట్‌కటాయిస్తున్నాయి
ఫోన్ చేద్దామంటే సంకోచం
అవతలి పక్క హాలత్‌లెట్లున్నాయో!
శరీరాలు పంపే సంకేతాలు
కొత్తగా పరమ చెత్తగా ఉన్నాయి
నీడను కూడా శానిటైజ్ చేసుకుంటున్నారు
మా అమ్మాయి వార్తాపత్రికను
ఇస్త్రీ చేసి చదువుకుంటున్నది!

వివాహాలు జరుగుతూనే ఉన్నాయి
వివాదాలు ముదురుతూనే ఉన్నాయి
అంతా సజావుగానే
కుదురుకున్నట్టు భ్రమ
నెలలకమానం

ఇంట్లో ఉండటమంత దరిద్రం
మరొకటి వుండదు
కొలువుకు పోయిన కుర్రోడు
ఎట్లా తిరిగొస్తాడో తెలియదు

ఎంతందంగా ఉండేది జీవితం!
ఇప్పుడు అర్థవిహీనంగానూ సతమతం
ఇవాళ సూర్యుడు రాలేదు
క్వారంటైన్‌లో ఉన్నాడేమో!
నాకైతే కవిత్వం పుట్టడం లేదు
ఎవరికోసం అనే
సినిసిజం ఆవహిస్తున్నది!

తప్పదింక
జూలు దులుపుకోవాలి
ఈ స్తబ్దాన్ని శబ్దంగా మార్చుకోవాలి
చెదిరిన కిరణాల్ని ఒక్కచోట చేర్చాలి

---

చెక్‌డామ్‌లు కట్టి ఆ నీటిని చెరువుకి మళ్ళించాము. సంవత్సరం తరువాత ఆ ఊళ్ళో రెండేసి పంటలు పండించటం మొదలు పెట్టారు. అదే పద్ధతిలో అన్ని గిరిజన గ్రామాలకు, మామూలు గ్రామాలకు చెరువులు తవ్వించాము. విరివిగా చెక్‌డాములు నిర్మించాం. రహదారులు, స్కూలు భవనాలు, మంచి నీటి బోరింగులు, పైపులద్వారా మంచినీటి సరఫరా, ప్రతి ఇరవై గ్రామాలకు ఒక హాస్పిటల్, ప్రతి వారం నర్సులు గ్రామాన్ని సందర్శించే ఏర్పాటు చేసాము. దృఢసంకల్పం ఉంటే ఎంత పనైనా చెయ్యొచ్చొని ఆ విధంగా రుజువైంది.

దాంతో గ్రామాల పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఇపుడా మండలం రాష్ట్రంలోనే అభివృద్ధిలో నెంబర్ వన్‌గా మారింది. ఈ ఫలితాలు రెండేళ్లలోనే సాధించాను. నాకు బదిలీ అయిందన్న వార్త తెలిసి సుమారు వెయ్యిమంది మా ఆఫీసుకొచ్చి బదిలీ రద్దు చెయ్యమని దీక్ష చెయ్యడం... నా కృషి ఫలితాలనిచ్చిందన్న దానికి సాక్ష్యంగా నిలిచింది. కాబట్టి మనం ఏ పనిచేసినా ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలి. సముద్రం ఎంత పెద్దదైనా అందులో ఈదే చేపపిల్ల కన్నా చిన్నదే. ఆకాశం ఎంత గొప్పదైనా గాలిలో ఎగిరే పక్షి కన్నా తక్కువే."


ఆ రోజు రాజేష్ ఆ జిల్లా కలెక్టరుగా జాయినైన సందర్భంగా సిబ్బంది అతనికి స్వాగతం పలికినపుడు అతను వాళ్ళనుద్దేశించి మాట్లాడిన మాటలివి. ఆ మాటలు విన్న తరువాత ఆ హాలంతా చప్పట్లతో మార్మోగిపోయింది.

కవిత

# పోరాటం సెగకు చలి వెచ్చనవుతుంది

- డాక్టర్ కత్తి పద్మారావు
984741695

ఉదయ కాలాన్నే మంచు తెరలు
అంతర్గత ఒప్పందాలు ఎన్నో నడుస్తున్నాయి
ఢిల్లీ భవనంలో ఏదో విష కౌగిలి
దృశ్యమానం అయ్యింది
అనేక జీవితాల్లో నాటకమే ముఖ్యం
జీవితం రాను రాను డొల్లగా మారుతుంది
అతని కళ్ళల్లో విపరీతమైన ద్వేషం
దేశాన్ని రొట్టెముక్కల్లా చేస్తున్న ఆనందం
ఆత్మీయతను, ఐక్యతను విచ్ఛిన్నం చేయడమే
వారి కార్యాచరణ
సెలబ్రిటీస్ ముఖాలకు పార్టీ రంగులు పూస్తున్నారు
వారి వెనుక దాగున్న ఆర్థిక నిధుల
రక్షణ కోసమే సుమా!
ఆ నృత్యహేలల్లో జీవిత సత్యాలన్ని నిర్లిప్తమౌతున్నాయి
మాతృత్వం గుండెల మీద గొడ్డలి వేటు
స్త్రీ శరీరం కనిపిస్తే చీల్చి చెండాడుతున్న ఉన్మాదులు
మంచు తుంపరులు వర్షంలా కురిశాక
తెల్లతెల్లవారుతున్నప్పుడు ఒక చెట్టు పూలు రాలుస్తుంది
నేలపై ముత్యాలు కురుస్తున్న చప్పుడు
ఎవరి కళ్ళో మెరుస్తున్నాయి
చరిత్రను ఎవరో కాళ్ళతో చెరిపేసి
అబద్ధపు కథలు రాస్తున్నారు
ఈ బుర్ర లేని కథలు మనుషులను
పక్కదారి పట్టిస్తున్నాయి
శాస్త్రం వక్రీకరించబడింది
ఢిల్లీ తీరంలో రైతు పోరాటం
పోరాటం సెగకు చలి వెచ్చనవుతుంది
రైతులంటే నేలపుత్రులు
భూమిని చీల్చి పుట్టినవాళ్ళు
భూసారాన్ని గుండెలకు ఎక్కించుకొన్నవారు
వారి పోరాట స్ఫూర్తి
భారతావని అంతా అల్లుకొంటుంది
కార్పొరేట్ ఆధిపత్యానికి ఎదురు నిలుస్తుంది
దు:ఖం మతాతీతం అని నిరూపిస్తుంది
జీవితం, సంఘం, మార్కెట్ వస్తువులు కాదు
నేలపై, విత్తుపై ఆధిపత్యాన్ని నిరాకరిస్తున్నారు



నిజమే! కార్పొరేట్ విస్తరిస్తుంది
దు:ఖ భారతాన్ని నిర్మిస్తుంది
జీవించే హక్కుపై ఉక్కుపాదం మోపుతుంది
ఆ తల్లి పోరాట శిబిరంలో
నిప్పుల కుంపటిపై రొట్టెలు కాలుస్తుంది
ఆమె కళ్ళల్లో సూరీడు పొడుస్తున్నాడు
పోరాట శిబిరం ఎప్పుడూ ఒక స్ఫూర్తి ప్రదాతే
తరతరాల స్వాతంత్ర్యాన్ని కాలరాస్తున్న శాసనాలను
రద్దు చేయాలనే ఉద్యమ దుందుభి మ్రోగుతోంది
అవును! కరోనా ఇంకా వెంటాడుతూనే వుంది
ఎవరో తల్లి బిడ్డ కోసం ఆరాటపడుతుంది
కొడుకు సుదూరాల్లో ఉన్నాడు
భర్త ఓదార్చలేకపోతున్నాడు
వైరస్ ఎన్నో భంగిమల్లో విజృంభిస్తుంది
మంచుతెరల్లో అనేక పరిణామాలు జరుగుతున్నాయి
సూర్య కిరణాలు భూమిని
తాకడానికి భయపడుతున్నాయి
సంబంధాలు కృత్రిమంగా వున్నాయి
మనిషిని మర్చిపోవడం చిటికెలో జరుగుతుంది
స్మృతి మృగ్యం అవుతుంది
మనుషులు కులం పేరు చెప్పుకు బతుకుతున్నారు
ఏ కులం నుదుటి మీద రాసి లేదు కదా!
ఎందుకు వీరు కులం ముద్రలు వెతుకుతున్నారు
ప్రతిభలు ముళ్ళ కంచెల్లో ఇరుక్కుంటున్నాయి కదా!
ఆ చిన్నచేప ఒక్కటే
నీటి తరంగాల్లో ఈదుతూ వెళుతుంది
దానికి అసంతృప్తి లేదు
వెన్నెల తుంపరులు ఆ నదిపై సేదతీరుతున్నాయి
ప్రకృతి ఓ ప్రజ్వలన శక్తి
మంచు, వెలుగు, వెన్నెల
అన్నీ మనుషులకు ఆయువులు
సానుకూల దృక్పథమే మానవాభ్యుదయానికి మార్గం
ఉద్యమం విజయపతాక ఎగురవేయడం తథ్యం
పోరాటానికి అపజయం ఎప్పుడూ లేదు..!



# వ్యవసాయం స్వేచ్ఛామార్కెట్

- ప్రొ॥ ప్రభాత్ పట్నాయక్

మన వంటి పెద్ద దేశం ఆహార భద్రత కలిగి ఉండాలంటే ఆ తిండిని మనమే పండించుకోవాలి. మన భూముల మీద ఏ పంటలు పండించాలన్నది స్వేచ్ఛా మార్కెట్ శక్తులకు వదిలిపెట్టకూడదు. మన సమాజం సజావుగా నడవాలంటే ఏ పంటలు పండించాలన్న విషయంలో ప్రభుత్వ జోక్యం తప్పకుండా ఉండాలి. ఇటువంటి జోక్యం ఉండాలంటే ప్రభుత్వం ఆహార ధాన్యాల ధరలను కూడా నియంత్రించాలి. వాటిని స్వేచ్ఛా మార్కెట్ శక్తులకు విడిచిపెట్టకూడదు.

మోడీ ప్రభుత్వం తెచ్చిన మూడు వ్యవసాయ బిల్లులనూ రద్దు చేయాల్సిందేనంటూ దేశవ్యాప్తంగా రైతాంగం సాగిస్తున్న పోరాటంపై వ్యాఖ్యానిస్తున్న వారిలో అత్యధికులు రైతుల వైఖరిని బలపరుస్తున్నారు. కాని కొంతమంది మోడీ ప్రభుత్వాన్ని బలపరచకపోయినా, వ్యవసాయ రంగంలో స్వేచ్ఛా మార్కెట్ విధానం ఎందుకు ఉండకూడదన్న ప్రశ్నను లేవనెత్తుతున్నారు. దానికి సమాధానం ఇదివరకే చెప్పుకున్నాం ఈ సందర్భంలో మరోసారి చర్చించడం ఉపయోగకరంగా ఉంటుంది.

స్వేచ్ఛా మార్కెట్ విధానం మొత్తంగా ఆర్థిక వ్యవస్థకి మేలైన పరిష్కారం కాదని కీన్స్ ఇదివరకే నిరూపించాడు. అయితే ప్రస్తుతానికి కీన్స్ వాదనను కాసేపు పక్కన పెడదాం. రెండు ప్రత్యేక కారణాల రీత్యా ఏ పంటకు ఎంత ధర ఉండాలన్నది స్వేచ్ఛా మార్కెట్‌కు విడిచిపెడితే అది చాలా అనర్థాలకు దారితీస్తుంది. అలాగే ఏ వ్యవసాయ పంట ఎంత పరిమాణంలో పండించాలన్నది స్వేచ్ఛా మార్కెట్‌కు వదిలిపెట్టినా అది కూడా సమాజంలో పలు హానికర పరిణామాలకు దారి తీస్తుంది.

స్పష్టత కోసం రెండు అంశాలనూ విడివిడిగా చర్చిద్దాం. ఆహార ధాన్యాలు మాత్రమే వ్యవసాయంలో పండిస్తున్నారని అనుకుందాం. ఆహార ధాన్యాలకు డిమాండ్ దాని ధరతో నిమిత్తం లేకుండా ఒకే విధంగా ఉంటుంది. (మన ఆకలిని బట్టి ఆహారం తీసుకుంటాం తప్ప ఆహార ధాన్యం ధరను బట్టి కాదు కదా) అయితే ఆహార ధాన్యాల ఉత్పత్తి మాత్రం ప్రకృతి సానుకూలంగా ఉందా లేక ప్రతికూలంగా ఉందా అనే దానిని బట్టి ఆధారపడి మారుతూ ఉంటుంది. అందువల్ల ఆహార ధాన్యాల ధరలలో తరుచూ హెచ్చుతగ్గులు ఉంటాయి. ఇది ఆహార ధాన్యాలకే కాదు, ఏ వ్యవసాయ పంటకైనా వర్తిస్తుంది. ధాన్యానికి ధర తగ్గిపోతే రైతులు అప్పులపాలవుతారు. అదే ధర పెరిగితే వినియోగదారులు కొనలేక ఆకలి చావుల పాలవుతారు.

మహా మాంద్యం సమయంలో 1930 దశకంలో రైతులు విపరీతంగా అప్పుల పాలయ్యారు. అదే 1943 నాటి బెంగాల్ మహా క్షామం సమయంలో 30 లక్షల మంది ఆకలి చావుల పాలయ్యారు. ఈ రెండు సందర్భాలూ పంటలు బాగా ఎక్కువగా పండినందువల్లనో, లేక బాగా దెబ్బ తినడం వల్లనో వచ్చినవి కావు. మహామాంద్యం సమయంలో ధరలు పడిపోయినందు వల్ల వినియోగదారులకు కలిగిన ప్రయోజనం ఏమీ లేదు. అదే విధంగా బెంగాల్ కరువు సమయంలో రైతులకు అధిక ధరలేమీ దక్కలేదు. ఈ రెండు సంఘటనలూ సర్వ నాశనానికే దారితీశాయి.

స్వేచ్ఛా మార్కెట్ బాగా పని చేస్తుందని చెప్పి దానిని సమర్థించేవారు ఇటువంటి పరిస్థితులను ఏమాత్రమూ

ఊహించరు. ఒక వస్తువు ధర పెరిగితే దాని ప్రభావం తక్కిన రకాల సరుకుల మీద ఏమీ ఉండదనే వారు భావిస్తారు. తిండిగింజలు అనే తరహా సరుకులు ఉంటాయని వారు పరిగణనలోకి తీసుకోరు. తిండిగింజల ధరలు పెరిగితే దాని పర్యవసానంగా ప్రజలు తక్కిన ఇతర సరుకులను కొనుగోలు చేయగల శక్తిని కోల్పోతారని వారు కనీసం ఊహించరు. (ఒకానొక వస్తువు ధర పెరిగితే దాని డిమాండ్ తగ్గుతుందని, దాని ధర తగ్గితే డిమాండ్ పెరుగుతుందని, మొత్తం మీద చూసుకున్నప్పుడు మార్కెట్ సమతూకంలో కొనసాగుతుందని స్వేచ్ఛా మార్కెట్ సమర్థకులు వాదిస్తారు).

స్వేచ్ఛా మార్కెట్‌లో ఉండే సమతూకం ప్రభుత్వ జోక్యం కారణంగా దెబ్బ తింటుందని, అందుకే ప్రభుత్వం జోక్యం చేసుకోరాదని సదరు సమర్థకులు వాదిస్తారు. కాని ఆ వాదనలు పూర్తిగా అసంబద్ధం. ఆహార ధాన్యాల ధరలు హెచ్చుతగ్గులు లేకుండా స్థిరంగా కొనసాగడానికి ప్రభుత్వ జోక్యం అనివార్యం. అప్పుడే వినాశకర పరిణామాలు జరగకుండా నివారించడం సాధ్యమౌతుంది.

స్వేచ్ఛా మార్కెట్ గనుక అమలులోకి వస్తే వ్యవసాయంలో భూ వినియోగం పెరుగుతుందన్న వాదనను చూద్దాం. స్వేచ్ఛా మార్కెట్ విధానంలో సరుకుల ఉత్పత్తి ఆ సరుకును ఎంతమంది కొనుగోలు చేసే అవకాశం ఉంది అన్న దానిని బట్టి ఉంటుంది. అందుచేత వ్యవసాయంలో స్వేచ్ఛా మార్కెట్ వల్ల పశ్చిమ దేశాల ప్రజానీకం వినియోగించే పంటలను కాని, మొత్తంగా సమాజంలో డబ్బున్న వాళ్ళు వినియోగించే పంటలను కాని ఎక్కువగా పండించే వైపు మొగ్గు ఏర్పడుతుంది. అందువల్ల ఆ మేరకు ఆహార ధాన్యాల ఉత్పత్తి నుంచి సంపన్నుల అవసరాలు తీర్చే దిశగా భూవినియోగంలో మార్పు కలుగుతుంది. విదేశాల నుంచి దిగుమతి చేసుకోడం ద్వారా ఆహార ధాన్యాల కొరత ఏర్పడకుండా నివారించవచ్చునేమో కాని దేశం కొన్ని దశాబ్దాలుగా సాధించిన ఆహార ధాన్యాల స్వయం సమృద్ధిని మాత్రం ఇది దెబ్బ తీస్తుంది. తిండిగింజల కోసం ఇతర దేశాల మీద ఆధారపడనైనా పడాలి, లేదా ప్రజలు ఆకలితో మాడి చావాలి.

ఆహార పంటల నుంచి పండ్లతోటల వైపు భూవినియోగంలో మార్పు వచ్చిందనుకుందాం. ఆహార పంటల సాగుకు ఒక పొలంలో 10 మంది కూలీలు అవసరం అయితే అదే పండ్ల తోటల్లో ఐదుగురు సరిపోతారు. ఈ మార్పు ఫలితంగా ఐదుగురు పని కోల్పోతారు. ఫలితంగా వారు ఆహార ధాన్యాలను కొనే శక్తిని కోల్పోతారు. ఒకవేళ పుష్కలంగా ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకున్నా, ఆ విధంగా దిగుమతి చేసుకోడానికి అవసరమైన విదేశీ మారక ద్రవ్యం మన దగ్గర బాగా పోగుబడి వున్నా, వారు మాత్రం ఆహారాన్ని కొనగలిగే స్థితిలో ఉండరు. ప్రజల ఆకలి పెరుగుతుంది. ఇక వ్యవసాయం బదులు రియల్ ఎస్టేట్ వైపుగానో, గోల్ఫ్ మైదానాల వంటివి ఏర్పాటు చేసే వైపుగానో భూవినియోగం మారితే కోల్పోయే ఉపాధి అవకాశాలు ఇంకా ఎక్కువగా ఉంటాయి. నిరుద్యోగం, ఆకలి చావులూ ఇంకా పెరుగుతాయి. అయితే స్వేచ్ఛా మార్కెట్ వాదులు ఇటువంటి పరిస్థితులను ఎప్పుడూ ఊహించలేరు. వారి దృష్టిలో స్వేచ్ఛా మార్కెట్ ఎప్పుడూ సమతూకంలో ఉంటుంది. అంటే ఎప్పుడూ పూర్తి స్థాయిలో అందరికీ ఉపాధి ఉంటుందని, ఎవరి మనుగడకూ ముప్పు ఉండనే ఉండదని వారు భావిస్తారు.

ఇక ఆహార ధాన్యాల విషయంలో దేశ స్వయం సమృద్ధి దెబ్బ తింటుందన్న విషయానికి వద్దాం. ఒకసారి భూవినియోగం ఇతర పంటలవైపు మళ్ళితే, మన దేశ ఆహార అవసరాలకు ఇతర దేశాల నుంచి దిగుమతులు చేసుకోవలసి వస్తుంది. ఇందులో రెండు సమస్యలు ఉంటాయి. మొదటిది : మన దేశానికి అవసరమైనప్పుడల్లా ప్రపంచ మార్కెట్‌లో ఆహార ధాన్యాలు తగినంతగా అందుబాటులో ఉంటాయన్న గ్యారంటీ లేదు. మన వంటి అధిక జనాభా గల దేశంలో ఆహార ధాన్యాల అవసరాలు భారీగా ఉంటాయన్నది మరిచిపోకూడదు. మన వంటి దేశాల్లో అవసరం పడింది అనగానే ప్రపంచ మార్కెట్‌లో వాటి ధరలు అమాంతం ఆకాశాన్నంటుతాయి.

మన అర్థశాస్త్ర గ్రంథాల్లో రాసుకున్నట్టు ప్రపంచ మార్కెట్ ఉండదు. చాలామంది అమ్మకందారులూ, చాలామంది కొనుగోలుదారులూ మన పుస్తకాల్లో మాత్రమే ఉంటారు. వాస్తవ ప్రపంచంలో ఒకానొక దేశానికి అవసరమైన ఆహార ధాన్యాలు ప్రపంచ మార్కెట్లో దొరుకుతాయా లేదా అన్నది అమెరికా, ఇతర యూరోపియన్ దేశాల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉంటుంది. మన దగ్గర విదేశీ మారక నిల్వలు తగినంత మోతాదులో ఉన్నా, ఆహార ధాన్యాలు ప్రపంచ మార్కెట్‌లో ఉన్నా, అవి మనకు దొరకాలంటే మనం అంతకు

కవిత

# నక్షత్ర దీపాలు

- విల్సన్ రావు కొమ్మవరపు
89854 35515



అందమైన వసంతపు గాలి
నిద్రపోతోంది
దయచేసి ఎవరూ
నిద్రాభంగం చేయకండి!

అత్యంత దయామయి నేలతల్లి
పచ్చని పైరగాలికి
పరవశించి పాడుతోంది
హాయిగా గంతులేయండి
కోట్ల పాదాలతో ...
దారుల్ని సుగమం చేయండి
పర్వతాలు ప్రవహిస్తున్నాయి
జీవనదుల్లా ...

ఆకాశం
కొత్త చీర కట్టుకుంటోంది
వెలుగు పూలను కాగితప్పడవలు చేసి
బతుకు కాలవల్లో వదలండి
చెమ్మగిల్లిన మబ్బు కళ్ళు కొన్ని
చిగురాకు పాదాలతో
ఈ నేలను తాకి పులకిస్తున్నాయి!

నక్షత్రదీపాలు వెలిగించి
గుమ్మాలకు మామిడాకుల తోరణాలు కట్టి
ఆకు పచ్చని జెండాలెగరేస్తూ
స్వాగత గీతాలు పాడండి ...
ఇంద్రధనసుల విల్లులతో
పూలు బుక్కాలు చల్లండి!

---

మించిన మూల్యం (ఇది మార్కెట్ సూత్రాలతో సంబంధం లేని మూల్యం సుమా) చెల్లించాల్సి వుంటుంది. ఈ కారణాల చేత, మన వంటి పెద్ద దేశం ఆహార భద్రత కలిగి వుండాలంటే ఆ తిండిని మనమే పండించుకోవాలి. మన భూముల మీద ఏ పంటలు పండించాలన్నది స్వేచ్ఛా మార్కెట్ శక్తులకు వదిలిపెట్టకూడదు. మన సమాజం సజావుగా నడవాలంటే ఏ పంటలు పండించాలన్న విషయంలో ప్రభుత్వ జోక్యం తప్పకుండా ఉండాలి. ప్రభుత్వం ఆహార ధాన్యాల ధరలను కూడా నియంత్రించాలి. వాటిని స్వేచ్ఛా మార్కెట్ శక్తులకు విడిచిపెట్టకూడదు.

మన దేశంలో చాలా దశాబ్దాల కృషి తర్వాత ఒక వ్యవస్థ ఉనికి లోకి వచ్చింది. అందులో కనీస మద్దతు ధరలు, సేకరణ విధానం, పంపిణీ విధానం, ఆహార సబ్సిడీలు వంటివి ఉన్నాయి. స్వేచ్ఛా మార్కెట్ వల్ల వచ్చే సామాజిక వినాశనాన్ని నివారించి ఒక హేతుబద్ధమైన పరిస్థితిని తీసుకురావడానికి ఈ వ్యవస్థ దోహదం చేస్తుంది. దీనిని పూర్తిగా వ్యతిరేకించే పశ్చిమ దేశాలు మనం ఆ దేశాల భిక్ష మీదనే ఆధారపడాలని కోరుకుంటున్నాయి. కేవలం తమ స్వలాభం తప్ప ఇంకేమీ పట్టని మన స్వదేశీ కార్పొరేట్లు కూడా ఈ ప్రజాహిత వ్యవస్థను వ్యతిరేకిస్తున్నాయి. మన ఆహార ధాన్యాల మార్కెట్‌ను సైతం కొల్లగొట్టి సొమ్ము చేసుకోవాలని అర్రులు చాస్తున్నాయి. మోడీ ప్రభుత్వం ఆ కార్పొరేట్ల కోసం, సామ్రాజ్యవాదులను సంతృప్తిపరచడం కోసం మన ప్రజాహిత వ్యవస్థను చట్టాల ద్వారా ధ్వంసం చేయడానికి సిద్ధమైంది.

కవిత

# మట్టియుద్ధం

*- సరికొండ నరసింహరాజు*

మట్టిని తొక్కి కాల్చాను
చల్లకుండై దూప తీర్చింది
మట్టిని నాగలితో దున్నాను
పంటచేనై అన్నం పెట్టింది
మట్టిని తవ్వే కొద్దీ
ప్రేమ చెలమలో ఊరే కొబ్బరి నీళ్ళు
మట్టంటే మంచి గంధపు చెట్టు కదా
అరగదీసేకొద్దీ సుగంధ పరిమళాలు

మట్టిలోనే కదా మమతానురాగాలు
మరకత మాణిక్యాలు నదీనదాలు
ముల్తాన్ మట్టై
నిత్యం ముద్దులు పెడుతూ నేలతల్లి
బిడ్డల పాదాల కింద
ఆకుపచ్చని తివాచీ పరుస్తూ ...
మట్టి ఇటుకలు లేనిది
ఆకాశ హర్మ్యాలు ఎక్కడివి?



మన్ను తిన్న కన్నయ్య నోట్లోనే
అండపిండ బ్రహ్మాండాలు
మట్టిలో నాటిన విత్తనాలు  తల్లి వేళ్ళై
ఈ దేశపు మహావృక్షమైన  ప్రకృతి  మేళ్ళు
పక్షులకు ఆశ్రయమిస్తూ
పాదచారులకు నీడలనిస్తూ
ఆకుపచ్చని నదిలో
లోకం  బతుకు పడవ ప్రయాణం
మట్టే మహాకావ్యం!

***

కన్నతల్లి నవమాసాలే మోస్తుంది
తరతరాలుగా లోకపు పాపభారాన్ని మోస్తూ
మట్టి తల్లి...
నిత్యం మనిషిని సాకే మమతలతల్లి
నేడు కబ్జాల కాలుష్యం కాటుకు గురై
అనాథాశ్రమంలో విసిరేయబడి
నిరాదరణలో అమ్మ ....

భూమాత అని మొక్కుతూనే
చెరబట్టి అత్యాచారం చేసే భూబకాసురులు

నేడు స్వార్థం అవినీతి కాలుష్యంలో
బూర్జువాలపై భూకంపమై బద్దలవుతూ...
మట్టిలోనే కదా అగ్ని పర్వతాలుంటాయ్
పేలే లాండ్ మైన్‌లుంటాయ్!

బంకమన్నై గుడిసెలను అలకగలదు
ఎర్ర మట్టి జెండాలై
అధికారంపై తిరగబడగలదు
మట్టితల్లి పొత్తిళ్ళలో లాలించగలదు
మండే అగ్నిగోళమై దహించగలదు

మట్టిలో పుట్టి మట్టిలో కలిసే మట్టి బిడ్డలం
ఇక మట్టి మూలాలు మరవక
మట్టితల్లిని పూజిద్దాం
మట్టిలో ఎవడిని వాడే పాతేసుకుని
మనిషిగా మొలకెత్తుదాం

మట్టి లేకపోతే లోకం మనుగడ లేనట్టు
మట్టి పూల పుష్పగుచ్ఛం అందిస్తూ
నా మతం అభిమతమూ మట్టే
మట్టి మానవతా చిరునామా
దేశమంటే  మట్టి మాత్రమే
మట్టి మనుషులు మాత్రమే

ఈ మట్టి కోసం ఎన్ని యుద్ధాలు జరగలేదు
తరతరాల చరిత్ర సాక్షిగా
నెత్తుటితో తడిచిన నేల సాక్షిగా
మట్టి మరో ఉద్యమానికి సిద్ధమైంది
భూమిపుత్రుల దు:ఖం భుజానికెత్తుకుని....





బి.గోవర్ధనరావు

# అనంతమైన ఆపేక్షని చూపిన 'ఆకాశమంత చూపు'

- అయ్యగారి సీతారత్నం

*"అవకాశవాదం లేని ఆశావాదాన్ని*
*విశ్వజనీనమంత ఆత్మగౌరవంతో*
*వికసించే సమతని వీక్షించాలనుకునే*
*ఆకాశమంత చూపున్న వాణ్ని!"* అని తొలి కవితలోనే కవితా లక్ష్యాన్ని, తద్వారా తన మంచి వ్యక్తిత్వాన్ని స్పష్టం చేసిన కవి బి.గోవర్ధనరావు గారు. "ఆకాశమంత చూపు" అనే కవితా సంకలనం 38 కవితల సమాహారం. ఈ హారాన్ని అమ్మానాన్నలకు ప్రేమగా అందించారు. గోవర్ధనరావు వృత్తి జాయింట్ కలెక్టర్. ప్రవఅత్తి ఆప్యాయత ఆదరణ. అభిరుచి కవిత్వ రచన, పఠనం.

దళిత రెల్లి కవి. ఆంక్షలు విధించిన సమాజాన్ని కూడా ద్వేషించని కవి. అలాగని ఇరుకైన సామాజిక ఛత్రంలో సర్దుకుపోయే మనిషి కాదు. సామాజిక ఛత్రం పరిధిని ఘర్షణతో అయినా విశాలం చేయాలని కాంక్షించే మనిషి. స్పందించే హృదయం ఉన్న వ్యక్తి. సంఘటనాత్మక కవితలు ఎక్కువ రాస్తారు. కవిత ప్రయోజనం కూడా సుస్పష్టంగా తెలిసిన వ్యక్తి. 'కవిత్వం' అనే కవితలో ...

*ఒక జాతిని నీతిని అణచివేసే దౌత్యంపై*
*తిరగబడడమే.. కవిత్వం*
*వాన కురిసినా... పువ్వు పూసినా*
*కోడి కూసినా... మైనా పలికినా*
*..,...*
*కలవరించి... ఆత్మీయంగా పలకరించేదే కవిత్వం!*
*సమస్య పరిష్కారాన్ని*
*ఒక ఆలోచన స్ఫూర్తిని ఓదార్పు నిచ్చేది కవిత్వం*
*అదొక చైతన్యం అదే జీవితం"* అని పేర్కొన్నారు. ప్రకృతి విధ్వంసానికి కలత చెందిన కవిగా 'తిరిగి రాని వసంతం' అనే కవిత రాశారు

*"వసంతం దిగి రంగంలోకి వచ్చింది*
*ఆ ప్రాంతాన్ని చూసి అవాక్కయింది*
*రెక్కలు తెగిన పక్షిలా కూలబడింది*
*రేకులు రాలిన పువ్వులా విలపించింది*

*కొండెక్కి బిగ్గరగా గెలిచింది*
*అసలు అడవి ఉంటే గా పలకడానికి*
*విపత్తుల నుండి రక్షించడానికి*
*పర్యావరణాన్ని కాపాడడానికి*
*మొక్కలు సైన్యాన్ని పెంచేది ఎవరు*
*వసంతాన్ని తిరిగి తెచ్చేది ఎవరు?*

కవి భావ స్పష్టతతో విధ్వంసాన్ని ఆపాలనే తపనతో కవిత్వానికి సొగసులు దిద్దాలనుకోకుండా సూటిగా తేటగా కవిత్వీకరించడం ఈయన పద్ధతి. గ్లోబలైజేషన్‌లో చెట్టు సంస్కృతి పోతున్న వైనాన్ని, దానివల్ల వానరాని విధానాన్ని 'దూర తీరాలకు' కవితలో కళ్లకు కట్టిస్తారు. సున్నితమైన పదబంధాలతో భావ చిత్రం చిత్రీకరిస్తారు.

*చినుకు పిట్టలు*
*పొదరింటికి చేరినట్టు*
*నింగి ఆశల చేతుల నుండి ఎగిరి*
*నేల తల్లి ఒడిలో వాలి*
*మట్టి గూడు కట్టి*
*గింజల సారవంతాన్ని స్వాగతిస్తాయి..*

చినుకు పిట్టలు, నింగి ఆశల చేతులు, మట్టి గూడు లాంటి పదాలు ప్రత్యేకం.

ఈరోజు కరోనా అనే భయంకర వైరస్ వల్ల యావత్ ప్రపంచం సఫాయిల శ్రమని, సేవని గుర్తిస్తున్నాయి. కవి గోవర్ధన్ ఇంతకు పూర్వమే వారి జీవన స్థాయిని చూసి చలించి వారి ఉనికిని నిలబెట్టి, అంతరాలని పోగొట్టాలనే తపనతో కవిత్వం రాసారు. వారి శ్రమను వాడుకొంటూ వారిని దూరంబెట్టి తక్కువగా చూసే ఈ సమాజాన్ని, మనుషుల్ని ద్వేషించకుండా దానిని ఒక దుష్పరిణామంగా గుర్తించి, ఆ స్థితి మార్చాలనే ఒక తపన కనబరిచారు.

*ఈ మురికి కూపాల నుండి*
*ఈ అశుద్ధపు గోతులనుండి*
*ఈ మానవ మలినాల రోతల నుండీ*
*మా వాళ్ళను విముక్తి చేయడానికి*
*స్వేచ్ఛగా నిజమయ్యే కలను కనడానికి*

*నేనూ ఓ అవకాశాన్ని దక్కించుకొంటాను* అని సానుకూల ధోరణిలో వ్యక్తపరుస్తారు. 'ఊబినిపూడ్చాలి' అనే కవితలో చాలా నిజాయితీగా మానవ సంబంధాలు అంతరింపజేసేవాళ్ళని, ప్రేమదీపాల్ని ఆర్పేవాళ్ళని, సుతారమైన సున్నితత్వాన్ని ఉరేసి వ్రేలాడ దీసేవాళ్ళని, అంతరాలని ఇనుపగోడలుగా వృద్ధి చేసేవాళ్ళని, నా వాళ్ళు, నీ వాళ్ళు, మన వాళ్ళు అనే తేడా లేకుండా ఉండాలనీ, అలాంటివాళ్ళని, ఆ అవలక్షణాలని ఎదుర్కోవాలని, 'తన ముందే తయారవుతున్న ఊబిని పూడ్చడానికి మనిషే కదలాలి, మనిషిగా కదలాలి.'

ఈనాడు అస్తిత్వాలు, అణచివేతల పేరుతో సాహితీవేత్తలు కూడా మా, మీ అనే భావాలతో విడిపోతున్నారు. విడగొడుతున్నారు. అన్ని కులాల్లో, అన్ని జెండర్‌లలో అందరిలో సున్నితత్వం పోగొట్టుకోవడం ప్రేమ రాహిత్యానికి గురి అవ్వడం కనిపిస్తుంది. ఆధిపత్యం, అణచివేత అనే అవలక్షణాలే మన శత్రువులు కానీ మనుషులు కారు. మనిషికీ మనిషికీ మధ్య ఏర్పడుతున్న ఊబినిపూడ్చాలంటే మనమంతా మనుషులమనే అస్తిత్వంతో ఉండడం ప్రధానమైనదిగా నిజాయితీగా గుర్తించారు.

*'ఒక పాట' అనే కవితలో*
*కవిత్వం గానీ, పాటగాని*
*నెరవేరుతున్న కలల్ని*
*తొలకరి జల్లులా కురిపిస్తూ*
*కన్నీటిని తుడిచే తొలిపొద్దులా గుండాలి'* అని ఎంతో సున్నితంగా సామాజిక మార్పును, అభివృద్ధిని కూడా గుర్తించాలని దుఃఖాన్ని పొగుడుతూ అభివఅద్ధి పథాన్ని చూపించే దిశలో కవిత్వం ఉండాలని చెప్పడం విశేషం.

కొంతమంది కవులు కవిత్వం ద్వారా ఉద్రేకాల్ని రెచ్చగొట్టడం, అసమానతలపై అసహనం పేరుతో వేరొకరిపై విద్వేష విత్తనాలు చల్లడమో చేస్తున్నారు. దీనికి భిన్నంగా గోవర్ధన్ తన గొంతు వినిపించారు.

*మోసం దుప్పటి కప్పుకుని*
*స్వార్థం కుంపటిపై*

*వేర్పాటువాదాన్ని వండుకున్నారు* అని ఆలోచింప చేస్తారు. అలాగని గోవర్ధన్ పోరాట వ్యతిరేకి కాదు. దేనిమీద పోరాడాలి దేనికోసం పోరాడాలో సుస్పష్టంగా తెలిసిన వ్యక్తి. 'మట్టి కూడా మాట్లాడుతుంది' అనే కవితలో మట్టిని సొంత ఊరు అంత ప్రేమ పిపాసిగా గుర్తించారు.

*మట్టిమౌనం వీడి*
*చరిత్రనంతా కాలంతో కలిపి మనిషి రూపంతో ...*
*పచ్చని అడవిలా*
*పోరాటం ప్రకటన చేస్తూ*
*పిడికిలి ఎత్తి... మాట్లాడుతోంది!*
*రేపటి రోజున... కవితలో*
*నువ్వు ఒక మనిషి ఓ... మృగానివో*
*శాడిస్టువో.. సైకోవో*

*ఎలా అంచనా వెయ్యడం... అంటూ మగతోలు కప్పుకున్న* మృగాలని ఇలా హెచ్చరించారు.

*నాలో రగిలే ఆలోచనలనే*

*ఆయుధంగా మలచుకునే*

*నా నిలువెత్తు భూమికను*

*పదునైన ప్రస్థానాన్ని*

*రేపటి రోజున మండే సూర్యుణ్ణి*

*పరిహసించే దెవరో! శాసించేదెవరో!*

ఈ సంకలనంలో సంఘటనాత్మక కవితలు కనిపిస్తాయి. 'నా సేవలు అందుబాటులో లేవు' 'జమైకా చిరుత', 'కాలం మీద వెలుగు సంతకం', 'పత్తి పేలిన చప్పుడు', 'దిల్ నగర్ దుఃఖం', 'దాడుల జాబితాలో' మొదలగునవి ఆ కోవలోకి వస్తాయి.

160 ఏళ్ల చరిత్ర కలిగిన టెలిగ్రామ్ సర్వీసులు నిలిపివేసిన 2013 జులై 15 సందర్భంగా టెలిగ్రాఫ్ సేవలు చిహ్నంగా చారిత్రిక అనుభూతిగా సఅజించారు. పరుగు వీరుడు హుస్సేన్ బోల్ట్ ప్రపంచ ఛాంపియన్ పదవీ విరమణ 2017లో చేస్తున్నప్పుడు వారిని అభినందిస్తూ

*రాసిన కవిత జమైకా చిరుత.*

*నలుపు తెలుపు అనే భేదాలు*

*పేద, గొప్పని తేడాలు*

*నీ అశ్వ శక్తికి, నీ చిరుత వేగానికి, లేనే లేవ్*

*ఉందని ఎవడన్నా అన్నాడంటే*

*వాడొక ఉత్త వాజమ్మ పని లేని దద్దమ్మ*

*ప్రతిభని చూడలేని ద్రోణాచార్యుని బొమ్మ...* అని ప్రతిభకి వర్ణం, కులం, మతం, అడ్డుగా ఉండే చారిత్రిక భావజాల ఈ అవశేషాల్ని తీసిపారెయ్యాలి అనే ఆతఅత ద్రోణాచార్య బమ్మ అనే పదంవాడి కనబరిచారు. కవి అద్దేపల్లి ని స్మరిస్తూ ...

*వెన్నెల నవ్వుల జాబిల్లి*

*గోదావరి సిగలో జాజిమల్లి*

*ఈ గడుసరి కాలం మీద*

*వెలుగు సంతకం చేసి*

*మరీ వెళ్ళిపోయావు'* అని గుండెచప్పుళ్ళని అక్షరీకరించారు.

1997 – 98 లో 300 మంది పత్తి రైతులు ఆత్మహత్యల నేపథ్యంలో 'పత్తి పేలినచప్పుడు' కవిత రచించారు.

*హరిత విప్లవం*

*ఆత్మహత్యల జానపదం అయింది*

*అక్కడ... సంక్రాంతి సంబరం*

*కన్నీటి పొంగలయింది.!'* అని చిన్న పదాలతో మనసుని మెలిపెట్టే విధంగా, ప్రభుత్వాల పథకాల పద్ధతిని గురించి ఆలోచింపజేసే మాటలతో కవిత్వమల్లారు. హైదరాబాదులో 12 మార్చి 20న బాంబ్ బ్లాస్ట్ జరిగింది. 17 మంది మఅతి చెందారు. 119 మంది గాయపడ్డారు. దానిని నిరసిస్తూ

*'నగరదుఃఖం' అనే కవిత రచించారు.*

*'ఏవడీ బద్మాష్*

*వాడి సమాధి మీద కూడా*

*మనం మట్టి మమతల్ని పేర్చుదాం*

*కాసిని కరుణపూలని ఉంచుదాం..* అని ఒక ఒక అద్భుతమైన మానవ మమతనే కోరారు. గర్భశోకం పొందిన తల్లుల గుండె నిబ్బరం, బంధువుల సంయమనత్వంతో మానవత్వం ఉగ్రవాదాన్ని అంతం చేస్తుందని ఆశించారు. శ్రీకాకుళం వంగర మండలం లో 2012 జూలై 12 తారీఖున దళితులపై దాడులు జరిగినప్పుడు 'దాడులజాబితాలో' అనే కవిత రచించారు. ఈ లక్ష్మింపేట దాడులని తీవ్ర ఆవేదనతో ఖండించారు.

*ప్రశ్నలు వేయడం*

*కారణాలు అడగడం*

*నివేదికలు చూడడం మానేశారు*

*ఆయుధం లా పదును తేరుతూ*

*నిప్పులా రగిలిపోవడం*


*ఉద్యమిస్తూ తెగబడటం నేర్చుకున్నాను.*

ఈ కవితా సంకలనం మొత్తాన్ని పరిశీలిస్తే అన్యాయాన్ని అణిచివేతని వ్యతిరేకించే మనుషులంతా ఐక్యంగా మానవత్వంతో పోరాటపటిమతో సామాజిక పరిణామ క్రమాన్ని అభివృద్ధిని గుర్తిస్తూ మరింత అభివఅద్ధి పథంలోకి అడుగు వేయాలనే ఆకాంక్ష కనపడుతుంది. ■

## కవిత

# అవిశ్రాంత యోధుడు

- కోడే యామినీదేవి



భూమిలో పాతుకున్నవన్నీ మొక్కల వేళ్ళు కాదు,
రైతు నరాల కుదుళ్లు
గుండెకు గురిపెట్టిన ఆ తీయటి మూడు కత్తులూ
నరాల్ని నరికి..
ఆశల ఆయువు తీర్చేందుకు సిద్ధమయ్యాయ్!

రోడ్డున పడ్డ లక్షల పాదాలు నెత్తుటి ధారలు కట్టాయి
యుద్ధవీరుడంటే జవానొక్కడే కాదు
నిరంతరం పైరు గుండెకు హత్తుకుని
బిడ్డలా భుజాల మీద మోసి
హలం పట్టి పొలం దున్నే ప్రతి రైతూ అవిశ్రాంత యోధు

గిట్టుబాటు ధర, మద్దతిచ్చే వ్యవస్థ లేక
పండించిన పంట రోడ్డు పక్కన కుళ్ళుతుంటే
పండుతాయనుకున్న ఆశలు కళ్లెదుటే కూలుతుంటే
ఆకాశంలో సర్వేక్షణలు అమలు కాని హామీలు
వరదలౌతున్నాయ్!
కాగితాల వరకూ చెప్పేందుకు ఎన్నో ముచ్చట్లు
వాస్తవానికొస్తే అన్నీ అగచాట్లు ...

నిర్వీర్యమైన కర్షక జీవన వృక్షాలు
నిలువునా కూలుతున్న దేశపు పట్టుగొమ్మలు
అప్పుల పాలై, అధిక దిగుబడి ఆశించి..
పురుగు మందుల నీడని నమ్మి
కల్తీ ఎరువుల కోరల్లో చిక్కి
చేలబావులే చివరి మజిలీలై
చెట్టు కొమ్మలే  ఉరికొయ్యల గమ్యమై
కుటుంబాలు కూలదోసి తరిగిపోతున్నారు రైతులు..
కరిగిపోతున్నారు... అన్నదాతలు

వ్యవసాయ మార్కెట్ వద్దని
కాంట్రాక్టు వ్యవసాయం ముద్దని
ప్రైవేటు కంపెనీలకు  పెత్తనమిచ్చి
కార్పొరేట్ కాలనాగులకు రెడ్ కార్పెట్ పరిచి
జనాభిప్రాయాలను పక్కకు నెడుతూ
ఆన్లైన్ అమ్మకాలకు హారతి పడుతూ
జనాల్ని తికమక తిప్పలు పెడుతూ
అన్నం పెట్టే రైతుని బిక్షగాణ్ణి చేశాక
అంతా అస్తవ్యస్తం అగమ్య గోచరం!

ధరణిని మారకం వేసే వ్యవస్థ
నియంత్రణలు నిషేధాలు సవరణలు శాసనాలు
ఎన్ని తెచ్చినా
సన్న చిన్నకారు రైతుల నేటి అవస్థలు
నలిపేస్తున్నాయ్!

కాలం కాటుకు తట్టుకున్నా
వ్యవస్థ వేటుకు తట్టుకునేదెలా?
ఎవరు ఎవరిని తాకట్టుపెట్టినా
పుడమికి గర్భశోకం ఈ.. మట్టి తాకట్టు
వాళ్లంతా బానే ఉన్నారు (కార్పొరేట్లు)
వీళ్ళంతా బానే ఉంటారు (పాలకులు)
రైతే రోడ్డు పాలయ్యాడు
మట్టి మనిషి మట్టిపాలై వట్టి గింజై ఒరిగిపోతే
ఖజానా కరగించి దిగుమతుల్జేసుకునేవాడు
కాసుల పంటను కోసుకుంటాడు
కర్షకులు కుంగి కుదేలై పాలేరులౌతారు!

# కందుకూరి సాహిత్య కృషి, సంస్కరణ కృషి పరస్పర పూరకాలు

**- వకుళాభరణం రామకృష్ణ**

'సాహిత్య ప్రస్థానం' డిసెంబర్ (2020) సంచికలో ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న రాసిన "కందుకూరి – గురజాడ : తులనాత్మక అధ్యయనం" చదివాక నా అభిప్రాయం తెలియచేస్తున్నాను. సిమ్మన్న గారు ఇద్దరి రచనా శైలిని, సంస్కృతి కృషిని చక్కగా విశ్లేషించారు.

ఆధునిక తెలుగు సాహిత్యానికి యుగపురుషులుగా కందుకూరి, గురజాడలతో పాటు గిడుగులను పేర్కొంటూ, వారి సాహిత్య సంస్కార, భాషాపర కృషికి బేరీజు వేస్తూ వస్తున్నాం. వీరి కృషిని విడివిడిగానూ, ఉమ్మడిగానూ అనేకులు పరిపరి విధాల ప్రస్తుతించడం, విశ్లేషించడం, విమర్శించడం కూడా కద్దు. గురజాడ సాహిత్య సృష్టికి, కందుకూరి కృషికి పోలిక సంఘ సంస్కరణను ప్రోది చేసేంత వరకే. గురజాడ కృషి సాహిత్యానికి పరిమితం. కందుకూరి సంస్కరణల కృషిని ఉద్యమంగా తలకెత్తుకొన్నారు. ఆ కృషికి సాహిత్యాన్ని పనిముట్టుగా వాడుకొన్నాడు. సాహిత్యం ప్రధానంగా కందుకూరికి ఒక సాధనం, మీడియం. గురజాడకు సాహిత్యం ప్రధానం. ఒకరు ప్రత్యక్షంగా కార్యరంగంలోకి దిగి, ఆటుపోట్లను ఎదుర్కొని నిలబడ్డారు. మరొకరు దూరంగా ఉన్నా, కృషికి సృజనాత్మకతను జోడించారు.

ఈ సందర్భంలో భాష గురించి కందుకూరి చెప్పిన విషయాలు ఉటంకిస్తాను : (స్వీయ చరిత్ర నుండి)

''భాష వలన ప్రయోజనమేమి? జనులు తమ యభిప్రాయములను నొండురులకు దెలుపుట. భాషలోని గ్రంథముల వలన ప్రయోజనమేమి? తమ భావములను దూరమునున్న వారికిని, రాబోవు తరముల వారికిని సులభముగ తెలుపుట. అట్టి సౌలభ్యము 'విగ్రహము' వంటి పుస్తకముల వలన కలుగునా? కలగదు. అందలి పదముల యొక్కయు, వాక్యముల యొక్కయు యర్థమును దెలిసికొనుట కయి సామాన్య జ్ఞానము గలవాడికి నిఘంటువుల యొక్కయు, పండితుల యొక్కయు సాయము కావలెను.

..... అట్లయినచో గ్రంథములెట్లుండవలయును? అందరికి తెలియునట్లు సులభముగా నుండవలెను అని నేనాలోచించుకొని ముందు వ్రాసెడు పుస్తకములు విగ్రహము వలెగాక సుగమములుగా నుండినట్లు వ్రాయ నిశ్చయించుకొని నా అభిప్రాయములను నాలోపలనే యుందుకొనక పత్రికాముఖమున దెలిపితిని..." అని రాశాడు. "సంస్కరణ మీద తన భావాలు జనానికి అందేటందుకు వీరేశలింగం తన భాషను సులభం చేశాడు. ఇది వీరేశలింగం జీవితంలోనే కాక, తెలుగు సాహిత్యంలోనే, అలాగే ఆంధ్ర దేశపు సంస్కరణోద్యమంలోనే ఒక మలుపు... ఆయన సంస్కరణ కృషీ, సాహిత్య కృషీ ఆయన జీవితంలో రెండు వేరు వేరు పార్శ్వాలు గాదు. అవి పరస్పర



పూరకాలు''. ఈ విధంగా ఆయన కొత్త తెలుగు వచన శైలిని సృష్టించి, మామూలు మనుషులకు కూడా సుబోధకమూ అయిన కొత్త వచనాన్ని సృష్టించాడు. వచన సాహిత్యాన్ని వృద్ధి పరిచిన ఆయన కృషికి వారిని 'గద్య తిక్కన'గా వర్ణించారు. కట్టమంచి రామలింగారెడ్డి గారి అభిప్రాయం ఉటంకించడం ఈ సందర్భంలో ఉచితమనిపిస్తుంది.

''ఆయన శ్లేషతోనూ, చిత్ర కవితలోనూ, కృత్రిమ వికారాలతోనూ నిండిన ప్రబంధాల రచయితగా ప్రారంభించి, తెలుగు నవలనూ, తెలుగు సాంఘిక ప్రహసనాన్నీ, తెలుగు నాటకాన్నీ, ముఖ్యంగా సాంఘిక నాటకాన్ని, తెలుగులో శాస్త్ర విజ్ఞానాన్నీ, శాస్త్రీయ జీవిత కథనూ సృష్టించినవాడుగా చివరకు పరిణమించాడు". కానీ, యీ విషయంలో ఆయన దారి మధ్యలో ఆగిపోయాడు. తన భాషా సంస్కరణ ఉద్యమ తుదముట్ట సాగించలేదు. ఆయన వచనంలోని లోపాలను, ఆ శైలిని గిడుగు, గురజాడ తప్పుపట్టారు. ఆయన చివరిరోజు దాకా ఆయన్ను వాళ్లు తమ వైపుకు తిప్పుకోలేకపోయారు. 1919లో 'వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజానికి అధ్యక్షుడిగా వుండడానికి అంగీకరించినప్పుడు వీరేశలింగం వ్యావహారిక భాషావాదం వైపుకు మళ్లాడు. (ఆ సమాజం రాజమండ్రిలో 1919 ఫిబ్రవరి 28న ఏర్పడగా, వీరేశలింగం ఆ తర్వాత మూడు నెలలలోపే మరణించాడు)

ఈ సందర్భంలో సాహితీ ప్రస్థానం పాఠకులను ఒక విషయం తెలియచేయాలి. 1980 డిసెంబర్‌లో సొసైటీ ఫర్ సోషల్ ఛేంజ్, కావలి, 'ప్రజాస్వామిక సంస్కృతి' మకుటంతో, 'కందుకూరి, గురజాడల దోహదం' అనే పేరుతో, 70 పుటల మోనోగ్రాఫ్ ప్రచురించింది. దానికి ముందుమాటలు శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావు, చలసాని ప్రసాద్ రాయగా; కెవిఆర్, వి.రామకృష్ణ గ్రంథ రచన చేశారు. వలస సంస్కృతిని విశ్లేషించి, తర్వాత తలెత్తిన ఆధునిక భారతదేశంలో ఆర్థిక, రాజకీయ, సామాజికాంశాలను ప్రస్తావించి, మత సంఘ సంస్కరణలు వివరించి, ప్రజా సంస్కృతి రూపురేఖలను వివరించిందీ గ్రంథం. ఆంధ్రదేశంలోని అప్పటి రాజకీయ, ఆర్థిక పరిణామాలతో సహా, వీరిరువురి కృషిని శాస్త్రీయంగా వివరించిందీ గ్రంథం.

ఈ వ్యాసంలోని ఉటంకింపులు, వకుళాభరణం రామకృష్ణ, *'ఆంధ్రదేశంలో సంఘ సంస్కరణోద్యమాలు'* నుండి గ్రహించినవి. ■



# దేశభక్తి సినిమాలూ - పాటలూ

- పొన్నాడ సత్య ప్రకాశరావు

9000619267

**ఓ పెద్దాయన ప్రశ్న :** దేశభక్తి అంటే గురించి వివరించుము.

**పిల్లవాడి జవాబు :** ఆగస్టు 15, అక్టోబర్ 2, జనవరి 26 .. ఈ మూడు తేదీల్లో జరిగే హడావుడిని దేశభక్తి అందురు.

**ప్రశ్న : నా ప్రశ్నకు ఇదా సమాధానం? మరికొంచెం ఆలోచించి చెప్పు?**

**జవాబు :** (ఆలోచించి) ఆరోజు ఎవరో తాతయ్యల చిత్రాలకు దండలు వేసి జెండా ఎగురవేసి ఏవో కబుర్లు చెబుతారు. ఇంకా చాక్లెట్లు కూడా పంచుతారు.

**ప్రశ్న : ఇంకేమన్నా చెప్పగలవా?**

**జవాబు :** ఆరోజు అల్లూరి సీతారామరాజు, గాంధీ, మేజర్ చంద్రకాంత్ వంటి సినిమాలు అన్ని ఛానెళ్ల వాళ్లూ వేస్తారు. ఉదయం నుంచి లైవ్ ప్రసారం ఉంటుంది. రకరకాల వేషాలు వేసుకొని రకరకాల వాహనాల్లో ఆర్టిస్టులు వెడుతుంటే అందరూ చూసి చప్పట్లు కొడతారు. ఇదే స్వాతంత్ర్యం! 'దబ్'మని చప్పుడు. ప్రశ్న వేసే ఆయన పడిపోయారు.

***

ఈ సన్నివేశం ఈ రోజుకి మాత్రమే కల్పితం, రేపటికి నిజం కావొచ్చు! ఎల్లుండికి చరిత్ర అయినా ఆశ్చర్యం లేదు. ఈ 'మూడు' సెలవు రోజులు... ఉన్నతాధికారులు మాత్రం కార్యాలయం వద్ద గుమి గూడి జెండా ఎగురవేస్తారు (విధి నిర్వహణలో భాగంగా). రాజకీయ నాయకులు వాడవాడలా జెండాలు ఎగురవేసి ఆ ఫొటోల్లో పడేటట్లు, అవి పేపర్లలో వచ్చేటట్టు చేసుకొంటారు. సంవత్సరంలో ఓ 'మూడు రోజులు' ఆ మాత్రం హడావుడి చెయ్యలేరా? చేస్తారు కదూ?

***

ఏమాటకి ఆమాటే చెప్పుకోవాలి. స్వతంత్ర దినాన్ని ఘనంగా గడుపుకోవటమే కాదు, ప్రేక్షకులకు ఉత్తేజ పూర్వకమైన విషయాలను సినిమాల, గీతాల రూపంలో అందించేది టీవీ ఛానెళ్లు, పత్రికలూ. ఓ అల్లూరి, ఓ ఆంధ్రకేసరి, ఓ లక్ష్మీభాయిల కథలను ఆకర్షణీయంగా విద్యార్థులకు అందించేది మీడియానే.

***

సాహితీ రంగంలో కవులు దేశం గురించి ఆలోచన చేస్తూనే ఉంటారు. అయితే, సాహిత్యాన్ని అందరూ చదవరు. అందరూ ఇష్టపడేది.. అందుబాటులో ఉన్నది సినిమా మాత్రమే. ఈ 'మాధ్యమం' చాలా చాలా శక్తివంతమైంది. ఉత్తేజం కలిగించే శక్తి కలది. 'దేశభక్తి' అని అడిగితే ఆ కుర్రాడు 'అల్లూరి సీతారామరాజు' అన్నాడు అంటే కారణం సినిమానే.. స్వాతంత్ర్య దినోత్సవం, దేశభక్తి ఇత్యాది అంశాల పట్ల 'స్ఫూర్తి'ని కలిగించే ప్రయత్నం చేస్తున్నది సినిమానే అని చెప్పొచ్చు. అడపాదడపా దేశభక్తిని రగిలించే సినిమాలు వస్తూనే ఉన్నాయి. పాత చిత్రాలు ప్రసారం చేయబడుతూనే ఉన్నాయి. విద్యాలయాలు ఈ మూడు పర్వదినాల్లో రకరకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి. ఒక విద్యార్థి రంగు వేసుకొని 'విల్లు' పట్టుకొంటే 'అల్లూరి' వలెనో, 'కర్ర' పట్టుకొంటే గాంధీలాగో ఊహించుకొంటాడు. ఆ ఊహకి సర్వ సాధారణంగా సినిమా రూపమే ఆధారం.

***

దేశభక్తిని సినిమాలు రెండు మూడు విధాలుగా చూపెడుతున్నాయి. స్వాతంత్ర్య సమర యోధుల కథలను తెరకెక్కిస్తూ చారిత్రాత్మక చిత్రాలను నిర్మించటం మొదటి విధానం. ఈ కోవలో వచ్చిన తెలుగు చిత్రాల్లో ప్రథమ తాంబూలం కృష్ణ నటించిన 'అల్లూరి సీతారామరాజు' చిత్రానిదే! ఆ మన్నెం వీరుడి కథను తెరకెక్కించడంలో ఎన్నో అవరోధాలను ఎదుర్కొని ఆకట్టుకొనే విధంగా, ఓ 'జీవితకాల సాధన'గా తీసిన కృష్ణ అభినందనీయుడు. అక్కినేనికి దేవదాసు, నందమూరికి శ్రీకృష్ణ పాత్ర, కృష్ణకి అల్లూరి పాత్రలు రూపుదిద్దినట్టు సరిపోతాయి. తనకటువంటి పాత్ర కోసం చిరంజీవి నటించిన చిత్రం, మరో సమర యోధుడి కథ 'సైరా సరసింహారెడ్డి'. చిరకాలం నిలిచిపోయే పాత్ర కోసం చిరు ఓ స్వాతంత్ర్య యోధుడి కథను ఎన్నుకోవటం గమనార్హం. ఆంధ్రకేసరి పాత్రను ఆయన మనవడు విజయచందర్ పోషించడం విశేషం. ఇంకా సుభాస్ చంద్రబోస్ (వెంకటేష్), పరమవీర చక్ర (బాలకృష్ణ), కొమరం పులి (పవన్ కళ్యాణ్) సినిమాలు సమర యోధుల ప్రస్తావనతో వచ్చినవే! గాంధీ చరిత్రను (గాంధీ) కింగ్‌బెన్స్‌లే అనే ఓ బ్రిటీషర్ తీయడం విశేషం.

హిందీలో ది లెజెండ్ ఆఫ్ భగత్‌సింగ్ (అజయ్ దేవగన్), మంగళపాండే (అమీర్‌ఖాన్), సర్దార్ (పరేష్ రావల్), నేతాజీ (సచిన్ ఖాడ్రేకర్), మణికర్ణిక (కంగనా రనౌత్) వంటి స్వాతంత్ర్య సమర యోధుల చిత్రాలు వచ్చాయి. హాకీకత్ (ధర్మేంద్ర), షాహీత్ (మనోజ్ కపూర్), జుమాన్ (శశీకపూర్), బోర్డర్ (సన్నీ డియోల్), లగాన్ (అమీర్ ఖాన్) 'హిందూస్థాన్‌కి కసమ్' (రాజ్‌కుమార్), ఊరి (పరేష్ రావల్), విజేత (శశీకపూర్), ఎల్‌జీ సే కార్గిల్ (అజయ్ దేవగన్), లక్ష్య (హృతిక్ రోషన్), రంగ్ దే బసంతీ (అమీర్ ఖాన్) మొదలైనవి దేశభక్తికి సంబంధించిన చిత్రాలే!

***

దేశ సమగ్రత, భవిష్యత్, దేశం గొప్పదనం మీద సినిమాలు తియ్యటం మాత్రమే దేశభక్తి కాజాలదు. దేశంలో జరుగుతున్న అరాచకాల మీద, పట్టిపీడిస్తున్న సమస్యల మీద విమర్శనాత్మకంగా చెప్పడం కూడా దేశభక్తి అవుతుంది. కులమత విద్వేషాలు, దురాచారాలు, రైతు సమస్యల మీద స్పందించటం సినిమావాళ్లు ఎప్పుడో చేశారు. సమాజం పట్ల తమకూ 'స్పృహ' ఉన్నదని, తాము చేసేది వ్యాపారం మాత్రమే కాదని రుజువు చేస్తూ తొలినాళ్ళలోనే 'గృహలక్ష్మి', 'వందేమాతరం', 'సుమంగళి' (నాగయ్య), 'మళ్లీ పెళ్ళి' (వైవీ రావు), 'రైతుబిడ్డ' (బళ్లారి రాఘవ), 'మాలపిల్ల' (గోవిందరాజుల సుబ్బారావు), 'వరవిక్రయం' (భానుమతి) నిర్మించబడ్డాయి.. స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న ఓ వ్యక్తి స్వతంత్ర్యం వచ్చాక దేశంలో పడిపోతున్న విలువలను చూసి 'ఇందుకా ఎందరో ప్రాణాలడ్డి స్వాతంత్ర్యాన్ని సాధించింది' అనుకొని తనవంతు కృషిగా చీడపురుగులను ఏరిపారేసే 'సేనాపతి'గా కమలహాసన్ నటించిన 'భారతీయుడు' విశేష ఆదరణ పొందింది. అదే కోవలో ఇప్పుడు 'భారతీయుడు-2' తయారీలో ఉన్నది. ఇంకా 'మేజర్ చంద్రకాంత్', 'సర్దార్ పాపారాయుడు', 'బొబ్బిలి పులి' (నందమూరి) 'భారతరత్న' (విజయశాంతి), 'ఖడ్గం' (రవితేజ) 'మహాత్మ' (శ్రీకాంత్), 'ఘాజీ' (రానా), 'గగనం' (నాగార్జున), 'రోజా', 'బొంబాయి' (అరవింద స్వామి); 'ఠాగూర్', 'స్టాలిన్' (చిరంజీవి); 'రాజన్న' (నాగార్జున) 'అంబేద్కర్' మొదలైన సినిమాలు దేశం గురించి ఆలోచనలు చేసినవే.

నటరత్న నందమూరి రామారావు నటించిన 'కథానాయకుడు', 'దేశద్రోహులు', 'దేశోద్ధారకులు', 'పెత్తందార్లు', రైతుబిడ్డ వంటి చిత్రాలు సామాజిక చింతన కలిగినవే.. అక్కినేని 'సుడిగుండాలు' యువతను చెడుదోవ పట్టిస్తున్న ధోరణుల మీద, 'మరో ప్రపంచం' కులమత రహిత సమాజ స్థాపన ఆవశ్యకత మీద తీసినవే!

కొంతమంది నిర్మాతలు వ్యాపార విలువలకు ప్రాధాన్యత ఇస్తూనే.. దేశ సమైక్యత, దేశ రక్షణ వంటి అంశాలు సినిమాల్లో వచ్చేలా తీస్తున్నారు. (సరిలేరు నీకెవ్వరూ, నా పేరు సూర్య, నా ఇల్లు ఇండియా వంటివి). యువతను మత్తులో ముంచేసే చిత్రాలకన్నా ఈ తరహా చిత్రాల నిర్మాణం ఆహ్వానించదగినదే!

చిత్రాల మాదిరిగానే పాటల్లోనూ రెండు రకాల ధోరణులు కనబడతాయి. నిందా, స్తుతి అన్నట్లు కొన్ని మంచిని పొగిడితే కొన్ని చెడుని తెగుడుతాయి. కొన్ని పాటలు చిత్రాల కోసం రాయబడకపోయినా సందర్భానుసారం సినిమాల్లో వాటిని ఉపయోగించుకోవడం కద్దు.

దేశభక్తి గీతాలు అంటే ప్రథమంగా గుర్తుకు వచ్చేవి 'వందేమాతరం' (బంకించంద్ర చటర్జీ), 'జనగణమన' (రవీంద్రనాథ్), 'సారే జహాసే అచ్చా' (ఇక్బాల్). అవి జాతీయ

స్థాయిలోనివి. తెలుగు వారికి సంబంధించిన దేశభక్తి గీతాలెన్నో ఉన్నాయి. స్వాతంత్ర్య సమరంలో వాడవాడలా తిరుగుతూ తమ తమ వాగ్ధాటితో ప్రజలను ఉత్తేజపరిచిన వాళ్లెందరో.. అయితే, ఆ ఉత్తేజం ఆ సభలకు వెళ్లి విన్న వారిలో కొంతమందికి మాత్రమే కలుగుతుంది. మిగతావారికి ఆ ఉపన్యాసాలు వినే అవకాశం లేదు. తిరిగి చెప్పటం సాధ్యం కాదు. సరిగ్గా ఈ వెలితిని పూరిస్తూ పుట్టినవే గేయం, పాట. అవి ఓ మూడు నాలుగు నిముషాల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపగలవు. చక్కటి సాహిత్యం, ఆకట్టుకొనే బాణీల్లో సందేశాన్ని అందిస్తే ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తుంది. సభలకు రాలేకపోయినవారిని, వచ్చి మరోసారి ఆ అనుభూతి పొందాలనుకునేవారిని పాటలు ఉత్తేజపరుస్తాయి. ఏ పరిస్థితుల్లో ఉన్నా వారిలో ఉద్దీపన కలిగించేదే పాట. ఇలాంటి పాటలు సులభంగా సందేశాన్ని తీసుకెళ్లగలవు.

'మాకొద్దీ తెల్లదొరతనం' (గరిమెళ్ల సత్యనారాయణ),

'మాదీ స్వాతంత్ర్య దేశం – మాదీ స్వతంత్ర్యజాతి' (బాలాంత్రపు – టంగుటూరి సూర్యకుమారి),

'స్వాతంత్ర్యమే నా జన్మ హక్కనీ చాటండీ (ఘంటసాల – వోలేటి),

'దేశమంటే మట్టి కాదోయ్' (గురజాడ), 'దేశమును ప్రేమించుమన్నా (గురజాడ),

'కొల్లాయి గట్టితేనేమి' (బసవరాజు అప్పారావు),

'కళ్లు మానండోయ్.. కళ్లు తెరవండోయ్' (నాగయ్య),

'ఏ దేశమేగినా ఎందు కాలిడినా', 'శ్రీలు పొంగిన జీవగడ్డకు' (రాయప్రోలు సుబ్బారావు),

'జయ జయ ప్రియ భారత' (దేవులపల్లి కృష్ణశాస్త్రి),

'నారాయణ, నారాయణ, అల్లా.. అల్లా.. (దేవుల పల్లి కృష్ణశాస్త్రి),

'మా తెలుగుతల్లికి మల్లెపూదండ' (శంకరంబాడి) … ఇత్యాది గీతాలు జాతీయ వాదాన్ని, స్వాతంత్ర్యాభిలాషని ఎగదోసాయి. వాటిలో 'ఏ దేశమేగినా' గీతాన్ని 'అమెరికా అబ్బాయి', 'శ్రీలు పొంగిన జీవగడ్డ' గీతాన్ని 'లీడర్', 'జయజయ ప్రియభారత' గీతాన్ని 'రాక్షసుడు' సినిమాల్లో సందర్భానుసారం ఉపయోగించుకొన్నారు.

అల్లూరి సీతారామరాజు సినిమా కోసం శ్రీశ్రీ రాసిన 'తెలుగువీర లేవరా' పాట జాతీయ పురస్కారాన్ని అందుకొన్నది (1974). 'భలే తాత మన బాపూజీ' (దొంగరాముడు) – 1955, 'భారతమాతకు జేజేలు' (బడి పంతులు) – 1972, 'గాంధీ పుట్టిన దేశం' (గాంధీ పుట్టిన దేశం) – 1973, 'నీ సంఘం.. నీ ధర్మం' (కోడలు దిద్దిన కాపురం) – 1970, 'నా జన్మ భూమి' (సిపాయి చిన్నయ్య) – 1969, 'నేనూ నా దేశం' (నేను – నా దేశం) – 1973, 'దేశమ్ము మారిందోయ్..', 'ఉ ందిలే మంచీకాలం..' (రాముడు–భీముడు) 1964, 'మన జన్మభూమి' (పాడి పంటలు) – 1976, 'జననీ జన్మభూమిశ్చ' (బబ్బిలిపులి– దాసరి) – 1982, 'పుణ్యభూమి నా దేశం (మేజర్ చంద్రకాంత్) – 1993, 'దేశం మనదే' (కులశేఖర్ – జై) – 2004 … ఇటువంటి గీతాలు ఎంతో ప్రసిద్ధి పొందాయి. సానుకూల ధోరణిని కనబరుస్తూ ఉత్తేజాన్ని నింపాయి.

నీ సంఘం, నీధర్మం ఎటువంటిదో చెబుతూ.. అటువంటి ధన్యజీవుల, త్యాగమూర్తుల వారసత్వాన్ని నిలబెట్టమని, మంచి కాలం వస్తుందని నిరాశపడవద్దని చెప్పడం ఒక పద్ధతి. కానీ, తాతలు నేతులు తాగినంత మాత్రాన మూతులు వాసన ఎంతకాలం చూడాలి' అనే ఆలోచన వాస్తవ ప్రపంచాన్ని చూస్తే కలగక మానదు. 'అంతా సవ్యంగా లేదు.' 'కళ్లు తెరవండి', జాగ్రత్తపడండి' అంటూ హెచ్చరికల వంటి 'పాటలూ' వచ్చాయి. వాటి 'పునఃశ్చరణ' చాలా అవసరం.

'మా తుజే సలామ్' అంటూ రహమాన్ వందేమాతర నినాదంతో, రోజా – 1993 సినిమాలో రాజశ్రీ రచన 'మతం మారిన పలుకొక్కటేరా, విల్లు మారినా గురి ఒక్కటేరా అరె ఇండియా ఒక్కటేరా.., 'వినరా వినరా దేశం మనదేరా.. అనరా అనరా రేపిక మనదేరా..' పాత సందేశాన్నే మరింత ఉత్తేజితం చేస్తుంది. 'ఉన్నదీ మనకూ ఓటు.. బతుకు తెరువుకే లోటు' అంటూ ఆరుద్ర 'ఇదే గాంధీ పుట్టిన దేశమా..' (పవిత్ర బంధం –1971)లో వాపోయారు. 'రూలూ ఉంది, రైటూ ఉంది / సత్యం పలికే హరిశ్చంద్రులం / అవసరానికో అబద్ధం / నిత్యం పూజలు, నమాజు చేస్తాం / రోజూ తన్నుకు చస్తాం / మేమే ఇండియన్స్..' అంటూ మన ద్వంద్వ వైఖరిని, శక్తిని (ఖడ్గం – 2002)లో ఎండగట్టడాన్ని కూడా మనం చూడొచ్చు. 'వందేమాతరం వరుస మారుతోందంటూ..' జలం, బలం లేక

జనం వాడుతున్నది / పైరు నోచుకోని బీళ్లు నోళ్లు తెరుస్తున్నవి / ఎక్కడ వేసిన గొంగలి అక్కడే ఉన్నది.' సినారె చెప్పిన కొత్త భాష్యం ('వందేమాతరం' – 1985)ని నరనరానా జీర్ణించుకోవాలి. 'కూలీ డబ్బుతో లాటరీ టిక్కెట్ కొనే దురాశ జీవులకు / నిరాశ జీవులకు ఎవరూ తోడు రారని / ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడొద్దని' శ్రీశ్రీ (భూమి కోసం – 1974)లో ఎందుకు చెప్పారో ఆలోచించాలి. 'పుణ్య భూమిలో పుట్టడం మన తప్పా / ఆవేశం ఆపుకోని అమ్మా నాన్నలదే తప్పా / సాపాటు ఎటూ లేదు పాటైనా పాడు బ్రదర్..!' అంటూ శ్రీశ్రీ వేసిన చురకరలని (ఆకలి రాజ్యం – 1981) మర్చిపోకూడదు. 'అగ్ని శిఖలని గుండెలోన అణచిన ఓ సూర్యుడా / మన్యం వీరుడు రామరాజు ధనుఃశంఖారానివా / భగత్‌సింగ్ కడసారి పల్కిన ఇంక్విలాబ్ శబ్దానివా / కన్నులు గప్పిన న్యాయదేవత కంటి చూపైనావురా' నేను సైతం ప్రపంచాగ్నికి సమిధినొక్కటి ఆహుతివ్వాలనే భావం మనలో కలగకపోతే ఎలా? 'అర్ధ శతాబ్దపు అజ్ఞానాన్ని స్వతంత్ర్యమందామా? / స్వర్ణోత్సవాలు చేద్దామా? / కులాల కోసం గుంపులు కడుతూ మతాల కోసం మంటలు పెడతూ/ ఎక్కడలేని తెగువని చూపి తగువుకి లేస్తారే/ అన్యాయాన్ని సహించని శౌర్యం కారడవులలో దాక్కుని ఉండాలా/ శత్రువులతో పోరాడే సైన్యం అన్నల చేతిలో చావాలా/ తనలో ధైర్యం అడవికి ఇచ్చి తన ధర్మం చట్టానికి ఇచ్చి ఆ కలహం చూస్తూ సంఘం శిలలా నించోవాలా' అంటూ చాలా సూటిగా సిరివెన్నెల సీతారామ శాస్త్రి (సింధూరం – 1997) వేసిన ప్రశ్నలకు సమాధానం ఇంకా దొరకాల్సిన అవసరం ఉంది.

'అవినీతి బంధుప్రీతి చీకటి బజారు అలముకొన్న ఈ దేశం ఎటు దిగజారు / ప్రతి మనిషీ మరి యొకని దోచుకొనేవాడే / స్వార్థమే అనర్థకారణం దానిని చంపుకొనుటే క్షేమదాయకమని శ్రీశ్రీ ఆరు శతాబ్దాల కిందటే (వెలుగు నీడలు – 1961) హెచ్చరించారు. ఆ మూడు రోజుల సంబరాల్లో భాగంగా మాత్రమే ఈ పాటని మనం వింటున్నాం. విని ఊరుకొంటున్నాం. ఏతావాతా చెప్పేదేమిటంటే .. దేశభక్తిని రగిలించటంలో, కొనసాగించటంలో 'కళారంగం' ఎప్పుడూ ముందంజలోనే ఉంది, ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో నిజాలను నిగ్గు తీస్తూ అసలైన దేశభక్తికి అర్థం చెబుతూ మరిన్ని సినిమాలూ, పాటలూ రావాలి. కళారంగం, కళాకారులు అందుకు పూనుకోవాలి.

■

---




## 'దండకడియం'కి సాహిత్య పురస్కారం



తగుళ్ళ గోపాల్

**మ**హబూబ్ నగర్ జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు, యువకవి తగుళ్ళ గోపాల్ ... ఈ ఏడాది కొత్తపల్లి నరేంద్రబాబు సాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. జాతీయ స్థాయిలో పలువురు పోటీపడగా, ఆయన రాసిన "దండకడియం" కవితా సంపుటిని అవార్డు కమిటీ ఎంపిక చేసింది. ప్రముఖ కవి, కవి సమ్మేళనం సాహిత్యవేదిక వ్యవస్థాపకులు కొత్తపల్లి నరేంద్రబాబు స్మారకార్థం ప్రతి ఏటా ఇచ్చే సాహిత్య పురస్కారానికి ఈ ఏడాది పలు కవితాసంపుటులు పోటీపడ్డాయని నిర్వాహకులు కొత్తపల్లి సురేష్ తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా ప్రముఖ సాహితీవేత్తలు జి.వెంకటకఅష్ణ, పలమనేరు బాలాజీ, కె.నాగేశ్వరాచారి వ్యవహరించారు. త్వరలో అనంతపురంలో జరిగే సభలో విజేతకు అవార్డు అందచేస్తామని సురేష్ తెలిపారు.

## నివేదిక

# రైతు పోరాటానికి మద్దతుగా కలాలూ గళాలూ ...

ఏ చట్టమైనా సామాన్యులకు మేలు చేసేదిగా ఉంటేనే దానికి అర్థం చేకూరుతుంది. దేశం అభివృద్ధి దశలో ముందుకు వెళుతుంది. దేశానికి వెన్నెముక అని, రాజని ఓ పక్క పొగడ్తలతో ముంచెత్తుతూ... ఇంకోపక్క అన్నం పెట్టే రైతన్న నడ్డి విరిచే చట్టాలను తీసుకురావటం దారుణమని పలువురు కవులు, రచయితలు, మేధావులు, కళాకారులు పేర్కొన్నారు. దేశ రాజధానిలో సాగుతున్న పోరాటానికి తమ కవితలు, పాటలు, ప్రసంగాల ద్వారా సంఘీభావం ప్రటకించారు. డిసెంబర్ 21, 2020 ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విజయవాడలోని అలంకార్ కూడలి ధర్నాచౌక్ వద్ద రచయితలు, కవులు, కళాకారులు, మేధావుల ఐక్యవేదిక తరఫున సంఘీభావ కార్యక్రమం జరిగింది. రైతుల ఆందోళనకు మద్దతు తెలుపుతూ ఏర్పాటు చేసిన బ్యానర్‌పై పలువురు సంతకాలు చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మాజీ వ్యవసాయ శాఖామంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు హాజరయ్యారు. రైతు ఆందోళనకు మద్దతుగా బ్యానర్‌పై సంతకం చేసి, అనంతరం మాట్లాడారు. రైతులకు నష్టం కలిగించే మూడు వ్యవసాయ చట్టాలను మోడీ ప్రభుత్వం పార్లమెంట్లో అడ్డదారిలో ఆమోదించుకుందని విమర్శించారు. ఈ చట్టాలు కార్పొరేట్లకు మాత్రమే చుట్టాలని అన్నారు. రైతుల ఆందోళనలను ఏమాత్రం పట్టించుకోని కేంద్ర ప్రభుత్వ వైఖరిని విమర్శించారు. ఇలాంటి పరిస్థితిని నిరసిస్తూ కవులు, రచయితలు, కళాకారులు తమ గొంతును వినిపించడం స్ఫూర్తిదాయకమని అభినందించారు. ఆ తరువాత కవిసమ్మేళనం జరిగింది. విరసం బాధ్యులు అరసవిల్లి కృష్ణ .. 'ఆకలి నాదే .. మెతుకులు నావే/నోటికి అడ్డం పడ్డ మట్టిబెడ్డలు నావే../ జనన మరణాల దృశ్యం నాదే../ ' అంటూ రైతు గళం వినిపించారు. సరికొండ నరసింహరాజు తమ కవితను వినిపిస్తూ .. 'గజగజ వణికే చలిలో/ కుటుంబానికి దూరంగా / కన్నవూరిని కన్నతల్లిని విడిచి / కాళ్లకు చేతులకు సంకెళ్లు వేసే చట్టాలపై గర్జించే ధిక్కార స్వరమై రాజధాని కూడళ్లలో నిరసనల నిప్పుల గుండం అతడని' రైతు పోరాటాన్ని తమదైన శైలిలో శ్లాఘించారు. మందరపు హైమవతి తమ కవితలో.. 'నేరస్తులు బోర విరుచుకు తిరిగే వ్యవస్థలో అన్నదాతలే నేరస్తులైన విలోమ పరిస్థితని పేర్కొన్నారు. రైతుల వెన్నెముకలు విరిచే చట్టాలు చేసినప్పుడు హలధారులే పరశురాములు.. పోరుబాటలో బిగించిన నిప్పుపూల పిడికిళ్లు.. అని నిప్పుపూలు కురిపించారు. 'ఒరేయ్ ఏమి తిని బతుకుతార్రా/ బంగారం తినో రూపాయి కట్టలు మింగో బతకండ్రా.. / రైతు చేతిలో ఈ మట్టి సజీవమవ్వకుండానే ఏ దేశంలోనైనా ఎవరైనా ఎట్టా బతికి బట్టకట్టగలరో చెప్పండి../ డియర్ కార్పొరేట్స్ మైడియర్ బ్యూరోక్రాట్స్' అంటూ పాలకవర్గాన్ని దుయ్యబట్టారు శిఖా ఆకాష్. రైతుల్ని భూమి నుంచి దూరం చెయ్యడం ప్రకృతికే సాధ్యం కాలేదు/ మీరెంత అంటూ శాంతిశ్రీ కార్పొరేట్ల ఎత్తుగడలను తిప్పికొట్టారు. 'నీ కార్పొరేట్ చట్టాలపై పైకెత్తిన కొడవళ్లు వాళ్లు / జాతి స్వప్నాలను సాకారం చేసే ప్రజాశక్తుల పాంచజన్యం వాళ్లు' అంటూ రైతుల పోరుకు మద్దతు అందించారు చలసాని వెంకట రామారావు. 'అంపశయ్యపై వేకువగీతం రాస్తున్నాడంటూ అన్నదాతల పోరాటాన్ని కీర్తించారు ఎస్ కెడి ప్రసాద్. 'ఆదుకోవల్సిన ఏలికలు ఉసురు తీస్తుంటే రైతు నిమ్మళంగా ఎలా ఉండగలడు? పచ్చదనాన్ని శ్వాసించే మట్టి గుండెలపై కార్పొరేట్ కసువు చితిగా పేర్చి నేల కడుపు చీరేస్తుంటే కదం తొక్కకుండా ఎలా ఉండగలడు.. నీ అవినీతికి నిప్పెట్టడానికి వాళ్లిప్పుడు రహదారుల మీద పోరాట సేద్యం చేస్తున్నారు.. కాచుకో పాలకా' అంటూ పాలకులకో సవాల్ విసిరారు వైష్ణవి శ్రీ.



ఈ కార్యక్రమంలో తమ బాధ్యతగా చదివి వినిపించమని ఘంటా విజయ కుమార్, ప్రసాదమూర్తి, అమూల్య చందు, కోడె యామిని కవితలు పంపించారు. ఇలా చాలామంది రాలేనప్పటికీ తమ కవితలు పంపి రైతు పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. శిఖా ఆకాష్, వైష్ణవిశ్రీ కవి సమ్మేళనం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కె.సుబ్బరాజు, ఎపి స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, ఎఐటియుసి నాయకులు చలసాని రామారావు, ప్రజాశక్తి సంపాదకులు ఎంవిఎస్ శర్మ, రాజకీయ విశ్లేషకులు లక్ష్మీనారాయణ, జర్నలిస్ట్ యూనియన్ నాయకులు ఎస్కె బాబు, దారం వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు దడాల సుబ్బారావు, కెవిపిఎస్ కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి, ఎంబివికె విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ తదితరులు రైతుల ఆందోళనకు మద్దతుగా సంతకాలు చేసి ప్రసంగించారు. సాహితీ స్రవంతి ప్రతినిధి వొరప్రసాద్, జనసాహితీ అధ్యకులు దివి కుమార్, అరసం నాయకులు మోతుకూరి అరుణ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం కార్యదర్శి చలపాక ప్రకాష్, నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ, రచయిత, జర్నలిస్ట్ ఉష డ్యానీ, సామాజిక కార్యకర్త కెఎ దేవి తదితరులు ప్రసంగించి తమ మద్దతు తెలిపారు. ప్రజా నాట్యమండలి కళాకారులు పిచ్చయ్య, అనిల్ రైతులకు మద్దతుగా తమ గళాలు వినిపించారు. ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు గోళ్ల నారాయణరావు, అమరావతి బాలోత్సవ కార్యదర్శి కొండలరావు, తెలుగు ప్రచురణల సంఘం కార్యదర్శి కె.లక్ష్మయ్య, జనవిజ్ఞాన వేదిక బాధ్యులు శ్రీనివాస్, జాషువా సాంస్కృతిక వేదిక బాధ్యులు జి నారాయణ, షార్ట్ ఫిలిమ్స్ అయేసియేషన్ కార్యదర్శి డివి రాజు, ప్రస్థానం బాధ్యులు సత్యాజీ, ప్రముఖ మిమిక్రీ కళాకారులు సిల్వస్టర్, జర్నలిస్టులు రంగారెడ్డి, అజయ్ కుమార్, ఇంకా పలు జర్నలిస్ట్ సంఘాలు, సాహిత్య, సాంస్కృతిక కళా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆఖర్లో నిర్వాహకులు యు.వి.రామరాజు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి స్పందించిన రచయితలకు, కళాకారులకు ధన్యవాదాలు తెలిపారు. రైతు ఉద్యమాలకు ఇలాంటి కార్యక్రమాలు మరింత స్ఫూర్తిని అందిస్తాయని పేర్కొన్నారు.

**- వైష్ణవి శ్రీ**

**8074210263**

## ఘనంగా బోగ అంబయ్య స్మారక పురస్కారాల ప్రదానం

పాలమూరు జిల్లా ప్రసిద్ధ కవులకు, కళాకారులకు నిలయమని సావరీన్ ఎస్టేట్స్ అండ్ మల్టీట్రేడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బోగ కోదండపాణి అన్నారు. డిసెంబర్ 26న మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డలో గల సావరీన్ కార్యాలయంలో ప్రముఖ పాలమూరు కవి బోగ అంబయ్య స్మారక సాహిత్య, కళారంగ పురస్కారాలను పలువురు కళాకారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సాహిత్య, సాంస్కృతికరంగం బాగుపడాలంటే సాంప్రదాయ కళలను బతికించుకోవాలన్నారు. సంస్థ చైర్మన్ సుల్తాన్ పాషా మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో అనేక సామాజిక సాంస్కృతిక సాహిత్య కార్యక్రమాలను నిర్వహించామని, భవిష్యత్తులోనూ నిర్వహిస్తామని అన్నారు. అనంతరం బోగ అంబయ్య స్మారక సాహిత్య, సాంస్కృతిక పురస్కారాలను ప్రముఖ కవులు కె.లక్ష్మణ్ గౌడ్, డాక్టర్ చిక్కా హరీష్ కుమార్,



నటులు వి.నారాయణలకు, భూత్పూర్ దశరథ్ స్మారక ఫ్రెండ్లీ పోలీసు పురస్కారాన్ని ప్రముఖ కవి రంగినేని మన్మోహన్‌కు అందజేశారు. పురస్కార గ్రహీతలకు శాలువా, మెమెంటోలతో పాటు నగదు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారి డాక్టర్ విజయకుమార్, ప్రముఖ రంగస్థల నటులు బెల్లం సాయిలు, పాలమూరు సాహితి అధ్యక్షులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, సృజామి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 'వీక్షణం' 100వ సాహితీ సమావేశం

కాలిఫోర్నియా బే ఏరియాలోని 'వీక్షణం' సంస్థాపక అధ్యక్షులు డాక్టర్ కె.గీత ఆధ్వర్యంలో 'వీక్షణం' 100వ సాహితీ సమావేశం అంతర్జాల సమావేశంగా డిసెంబరు 12, 2020న విజయవంతంగా జరిగింది. డాక్టర్ కె.గీత, కిరణ్ ప్రభ, వేమూరి వేంకటేశ్వరరావు గార్లు స్వాగతోపన్యాసాలు చేశారు. ఈ సభకు విశిష్ట అతిథులుగా తానా పూర్వ అధ్యక్షులు జంపాల చౌదరి, వంగూరి ఫౌండేషన్ సంస్థాపకులు చిట్టెన్ రాజు వంగూరి విచ్చేసారు. ముందుగా జంపాల చౌదరి మాట్లాడుతూ, ఏ సంస్థ విజయానికైనా అభిరుచి కలిగిన సారథులు ముఖ్యమని అన్నారు. చిట్టెన్ రాజు వంగూరి వీక్షణానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ .. అమెరికాలోని రచయితలందరూ గొప్ప కథలు రాయాల్సిన ఆవశ్యకతని గుర్తుచేశారు. ఇటువంటి సాహితీ వేదికలు అందుకు స్ఫూర్తిదాయకాలవుతాయని అన్నారు. ఆరు వేదికలుగా జరిగిన ఈ కార్యక్రమంలో తరువాత 'డయాస్పోరా కథలు- స్థానిక కథా వస్తువులు' అనే చర్చావేదికను మృత్యుంజయుడు తాటిపాముల నిర్వహించారు. ఇందులో చిట్టెన్ రాజు వంగూరి, చంద్ర కన్నెగంటి, ఆరి సీతారామయ్య, వేమూరి వేంకటేశ్వరరావు, అనిల్ రాయల్, డాక్టర్ కె.గీత పాల్గన్నారు. రచయితలు తమ సామాజిక పరిధిని పెంచుకున్నప్పుడే స్థానిక కథ వస్తువుల మీద రాయగలిగే అవకాశం ఉంటుందని వక్తలు



అభిప్రాయపడ్డారు. ఆ తరువాత కవిసమ్మేళనం జరిగింది. 25 మందికి పైగా ప్రముఖ కవులు విభిన్నాంశాల మీద కవిత్వం వినిపించారు. పత్రికా నిర్వహణ- స్త్రీల ప్రాతినిధ్యం చర్చా వేదికను శారద కాశీవఝుల నిర్వహించారు. ఈ చర్చలో కాంతి పాతూరి (కాలిఫోర్నియా) కౌముది, లక్ష్మి రాయవరపు (కెనడా) తెలుగుతల్లి, దీప్తి పెండ్యాల (హ్యూస్టన్) మధురవాణి, డాక్టర్ కె.గీత (కాలిఫోర్నియా) నెచ్చెలి పాల్గొన్నారు. పత్రిక నిర్వహణలో తమ అనుభవాలను పంచుకుని కొత్తగా పత్రికా నిర్వహణలోకి అడుగుపెడుతున్న స్త్రీలకు ఆదర్శప్రాయంగా నిలిచారు. తరువాత కిరణ్ ప్రభ ఆధ్వర్యంలో జరిగిన సాహితీ క్విజ్, డాక్టర్ కె.గీత పాడిన లలిత, జానపద గీతాలు అందరినీ అలరించాయి. మధ్యాహ్నం నుంచి అష్టావధాన కార్యక్రమాన్ని రావు తల్లాప్రగడ నిర్వహించారు.


# 'చైతన్య జ్యోతి' కవితా సంపుటి ఆవిష్కరణ

శుక్రవారం (25.12.2020) జరిగిన అచ్చంపేట సాహితి ఆధ్వర్యంలో నల్లమల్ల ప్రాంతానికి చెందిన కవయిత్రి శ్రీమతి డాక్టర్ పోల సాయి జ్యోతి (తెలుగు ఉపాధ్యాయురాలు) రచించిన 'చైతన్య జ్యోతి' కవితా సంపుటి ఆవిష్కరణ జరిగింది. రాష్ట్ర జానపద అకాడమీ అధ్యక్షులు పొట్లూరి హరికృష్ణ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రొద్దుటూరి ఎల్లారెడ్డి, భోగ కోదండపాణి, వనపట్ల సుబ్బయ్య, రావూరి వనజ, శాంతా రెడ్డి, వేదార్థం మధుసూదన శర్మ పాల్గొన్నారు. పుస్తకాన్ని డాక్టర్



వి.భానుచందర్ సమీక్షించారు. సమన్వయకర్తలుగా రామోజీ, బషీర్, కమలేకర్ నాగేశ్వరరావు వ్యవహరించారు.

# స్వీకారం




## వేమన పద్యాలు

**వ్యాఖ్యానం :**
**ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి**
వెల : **రూ.100** పేజీలు: **132**
ప్రతులకు : **08562 – 255517**

సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, తన రజతోత్సవాల సందర్భంగా వేమన పద్యాలకు వ్యాఖ్యానం రాయమని కోరింది. పద్యానికి తాత్పర్యం చెప్పి, దానిని విస్తరించే ప్రణాళికతో ఈ వ్యాఖ్య రాశాను. ఈనాటి పాఠశాల విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని 100 పద్యాలను వ్యాఖ్యానించాను.

**- ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి**




## మాట (దీర్ఘ కవిత)

**రచన : చిన్ని నారాయణరావు**
వెల : **150** పేజీలు: **132**
ప్రతులకు : **94402 02942**

‘మాట’ అనే దీర్ఘ కవితను నారాయణరావు 18 భాగాలుగా రాశారు. ‘మాట’ గురించి అనేకానేక భావాలను, ‘మాట’కు సంబంధించిన ఆనందాన్ని వెలువరిస్తూ ఈ కావ్యాన్ని మొదలుపెట్టారు. ‘మాట’ లక్షణాన్ని గురించి చెప్పే నిర్వచనాలన్నీ లయబద్ధంగా, శబ్ద సౌందర్యాన్ని ప్రతిబింబిస్తూ రాయడం ఆహ్లాదం కలిగిస్తుంది.

**- కీ.శే. డా.అద్దేపల్లి రామ్మోహనరావు**



## మళ్లీ ఎప్పుడొస్తావక్కా?

**రచన : చందు సుబ్బారావు**
వెల : **120** పేజీలు: **124**
ప్రతులకు : **0891 – 2550093**

ఈ సంపుటిలో 17 కథలున్నాయి. కొన్ని కథలు ఇటు విశాఖనగరం, అటు తెనాలి పట్టణం మధ్యలో తిరుగుతూ ఉంటాయి. కొన్ని కథలు చందు సుబ్బారావు గారు మాత్రమే రాయగలిగే కథలుగా కన్పిస్తాయి. ఈ కథల్లో విమర్శనాత్మక దృష్టికోణం కన్పిస్తుంది. పురాణ గాథల్ని తనదైన దృష్టితో పునర్నిర్మాణం చేసిన కథలవి.

**- అట్టాడ అప్పల్నాయుడు**



## అనాహత (కవిత్వం)

**రచన : రవీంద్రసూరి నామాల**
వెల : **100/-** పేజీలు: **156**
ప్రతులకు : **9848321079**

అనాహత అంటే తగలకుండా వచ్చే శబ్దం. ఇంతటి నిగూఢమైన అర్థం కలిగిన బరువైన పేరు ఎందుకు పెట్టినట్టు అనే సందేహం కలగవచ్చు. కాని జీవితాన్ని తాత్త్వికతకు అన్వయించినప్పుడు దాని బరువు ఊహించనంతగా పెరుగుతుందనే విషయం రవీంద్రసూరి కనిపెట్టగలిగాడు. అందుకే ఈ పేరు పెట్టాడు. మంచి కవిత్వం కావాలనుకునే సాహితీ విమర్శకులకు ‘అనాహత’ ఒక అందిన ద్రాక్ష.

**- మౌనశ్రీ మల్లిక్**



## కోవిడ్-19

కథల సంకలనం

**సంకలనం : డి.ఎన్.వి.రామశర్మ**
వెల : **150** పేజీలు : **160**
ప్రతులకు : **0866 – 2430302, 9052101320**

కోవిడ్ విలయాన్ని, చూసి, అనుభవించి, అనుభవాల్ని విని – గుండెలు మండించుకున్న కథకుల సంవేదనలకి అక్షరరూపం ఈ సంకలనం. ఈ కథల్లో – కోవిడ్ సకల పార్శ్వాలూ స్పృశింపబడినై. ఆ మహమ్మారి, మనుషుల వ్యక్తిగత జీవితాల్నీ, సామూహిక బంధాల్నీ, సామాజిక వ్యవస్థల్నీ – ఎలా చిన్నాభిన్నం చేసిందో రచయితలు ఆవిష్కరించారు.

**- విహారి**



## ప్రాణం ఉన్నంత వరకు


ఆమె వ్యక్తిత్వం మారదు (నవల)

**రచన : షేక్ అహమద్ బాష**
వెల : **160** పేజీలు: **192**
ప్రతులకు : **0866 – 2430302**

అహమద్ బాషా గారు భారతీయ సాహితీ సంప్రదాయంలో సహజంగా పుట్టి పెరుగుతున్న రచయిత. అన్ని మతాల సారం ఒకటున్నదే ఆయన విశ్వాసం. ప్రపంచాన్ని ఇరుకు చేసే గోడల్ని కట్టి, దేశభక్తి పేరుతో విశ్వప్రేమను సంకుచితం చేయడాన్ని నిరసించే రవీంద్రనాథ్ టాగూర్ మార్గమే ఆయనదీను. తాను చెప్పదలుచుకున్న విషయాల్ని సూటిగా చెప్పే ధోరణినే ఎన్నుకున్నారు. పాఠకులు కూడా క్రమంగా ఆయా చర్చల్లో మనసు పెట్టేలా ఈ నవలను తీర్చిదిద్దారు.

**- మధురాంతకం నరేంద్ర**

# స్వీకారం



## ప్రేమ మొగ్గలు


**రచన : డా॥ భీంపల్లి శ్రీకాంత్**

**వెల : 30 పేజీలు : 56**

**ప్రతులకు : 90328 44017**

అంతు చిక్కని ఆలోచనలను బహిర్గతం చేస్తూ మురిపించేది, కవ్వించేదే ప్రేమంటే. ప్రేమ విశ్వాన్ని నడిపించే శక్తి. ప్రేమ మానవసంబంధాలను బలపరిచే సంపద. ప్రేమ లేకుంటే సృష్టి నిండా శూన్యమే నిండుకుంటదని భీంపల్లి మొగ్గలలో కనిపిస్తది. భీంపల్లి శ్రీకాంత్ వేసిన మొగ్గ విత్తనమై నేడు ప్రేమ మొగ్గలై ఇంటింటి ముందు విరబూసి అందరి హృదయాలపై ప్రేమ సంతకం చేస్తుంది.

**- బోల యాదయ్య**



## కోవిడ్-19

కథల సంకలనం

**సంకలనం : డి.ఎన్.వి.రామశర్మ**

**వెల : 150 పేజీలు: 160**

**ప్రతులకు : 0866 - 2430302, 9052101320**

ఇంత విలయాన్ని, చూసి, అనుభవించి, అనుభవాల్ని విని - గుండెలు మండించుకున్న కథకుల సంవేదనలకి అక్షరరూపం ఈ సంకలనం. ఈ సంకలనంలోని కథల్లో కోవిడ్ 19 - సకల పార్శ్వాలూ స్పృశింపబడినై. అన్ని బంధాల్నీ, అనుబంధాల్నీ, బాంధవ్యాల్నీ, అనేకానేక సమాజిక వ్యవస్థల్నీ - ఎలా చిన్నాభిన్నం చేసిందో- రచయితలు ఆయా కథల్లో ఆవిష్కరించారు.

**- విహారి**



## ఎంకటి కతలు

బడి పిల్లల విజయాల కతలు


**రచన : గరిపెల్లి అశోక్**

**వెల : 80 పేజీలు: 82**

**ప్రతులకు : 94417 01088, 98496 49101**

ఇవి స్ఫూర్తిని కలిగించే కథలు. పల్లె జీవితాలు, వలస బతుకులు, దిగువ, ఎగువ మధ్యతరగతి జీవితాల్లోని అనేక జీవన కోణాల్ని పట్టిచూపించే బ్లాక్ అండ్ వైట్ చిత్రాలు. వీటిని అశోకన్న రాయడం వెనుక పుస్తకం వేయాలన్న ఉబలాటం కాదు, రేపటి తరాలకు నిన్నటి జీవితాలను, విజయాలను వారసత్వ సంపదగా అందించాలన్న ఒక తపన, నిజమైన తండ్లాట కనిపిస్తోంది.

**- ప్రతిపాక మోహన్**



## మా బడి కతలు

బాల సాహిత్యం


**రచన : గరిపెల్లి అశోక్**

**వెల : 80 పేజీలు : 82**

**ప్రతులకు : 99899 22056**

ప్రస్తుతం తాను స్వయంగా రచించిన 15 బాలల కథల్ని ఒకచోట చేర్చి 'మా బడి కథలు'గా ప్రకటిస్తున్నాడు గరిపెల్లి అశోక్. తాను పాఠశాలల్లో పొందిన అనుభవాలు, విద్యార్థుల స్థితిగతులు చూసి చలించిన భావోద్వేగాలు, విద్యార్థుల - అధ్యాపకుల స్వభావాలు ఈ కథల్లో చిత్రమైనాయి. గ్రామీణ విద్యార్థులు ఎదర్కొంటున్న పేదరికం, అయినా తోసుకొనివచ్చే సహజ ప్రతిభ చాలా కథలకు వస్తువై శోభిస్తున్నది.

**- నందిని సిద్ధారెడ్డి**



## విశాఖ సంస్కృతి

ఉత్తమ బాలల కథలు

సంపాదకులు : **శిరేల సన్యాసిరావు**

**వెల : 100 పేజీలు : 92**

**ప్రతులకు : 96030 76777**

తూకం వేసి చూసినా సంపుటిలోని 17 కథల్లో అధికభాగం ఉత్తమ కథల కోవలోకి చెందుతాయి. జంతు పాత్రలున్న కథలు చదవడానికి పిల్లలు ఆసక్తి చూపిస్తున్నారని ఈ మధ్య ఒక సర్వే తెలిపింది. ఇందులోని రచయితలూ అదే కోవలో చిన్నారులకు చదివించేలా ప్రయత్నిస్తూ కథలు రాయడం సంతోషదాయకం.

**- నారంశెట్టి ఉమామహేశ్వరరావు**



## గాజు రెక్కల తూనీగ

కవిత్వం

రచన : **సాంబమూర్తి లండ**

**వెల : 120 పేజీలు : 136**

**ప్రతులకు : 9642732008**

ఈ సంపుటిలో దాదాపు నలభయ్యారు కవితలున్నాయి. నలభయ్యారు అనుభవాలవి. నలభయ్యారు అనుభూతులు, ఆశలు, ఆక్రోశాలు, ఆవేశాలు, ఆక్రందనలు... నీవీ, నావీ, అందరివీ! సరిహద్దు కాపలా కాసే సైనికుల నుంచి సక్కదనాల పల్లె పరాయీకరణ దాకా, రైతు, కార్మికుడు, ఉద్యోగీ ఎందరెందరి జీవితాలో కావ్య వస్తువులైనాయి.

**- అట్టాడ అప్పలనాయుడు**

# త్రిపురనేని రామస్వామి చౌదరి

15.1.1887 - 16.1.1943



హేతువాద ఉద్యమానికి ఊపిరి పోశారు. వైదిక ప్రాబల్యాన్ని సవాలు చేసే 'ఖూనీ', 'శంబుక వధ' వంటి నాటకాలు రాశారు. 'సూతపురాణం' తదితర కావ్యాలు వెలువరించి సంచలనం కలిగించారు.

SAHITYA PRASTHANAM ■ SAMPUTI - 2 ■ SANCHIKA - 4 ■ KRISHNA ■ January 2021
RNI NO.APTEL/2004/18396 ■ Postal Regd. No.VJ/187/2020-22 PAGES : 68
Date of Posting : 1st & 2nd of Every Month ■ Date of Publication : 27.12.2020

# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు




పేజీలు 32
రూ.10/-

## విప్లవం అంటే ఏమిటి?

భగత్‌సింగ్‌ను భారతదేశంలో తొలితరం మార్క్సిస్టుల్లో ఒకరుగా పేర్కొనవచ్చు. హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ పార్టీ స్థాపకుల్లో ఆయన ఒకరు. భారత్, బ్రిటన్ రాజకీయ ఖైదీలకు సమాన హక్కులు కల్పించాలని జైలులో 64 రోజులపాటు నిరాహారదీక్ష చేపట్టి బ్రిటీషు పాలకులకు సింహస్వప్నంగా నిలిచాడు. ఆయన రాసిన రెండు ముఖ్యమైన వ్యాసాలను ఈ చిన్న పుస్తకరూపంలో అందిస్తున్నాం. ఇవి నేటి యువతరానికి ఎంతో స్ఫూర్తినిస్తాయి.

## నాన్నా ఎందుకిలా చేశారు.



పేజీలు 32
రూ.10/-

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు లాలా లజపతిరాయ్‌ను కాల్చి చంపిన పోలీసు అధికారిపై ప్రతీకారం తీర్చుకోవడం, పార్లమెంట్ భవనంలో బాంబు విసరడం చేసినందుకు 1931 మార్చి 23న భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌లను ఉరితీశారు. భగత్ సింగ్ అమరుడై దాదాపు 90 ఏళ్లు కావస్తున్నా నేటికీ యువతరానికి వేగుచుక్కగా నిలిచాడు. ఆయన ఉరితీతకు ముందు తన కుటుంబీకులకు, విప్లవ సహచరులకు రాసిన లేఖలు నేటి యువతరానికి ఎంతో స్ఫూర్తినిస్తాయి. వాటన్నిటినీ ఈ చిన్న పుస్తకరూపంలో అందిస్తున్నాం.

భారతదేశ చరిత్రను మార్క్సిస్టు దృక్కోణంతో పరిశీలించిన గ్రంథమిది. భారతదేశ చరిత్ర చాలా సంగ్రహంగా ఇందులో చెప్పారు. మనదేశ చరిత్రలో జరిగిన విభిన్న సంఘటనలను మార్క్సిస్టు తత్వశాస్త్రమైన 'చారిత్రక భౌతికవాద సిద్ధాంత' దృక్పథంతో కామ్రేడ్ ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్ ఈ పుస్తకంలో పరిశీలించారు. భారతదేశంలో ఇంత వరకు జరిగిన సామాజిక మార్పులు, యుద్ధాలు వాటి వర్గ ధోరణి, సామాజిక మార్పుల్లో విభిన్న వర్గాల పాత్ర, భారతీయ సామాజిక వ్యవస్థ ప్రత్యేకతలు మొదలగువాటిని సంగ్రహంగాను, స్పష్టంగాను కామ్రేడ్ ఇ.ఎం.ఎస్. వివరించారు.

భారతదేశ చరిత్ర
ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్
పేజీలు 128 రూ.100/-





గతితార్కిక భౌతికవాదం
పేజీలు 104 రూ.85/-

మార్క్సిజాన్ని అధ్యయనం చేసేవారు గతితార్కిక భౌతికవాదాన్ని తెలుసుకొని తీరాలి. అందులోనూ కమ్యూనిస్టులైన వారికి ఇది విధి. గతితార్కిక చారిత్రిక భౌతికవాదాన్ని అధ్యయనం చేయకుండా కమ్యూనిస్టులైనవారు సరైన రాజకీయ అవగాహనకు కూడా రాలేరు. సరైన విధానాలనూ అనుసరించలేరు. అందుకు జరిగే ప్రయత్నంలో ఒక భాగంగానే ఈ పుస్తక రచన. మార్క్సిస్టు తత్వశాస్త్రాన్ని ఇంకా ఎక్కువ లోతుగా ఎక్కువ వివరాలతో అభ్యసించడానికి ఇది ప్రాతిపదికగా ఉపయోగపడుతుందనే ఆశతోనే దీని ప్రచురణ.

## ప్రజాశక్తి బుక్‌హౌస్

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ : 0866 - 2577533
**బ్రాంచీలు** : విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ,ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం

**If Un delivered please return to: Prasthanam, C/o M.B. Vignana kendram, 27-30-4, 3rd Floor Akulavari veedhi, Governorpet, Vijayawada - 520002. Ph: 0866-2577248, Cell: 9490099059**